: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
హైదరాబాద్
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

1-10-2026
గురువారం
సంపుటి: 32
సంచిక: 242
పేజీలు: 10+4
వెల: 6.50



# ఆసియా క్రీడల్లో 'పసిడి' పంట



### ఒకే రోజు నాలుగు స్వర్ణాలు
### ఆర్చరీ, షూటింగ్‌లో రాణింపు
### బాక్సింగ్, రెజ్లింగ్‌లో నాలుగు కాంస్యాలు
### భారత్‌కు మొత్తం 60 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడలు 2026లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌లలో భారత్ అత్యంత విజయవంతమైన రోజును ఆస్వాదించింది. నాలుగు స్వర్ణ పతకాలతో అద్భుత విజయాన్ని సాధించింది. మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్, పురుషుల టీమ్‌ఈవెంట్లలో ఆర్చరీలో భారత్ హ్యాట్రిక్ స్వర్ణా >>2



# పంటలకు మద్దతు ధర పెంపు

● రైతులకు మోడీ సర్కార్ తీపి కబురు ● కుసుమకు అత్యధికంగా రూ.675 ● ఆవాలు రూ.413, గోధుమకు రూ.25 ● 3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ ● ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఓ వైపు ఎల్‌నినో.. ఇంకోవైపు తీవ్ర వర్షాభవకారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో మోడీ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రబీ పంటల్లో కుసుమ మద్దతుధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ.675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ.413 పెంపు ప్రకటించారు. మసూర్‌పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పి పెంచారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పి ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి >>2



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఖర్గే, సోనియా, రాహుల్ తదితరులు

## ఇసిపై రణభేరి
# 'సేవ్ డెమొక్రసి మార్చ్'

### రేపటి నుంచి ఇండియా కూటమి దేశవ్యాప్త ఆందోళన
### 6న ఇసి కార్యాలయం ముట్టడి
### కార్యాచరణ ప్రకటించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
### కేంద్రం, ఇసి ముందుకు 6 డిమాండ్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చోటు చేసుకున్న అవకతవకలపై విపక్ష 'ఇండియా' కూటమి తీవ్రస్థాయి పోరాటానికి కార్యాచరణ ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో సమావేశమైన కూటమి అగ్రనేతలు భవిష్యత్ ఉద్యమ ప్రణాళికపై కీలక తీర్మానాలు ఆమోదించారు. సమావేశం అనంతరం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివరాలను వెల్లడించారు. అక్టోబరు 2వతేదీ మహాత్మాగాంధీ జయంతి నుంచి అక్టోబరు 8 వరకు దేశవ్యాప్తంగా 'సేవ్ డెమొక్రసీ మార్చ్' నిర్వహిస్తున్నట్లు ఖర్గే ప్రకటించారు. దేశంలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఈ మార్చ్ జరుగుతుందని, అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట విపక్ష శ్రేణులు భారీ ఎత్తున ధర్నాలు చేపడతాయని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ అక్టోబరు 6వ తేదీన కూటమికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలంతా కలిసి దేశ రాజధానిలోని కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ప్రధానకార్యాలయాన్ని ముట్టడిస్తా >>2

# ఉరిసిల్లగా మారిన సిరిసిల్ల

## నేతన్నల ఊపిరి తీసిన పదేళ్ల బిఆర్ఎస్ పాలన



బుధవారం సిరిసిల్ల బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, సభకు అసంఖ్యాకంగా హాజరైన జనసందోహం

### అరడజనుసార్లు గెలిచినా నేతన్నల వలసలు ఆపలేకపోయిన కెటిఆర్
### ప్రజల ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకొన్న కల్వకుంట్ల కుటుంబం
### వెయ్యిరోజుల పాలనలో నేతన్నల కోసం రూ. 1741 కోట్లు ఖర్చుచేశాం
### సిరిసిల్ల బహిరంగ సభలో సిఎం రేవంత్

**సిరిసిల్ల బ్యూరో సెప్టెంబరు 30, ప్రభాతవార్త :** ధైర్యం, దైవం కలిసి వెలిసిన పవిత్ర ప్రాంతం సిరిసిల్ల అని, వేములవాడ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవచింతనతో పాటు నిజాం రజాకార్లపై వీరోచితంగా పోరాడిన ఘన చరిత్ర ఇక్కడి ప్రజలదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రమని, వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా అయిన సిరిసిల్ల, 10 యేళ్ల బిఆర్ఎస్ హయాంలో 'ఉరిసిల్ల'గా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో మంగళవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో సిఎం ప్రశంగించారు.

**కెటిఆర్ చావు తప్పి గెలిచారు**

2009లో కెకె మహేందర్ రెడ్డి సిద్ధం చేసుకున్న స్థానంలో, చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు కెటిఆర్ చేరి కేవలం 171 ఓట్లతో చావు తప్పి గెలిచారని ఎద్దేవా చేశారు. 2009 నుంచి 2023 వరకు అరడజను సార్లు ఎన్నికల్లో గెలిచినా చేనేత కార్మికుల ఆత్మహత్యలను, గల్ఫ్ వలసలను కెటిఆర్ ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజలేసిన ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకుని, కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతికి పాల్పడి ప్రపంచంలోనే అత్యంత ధనిక కుటుంబంగా ఆవిర్భవించిందని ఆరోపించారు. అమెరికాలో బాత్రూమ్‌లు కడిగిన కెటిఆర్ ఇన్ని వేల కోట్లు ఎలా సంపాదించారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**మానేరు ఇసుక దోపిడీ - గోదావరి జలాల వంచన:**

గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని రవీందర్ రావు, సంతోష్ రావు, కెటిఆర్‌లు మానేరు ఇసుకను దోచుకున్నారని, దానికి నేరెళ్ల బాధితులే సజీవ సాక్ష్యమని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ స్పీకర్ మీరా కుమారిని ఇక్కడికి తీసుకొస్తే పోలీసులతో నిర్బంధించారని విమర్శించారు. కాళేశ్వరం >>2

## ఫామ్6లో అదనపు డిక్లరేషన్ తొలగింపు

### 'సర్'పై వివాదం వేళ కొత్త ఓటర్లకు శుభవార్త

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఓటర్ల నమోదు ప్రక్రియలో కీలక నిర్ణయం తీసుకుంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన రాష్ట్రాల్లో, కొత్త ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారి సౌలభ్యం కోసం ఫారమ్6లో పొందుపరచిన అదనపు డిక్లరేషన్‌ను ఎలక్షన్ కమిషన్ వెనక్కి తీసుకుంది. ఈ మేరకు అధికారికంగా చర్యలు చేపట్టిన ఇసి, సంబంధిత రాష్ట్రాల్లోని ఇసినెట్ >>2

## నేడు కేబినెట్ సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** రాష్ట్ర సవాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం (అక్టోబర్ 1న) సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డిఎల మంజూరుతో పాటు మరికొన్ని కీలక అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు మొదటి డిఏ 3.64 శాతం, రెండో డిఏ 2.74 శాతం మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. డిసెంబరు నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై కేబినెట్ చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం విధి విధానాలపై చర్చించే అవకాశంఉంది. కుటుంబ యజమాని మరణిస్తే ఐదు లక్షల రూపాయల బీమా ఇచ్చే ఈ పథకాన్ని వచ్చే నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున >>2

## జగన్, మమత, పవార్
# మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలి

### పార్టీని, దేశాన్ని బలోపేతం చేయాలి
### వైఎస్‌తో అనుబంధం మరువలేను..
### సిఎం రేవంత్‌తో ఎలాంటి విభేదాల్లేవు
### కొచ్చిలో జరిగిన కాన్‌క్లేవ్ సౌత్‌లో డి.సిఎం భట్టి



**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి.. ఆ తర్వాత వివిధ కారణాలతో పార్టీని వీడి ఇతర పార్టీలను ఏర్పాటు చేసిన వారు, ఇతర పార్టీల్లో చేరిన మాజీ కాంగ్రెస్ నేతలకు తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కీలక పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్‌ను వీడిన నేతలు తిరిగి పార్టీలోకిరావాలని.. హస్తం పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు వారంతా కలిసి పనిచేయాలని కీలక సూచనలు చేశారు. కేరళలోని కొచ్చిలో జరుగుతున్న ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో బుధవారం పాల్గొన్న భట్టి విక్రమార్క.. ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన పాత నేతలంతా తిరిగి పార్టీలో చేరితే తాను చాలా సంతోషిస్తానని భట్టి విక్రమార్క చెప్పారు. పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను వీడిన నేతలు తిరిగి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తాను వైఎస్సార్‌తో కలిసి పనిచేశానని.. అయితే ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోకలిసి పనిచేయలేదనిస్పష్టం చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్ జగన్ >>2

# ఒంటరిగానే పోటీ

### వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే
### దామాషా ప్రకారం సీట్లు పెంచితేనే మద్దతు
### కొచ్చి సదస్సులో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు30:** తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. బుధవారం కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సదస్సులో కెటిఆర్ పాల్గొన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ బిజెపితో బిఆర్ఎస్‌కు ఎలాంటి పొత్తు ఉండదని స్పష్టం చేశారు. గత 26 యేళ్లలో బిజెపితో బిఆర్ఎస్ ఒక్కసారి కూడా పొత్తు పెట్టుకోలేదని, 2014, 2018, 2023 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసిందని చెప్పారు. భావజాల పరంగా, సైద్ధాంతికంగా బిఆర్ఎస్ బిజెపికి వ్యతిరేకమని, అలాంటప్పుడు ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకుంటామని కేటీఆర్ ప్రశ్నించారు.
డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను కెటిఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే జనాభా నియంత్రణను



సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా గతంలో సుమారు 24 శాతం ఉండగా, ప్రస్తుతం 19 శాతానికి తగ్గిందని తెలిపారు. పార్లమెంట్ సీట్లు పెంచాలనుకుంటే అసెంబ్లీ స్థానాలను కూడా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. దామాషా >>2



# ఖరీఫ్ ఖాళీ..

● పక్కా వ్యూహాలు తప్పనిసరి ● పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలి ● 'ప్రతి బొట్టుకు అధికపంట' కార్యక్రమం రూపొందించాలి ● కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మార్గదర్శకాలు

## ఎల్‌నినో ఊబిలో రబీ!

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావం కారణంగా, ముఖ్యంగా వర్షాధార ప్రాంతాలలో, రాబోయే రబీ సీజన్‌లో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రం హెచ్చరించింది. అందుకు అనుగుణంగా వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే రబీ ప్రణాళికను పక్కాగా రాష్ట్రాలు రూపొందించుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆతిష్ చంద్ర రాష్ట్రాలకు మార్గదర్శకాలు, పలు సూచనలు >>2

భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు 3లో

ఇబి-5 గ్రీన్ కార్డు ఫీజు భారీగా పెంపు
విదేశీ పారిశ్రామికవేత్తలకు అమెరికా షాక్ 5లో

ఇంట్లోంచి బయటకు రాలేకపోతున్నా: మమత



పశ్చిమ బెంగాల్‌లోని బేలూర్‌ఘాట్‌లో దుర్గా పూజకోసం విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

# కేబినెట్ సమావేశం

>> ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితానుంచి ఊరట కలిగించే అంశాలు, నూతన చేయూత పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్ఆర్ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపై కూడా చర్చ జరిగే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేయనున్నట్లు తెలుస్తోంది.

# డిక్లరేషన్ తొలగింపు

>> (ఇసిఎన్ఇటి) యాప్, పోర్టల్ అలాగే ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి (ఎస్ఇసి) వెబ్‌సైట్ల నుంచి ఈ అదనపు డిక్లరేషన్ ఆప్షన్‌ను పూర్తిగా తొలగించింది.

తాజా మార్పుతో సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగిసిన రాష్ట్రాల్లో కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే యువతకు, అర్హులైన పౌరులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ నిర్ణయంతో కొత్త ఓటర్లు గతంలో జరిగిన ఎస్ఐఆర్ సర్వే వివరాలు, తమ తల్లిదండ్రులు, తాతముత్తాతలకు సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలను లింక్ చేయాల్సిన అవసరం ఉండదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ పద్ధతిలోనే తమ వ్యక్తిగత వివరాలు, వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించి నేరుగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించారు. ఇక, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ఈ మినహాయింపు వర్తించదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఏయే రాష్ట్రాలు, ప్రాంతాల్లో సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇంకా కొనసాగుతుందో, అక్కడ మాత్రం ఫారమ్6తో కూడిన ఈ అదనపు డిక్లరేషన్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

# 'పసిడి' పంట

>> లను పూర్తి చేసింది. చైనాపై సంచలనాత్మక పునరాగమనం తర్వాత పురుషుల జట్టు స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. మిక్స్‌డ్ ట్రాప్ టీమ్ కూడా షూటింగ్‌లో స్వర్ణం సాధించి, ఈ స్వర్ణ ప్రదర్శనకు మరింత వన్నె తెచ్చింది. భారత బాక్సర్లు కూడా మూడు కాంస్య పతకాలను అందించారు. ప్రియా ఘంగాస్, నరేంద్ర బెర్వాల్, కపిల్ పోఖరియా పోడియంపై నిలిచారు. ఈ ఈవెంట్‌లో రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి పతకాన్ని సునీల్ కుమార్ కాంస్యంతో అందించాడు. భారత మహిళల హాకీజట్టు దక్షిణ కొరియాను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈవిజయంతో ఐచినగోయా ఆసియా క్రీడల్లో భారత్ పతకాలసంఖ్య మరింతపెరిగింది. ప్రస్తుతం భారత్ 10 స్వర్ణాలు, 21 రజతాలు, 29 కాంస్యాలతో మొత్తం 60 పతకాలు సాధించి మెడల్ టేబుల్‌లో 8వ స్థానానికి చేరుకుంది.

# అత్యాచారం కేసులో దోషికి 20 యేళ్ల జైలు శిక్ష

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కోహెడలో మహిళపై అత్యాచారం కేసులో దోషికి 20 యేళ్ల జైలుశిక్ష విధించారు. 2019లో మహిళపై నిందితుడు ఇస్తారి అత్యాచారం చేశారు. దోషికి 20 యేళ్ల జైలుశిక్ష, రూ.5 లక్షల జరిమానా జిల్లా కోర్టు విధించింది.

# గవర్నర్‌ను కలిసిన బిజెపి ఎంపి రఘునందన్ రావు

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** అక్టోబర్ 6న గవర్నర్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి రఘునందన్ రావు గవర్నర్‌ను బుధవారం లోక్‌భవన్‌లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు 30 వేల చెట్లు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4న తూప్రాన్ లో కేంద్రమంత్రి అమిత్ షా పర్యటిస్తారన్నారు. దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద అమూల్ చిల్లింగ్‌సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు.

# మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలి

>> కాంగ్రెస్‌ను వీడి 2011లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన విషయాన్ని గుర్తు చేసిన భట్టి విక్రమార్క.. కాంగ్రెస్‌ను విడిచిపెట్టిపోయిన నేతలు తిరిగి వస్తే పార్టీని మరింత బలోపేతం చేయడానికి కలిసి పనిచేయవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లి సొంత రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన పలువురు ప్రముఖ నేతలు ఉన్నారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 1998లో కాంగ్రెస్‌ను వీడి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అలాగే 1999లో శరద్ పవార్, పిఎ సంగ్మా, తారిఖ్ అన్వర్ కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. ఇక ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీని వీడి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌ను వీడిన నేతలకు భట్టి విక్రమార్క చేసిన పిలుపు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పైనా భట్టి విక్రమార్క మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కల్పించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఎస్ఐఆర్ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని.. దీని వల్ల ప్రజల్లో అనుమానాలు ఏర్పడుతున్నాయని భట్టి ఆరోపించారు. కాంగ్రెస్ సహా దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్షాలు అన్నీ ఈ ఆరోపణలు చేస్తుండగా.. ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు చట్టపరమైన ప్రక్రియలో భాగమేనని చెబుతోంది. ఓటింగ్‌పై అనుమానాలు ఉంటే బ్యాలెట్ పేపర్ల వినియోగం ద్వారా ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటూ వచ్చిన వార్తలు కూడా ప్రజల్లో అనుమానాలకు కారణం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిప్యూటీ సిఎం భట్టి డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బిజెపికి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 5 గ్యారంటీ పథకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగపడతాయని,రాష్టంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ఆయన ప్రస్తావించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని చెబుతూ.. రైతులకు ఆర్థిక సహాయం అందితే వారు సాగులో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంటుందని వివరించారు.

తెలంగాణకు కేంద్ర పన్నుల వాటా విషయంలోనూ భట్టి విక్రమార్క తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రాష్ట్రం కేంద్రానికి చెల్లించే పన్నులతో పోలిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చే వాటా తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదే అంశంపై తెలంగాణతోపాటు మిగిలిన దక్షిణాది రాష్ట్రాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. దేశం సమాఖ్య వ్యవస్థలో భాగమని.. రాష్ట్రాలు అందించే ఆదాయానికి అనుగుణంగా న్యాయమైన వాటా దక్కేలా కేంద్రం వ్యవహరించాలని భట్టి కోరారు. ఈ విషయంలో కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని పాటించాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తన సంబంధాలపై కూడా భట్టి విక్రమార్క స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తోందని చెప్పారు. నేతలంతా కలిసి చర్చించి, నిర్ణయాలు తీసుకుని కాంగ్రెస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తనను కులం ఆధారంగా చూడకూడదని.. కాంగ్రెస్‌లో పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్త.. పార్టీకి చెందినవారేనని భట్టి వ్యాఖ్యానించారు. తన రాజకీయ భవిష్యత్తు, నాయకత్వ ఆకాంక్షలను కుల సమీకరణాలతో చూడడం సరికాదన్న భావనను ఆయన వ్యక్తం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు.

# ఉరిసిల్లగా మారిన సిరిసిల్ల

>> ప్యాకేజీ 9, 10, 11, 12లను పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల ఇక్కడి రైతులకు నీళ్లు అందలేదని, మానేరుపై కట్టిన చెక్ డ్యామ్‌లు కొట్టుకుపోయి కెసిఆర్ ఇంట్లో నోట్ల కట్టలుగా తేలాయని దుయ్యబట్టారు. మిడ్ మానేరు ముంపులో కెసిఆర్ కుటుంబ సభ్యులు ఇండ్ల స్థలాలు పొందలేదా అని నిలదీశారు. వేములవాడ శివయ్యను, భద్రాచలం రామయ్యను మోసం చేసిన ఏకైక వ్యక్తి కెసిఆర్ అని మండిపడ్డారు.

**ప్రజా పాలనలోనే సంక్షేమం - అభివృద్ధి:**

వెయ్యి రోజుల ప్రజా పాలనలో చేనేత కార్మికుల కోసం ..1,741 కోట్లు ఖర్చు చేశామని సిఎం తెలిపారు. బతుకమ్మ చీరల పాత బకాయిలు ..350 కోట్లు చెల్లించామని, గతంలో ఇచ్చిన చీరలను ఆడపిల్లలు కట్టుకోకపోగా అందులోనూ కమిషన్లు కొట్టేశారని ఆరోపించారు. ఈ పండుగకు నాణ్యమైన చిలక చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 1.6 కోట్ల కుటుంబాల్లోని 3,46,00000 లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ..12,000 కోట్లు చెల్లించిందని వివరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను గత పాలకులు పట్టించుకోలేదని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించలేకపోయారని విమర్శించారు. తమ పాలనలో శ్రీకాంతాచారి తల్లికి, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులకు మహిళా కమిషన్‌లో స్థానం కల్పించి గౌరవించామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ ఎంపి వేమూరి నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, ప్రభుత్వ సలహాదారు వర్కర్ వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్ మోహన్ రావు, లక్ష్మీ ్రకాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీగణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ కోటలో రేవంత్ మార్క్ సమరం

**సిరిసిల్ల బ్యూరో సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల గడ్డపై ప్రజాపాలన రణభేరి మోగింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం ఉప్పొంగింది. గులాబీ పార్టీ కంచుకోటగా భావించే సిరిసిల్ల నేలపై కాంగ్రెస్ జనసముద్రం నిండిపోవడంతో కార్యకర్తల కొలాహలం, జై కాంగ్రెస్ నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది.

**కెటిఆర్ ఫ్యామిలీపై పదునైన బాణాలు**

పర్యటనలో భాగంగా రూ.345.78 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు,'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' మరియు 'నేతన్న బజార్' నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్ రెడ్డి, అనంతరం తనదైన పవర్ ఫుల్ శైలిలో ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. కెటిఆర్ కుటుంబం మరియు బిఆర్ఎస్ గత పాలనా తీరుపై ముక్కుసూటిగా విమర్శల దాడి చేశారు.

"సిరిసిల్ల నేతన్నల భావోద్వేగాలను, ప్రజల నమ్మకాన్ని ఓట్లుగా మార్చుకున్న కెటిఆర్ కుటుంబం.. వాటిని తమ స్వార్థం కోసం పచ్చ నోట్లుగా మార్చుకుంది. సిరిసిల్ల అభివృద్ధిని గాలికి వదిలేసి, వేల కోట్ల రూపాయలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు" అని రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చేనేత కార్మికులకు చెల్లించాల్సిన రూ. 300 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, తాము అధికారంలోకి రాగానే నేతన్నల సంక్షేమానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

సిరిసిల్ల ప్రజలు చూపించిన అపూర్వ ఆదరణతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. ముఖ్యమంత్రి ప్రసంగం అంతటా ఇచ్చిన భరోసా, నేతన్నలకు అండగా ఉంటామని ఇచ్చిన హామీలు స్థానిక ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత పదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడంతో పాటు, కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుతామని సిఎం ప్రకటించడంతో ప్రతిపక్షాల కోటలు బద్దలవుతున్నాయని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు.

సిఎం రేవంత్ సభ విజయవంతం కావడం రాబోయే రోజుల్లో సిరిసిల్లతో పాటు ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులకు సంకేతంగా నిలిచిందని భావిస్తున్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రిని చేస్తానని రేవంత్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. మొత్తం మీద సిరిసిల్లలో రేవంత్ రెడ్డి ప్రసంగం అందరిని ఆకట్టుకుంది.

## వారం - వర్జ్యం

01-10-2026, గురువారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె
తి.పంచమి మ.12.35,
న. కృత్తిక ఉ.6.02, రోహిణి తె .4.27,
వ.మ.1.30 -సా.4.29,2) సా 4.31 - రా.7.30,
దు.ఉ.9.57-ఉ.10.45,2)మ.2.45- మ.3.33,
రాహు.మ.1.30-మ.3.00,
శుభ.స.ఉ.6.30-ఉ.7.30.

## వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా సానుకూలంగా ఉంటుంది. సంఘంలో పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి.ఆరోగ్యం మెలకువ అవసరం.

**వృషభం :** వివాదాలకు దూరంగా వుండటం అన్ని విధాలా మంచిది.ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటారు.

**మిథునం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. పనులలో జాప్య జరిగినా చివరికి పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**సింహం :** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొత్త మిత్రులు పరిచయమై సహాయం అందిస్తారు.

**కన్య :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు.

**తుల :** చిన్ననాటి మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. అనారోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**వృశ్చికం :** భాగ్యహ యోగాలు లాభిస్తాయి. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**ధనుస్సు :** కోపతాపాలు దూరంగా వుండటం అన్ని విధాలా మంచిది. భాద్యతలు పెరుగుతాయి. వృత్తిలో ఫలితం దక్కుతుంది.

**మకరం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. పదోన్నతులు పొందుతారు.

**కుంభం :** శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. వస్తులాభాలు, పొందుతారు.

**మీనం :** నూతన ఉద్యోగాలలో చేరతారు. ప్రయాణాలలో లాభాలు పొందుతారు. సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఖరీఫ్ ఖాళీ..

>> చేసింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కూడా పంటల సాగు ఆటుపోట్లను ఎదుర్కొంటోందని తెలిపింది. అనేక రాష్ట్రాలు సాధారణ పంట సగటులను సాధించడానికి, విత్తిన పంటల దిగుబడులను నిర్ధారించడానికి బ్బంది పడుతున్నాయి. ఇది ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేసింది. అలాగే రబీ సీజన్‌లో కూడా పంటల సాగు, దిగుబడి ఒక సవాలుగా మారవచ్చని భావిస్తోంది. ప్రధానంగా వర్షాభావ పరిస్థితులు ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చని అంచనా వేసింది. కేవలం వర్షాధార ప్రాంతాలు మాత్రమే ఇబ్బందులను ఎదుర్కోవడం లేదని, నీటిపారుదల ప్రాంతాలలో కూడా కొన్నిచోట్ల అకాల, భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయని కేంద్రం గుర్తించింది. అందువల్ల, రబీ సీజన్ కోసం వ్యూహాలను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే, ప్రభుత్వాలు తక్షణమే ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కేవలం జలాశయాల నీటిమట్టాల ఆధారంగా మాత్రమే సంసిద్ధతను అంచనా వేయకూడదని, దానికి బదులుగా, రుతుపవనాలు విఫలమైనా లేదా అస్తవ్యస్తంగా ఉన్నా ఎంతమంది రైతులు ఈ పరిస్థితులకు తట్టుకోగలరో ఈనేది నిర్ధారించాలని సూచించింది. అలాగే భూగర్భ జలమట్టాలను అంచనా వేయడం, రబీ సీజన్‌లో నీటి అవసరాలను ఎలా తీర్చాలనే దానిపై ప్రణాళిక రచించడం ద్వారా వాటిని అంచనా వేయాలని తెలిపింది. వాతావరణ మార్పు ఒక వాస్తవమని ఇరు ప్రభుత్వాలు ముందుగా గుర్తించాలని, అదే సమయంలో దాని ప్రభావం వేగంగా పెరుగుతోందని, కాబట్టి ప్రభుత్వాలు సుస్థిరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. స్వయం సమృద్ధి సాధించేందుకు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది. ఏ పంటలను ప్రోత్సహించాలనేది కేవలం రాయితీల కోణం నుంచే కాకుండా, క్షేత్రస్థాయిలో అంచనా వేయాల్సి ఉంటుంది. "ప్రతి బొట్టుకు అధిక పంట" వంటి కార్యక్రమాలు, నేల ఆరోగ్య కార్యక్రమాలు వంటి వాటి ప్రభావాన్ని కేవలం రాయితీల పంపిణీ పరంగా కాకుండా క్షేత్రస్థాయిలో అంచనా వేయవలసి ఉందని తేల్చిచెప్పింది. దీనితో పాటు, పంట కోత అనంతర మరియు వ్యవసాయ నష్టాలను తగ్గించడానికి ప్రభుత్వాలు వ్యవసాయ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించాలని పేర్కొంది. పండ్లు, కూరగాయల కోసం పటిష్టమైన మార్కెట్ వ్యవస్థలను, సేకరణ యంత్రాంగాలను ఏర్పాటు చేయడం అనేది పరిష్కరించాల్సిన కీలకమైన సమస్యగా వెల్లడించింది. అదే విధంగా, వర్షపాతంలో హెచ్చుతగ్గులకు గురయ్యే వేరుశనగ, పప్పుధాన్యాలు, ఇతర మెట్ట పంటల వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. తెలంగాణకు పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి పంటలలోనే అసలు సవాలు ఉంది. రాజకీయాల కన్నా జలాశయాలు, భూగర్భ జలాల నిర్వహణకే ప్రాధాన్యత ఇవ్వాలి. సాగునీటి సౌకర్యాలు పెరగడంతో తెలంగాణలో వరి సాగు గణనీయంగా విస్తరించింది.

కానీ ఈ ఏడాది రుతుపవనాల నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున, నీటి నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అత్యవసరం. పంటల వైవిధ్యం వైపు రైతులను ఒప్పించడం అంత సులభమైన పని కాదని, అందువల్ల, ప్రభుత్వం ఇప్పటి నుంచే వారిని ఒప్పించే ప్రక్రియను ప్రారంభించాలి. కనీసం సగం మంది రైతులు పంటల వైవిధ్యానికి అంగీకరించి, పప్పుధాన్యాల వంటి తక్కువ నీటి వినియోగం గల పంటలను ఎంచుకుంటే, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం సరైన, సకాల కొనుగోలుతో పాటు తగినంత మార్కెట్ మద్దతును కూడా అందించాల్సి ఉంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆతిష్ చంద్ర రాష్ట్రాలకు సూచించారు.



బుధవారం సిరిసిల్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో లబ్దిదారులకు పంపిణీ చేస్తున్న సిఎం రేవంత్

# ఒంటరిగానే పోటీ

>> ప్రకారం సీట్లు పెంచితేనే మద్దతు ఇస్తామని చెప్పారు. అస్సాం, జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ సీట్లు పెంచినప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎందుకు పెంచలేదని కేటీఆర్ ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ ప్రభావం తక్కువగా ఉండటం వల్లే సీట్ల పెంపును పట్టించుకోవడం లేదన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన హామీలపై తమకు నమ్మకం లేదన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 ఎన్నికల్లో 420కి పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిలో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్ఆర్ఆర్-రికాల్,రిగ్రెట్,రివాయిట్ పరిస్థితి కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు పునరాలోచిస్తున్నారని, ఈ అసంతృప్తి తిరుగుబాటు దిశగా మారుతోందని చెప్పారు.

2022 నాటికే ప్రతి ఇంటికీ మంచినీరు, బుల్లెట్ రైళ్లు, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వంటి లక్ష్యాలు సాధించాల్సి ఉండగా, వాటి పరిస్థితి ఏమిటని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించకుండా యుసిసి, వందేమాతరం వంటి అంశాలపై దృష్టి పెట్టడం ఎందుకని అన్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారిందని కెటిఆర్ అన్నారు. ఎన్నికల సంఘంలో జరుగుతున్న పరిణామాలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరిపించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర దర్యాప్తు చేయించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన నైతిక బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాల్సిందని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌పై కేటీఆర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయడం అవసరమేనని, అయితే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని అన్నారు. బిఆర్ఎస్ గెలిచిన 39 నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓట్లు తొలగించారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌పై నెలకొన్న అనుమానాలు, ఆందోళనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని కోరారు. జెన్‌జీ ఉద్యమాలపై స్పందించిన కేటీఆర్.. దేశంలో యువత ఉద్యమించడం కొత్తేమీ కాదని, తెలంగాణ ఉద్యమం కూడా అదే తరహాలో సాగిందని అన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై యువత, ముఖ్యంగా జెన్‌జీ తీవ్ర ఆగ్రహంతో ఉందని చెప్పారు. సమస్యలపై యువత ప్రశ్నిస్తుంటే కేంద్ర ప్రభుత్వం దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం యువత ప్రశ్నిస్తుంటే పట్టించుకోవడం లేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి ఇచ్చిన హామీ ఏమైందని కెటిఆర్ ప్రశ్నించారు. ఉద్యోగాలపై సమాధానం ఇవ్వకుండా దృష్టి మళ్లించడం సరికాదని, ఇంకెంతకాలం మతం పేరుతో దేశాన్ని విభజిస్తారని ప్రశ్నించారు.

# మద్దతు ధర పెంపు

>> 2013-14 మధ్య ఇది 2,254 లక్షల టన్నులుగా ఉంది. ఆరు రబీ పంటల సేకరణ కూడా ఇదే కాలంలో 3,921 లక్షల టన్నులకు చేరింది. గతంలో ఇది 2,302 లక్షల టన్నులుగా ఉండేది. గోధుమ రైతులకు 2014-15 నుంచి 2025-26 మధ్య మద్దతు ధర రూపంలో రూ.7.31 లక్షల కోట్లు చెల్లించారు. 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించిన రూ.2.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. ఆరు రబీ పంటలు పండించే రైతులకు ఇదే కాలంలో రూ.8.36 లక్షల కోట్లు ఎంఎస్‌పిగా చెల్లించగా.. అంతకుముందు కాలంలో రూ.2.65 లక్షల కోట్లు చెల్లించారు.

**ఢిల్లీ ఐటిఎంఎస్‌కు రూ.1,790 కోట్లు కేటాయింపు:**

దేశ రాజధాని ప్రాంతంలో రవాణా వ్యవస్థను సమూలంగా మార్చడం, ట్రాఫిక్ నిర్వహణను మరింత ఆధునీకరించే దిశగా కేంద్రం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఢిల్లీలోని ఐటిఎంఎస్ ప్రాజెక్ట్ కోసం రూ.1,790 కోట్లు కేటాయిస్తున్నట్లుగా కేబినెట్ ప్రకటించింది. దీనివల్ల నగరంలో రవాణా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ మరింత మెరుగవుతుంది.

**గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదం**

దేశంలో హరిత ఇంధన రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3' ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం లభించింది. దేశంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచి, దానిని జాతీయ గ్రిడ్‌కు సజావుగా అనుసంధానించడమే ఈ మెగా ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఈ ప్రతిష్టాత్మక పథకం ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 135 గిగావాట్ల మేర పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌లోకి అనుసంధానించనున్నారు.

ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,86,405 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించడానికి, నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి 50 గిగావాట్ అవర్ (జిడబ్ల్యుహెచ్) సామర్థ్యం కలిగిన అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.54,082 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. 2032-33 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ పథకం పనులన్నింటినీ పూర్తిగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 'సేవ్ డెమొక్రసి మార్చ్'

>> రని ఖర్గే హెచ్చరించారు. నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్‌ను తమ కనుసన్నల్లో పనిచేసే తోలుబొమ్మలా వాడుకుంటున్నారని ఖర్గే ఘాటుగా ఆరోపించారు. ఎన్నికల సంఘం అండతోనే బిజెపి వరుసగా ఎన్నికల్లో గెలుస్తోందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అక్టోబరు రెండో వారంలో ఇండియా కూటమి ప్రతినిధి బృందం భారత రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పిస్తుందని తెలిపారు. ప్రజాక్షేత్రంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు దేశవ్యాప్తంగా ఐదు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన పర్వంలో భాగంగా నవంబరు 1న దేశ రాజధాని ఢిల్లీలో విపక్షాల ఉమ్మడి ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో అతి భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని ఖర్గే స్పష్టం చేశారు.

**ఇసి తీరుపై అభ్యంతరం:**

ఎన్నికల సంఘం (ఇసి) వ్యవహరిస్తున్న తీరుపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇసి వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూటమి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. భవిష్యత్ ఎన్నికల్లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్)కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకోవాలని ఇండియా కూటమి కోరింది. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పుపై పూర్తి పారదర్శకత ఉండాలని చెప్పింది. నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా చేర్పులు, తొలగింపులు, సవరణల వివరాలను బహిరంగంగా ఉంచాలని డిమాండ్ చేసింది.

ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు కారణాలను తెలియజేయాలని కూటమి కోరింది. అలాంటి నిర్ణయంపై అప్పీల్ చేసుకునేందుకు సమర్థమైన విధానం ఉండాలని పేర్కొంది. పరిపాలనా లోపాలు, తగిన పత్రాలు లేకపోవడం, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని కోరింది. ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది.

యువత, తొలిసారి ఓటు వేయబోయే వారికి సులభంగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరింది. ఎన్నికల వ్యవస్థలో సంస్థాగత జవాబుదారీతనం పెరగాలని ఖర్గే అన్నారు. అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం పనిచేయాలని డిమాండ్ చేశారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించారని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అంశంపై ఇసి స్పందించలేదని అన్నారు. పారదర్శకత స్థానంలో రహస్య విధానం రాకూడదని, ఒక్క వ్యక్తికి ఒక ఓటు, ఓటుకు సమాన విలువ అనే సూత్రం బలహీనపడకూడదని ఇండియా కూటమి పేర్కొంది.

# 3న అమిత్‌షా రాక

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. అక్టోబర్ 3న రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంటారు. 4వ తేదీన మెదక్ జిల్లా తుప్రాన్‌లోని ఉర్జా ఇండస్ట్రీయల్ పార్క్‌లో డెయిరీ మిల్క్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత కరీంనగర్‌లోని ఓ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా రాష్ట్ర బిజెపి నేతలతో సమావేశం అయ్యే అవకాశం ఉంది. సాయంత్రం ఢిల్లీకి తిరుగుపయనమవుతారు.

# స్వర్ణ పతక విజేతలు

## చికిత, సాహిల్‌కు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడమే కాకుండా 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హత సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తితో పాటు సాహిల్ జాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో ఒకేరోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చేసిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లికి చెందిన తానిపర్తి చికిత ప్రతిభను గుర్తించి ఆమెను వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కోచ్‌లను ముఖ్యమంత్రి అభినందించారు. కాంపౌండ్ ఉమెన్స్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సాహిల్ జాదవ్‌తో కలిసి దక్షిణ కొరియాపై విజయం సాధించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్న చికిత పేరు తెలంగాణ క్రీడారంగ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చికిత నిరంతర సాధన, పట్టుదల, దృఢసంకల్పంతో సాధించిన ఈ విజయం క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబరు30,ప్రభాతవార్త:** ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణపతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని అంత ర్జాతీయ స్థాయిలో చాటిన తెలంగాణకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితారావుకు టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా చికితారావు తెలంగాణ క్రీడా ప్రతిభకు మరోసారి ఘనత తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. అద్భుతమైన ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమతో ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. చికితారావు సాధించిన విజయం తెలంగాణ యువతకు, ముఖ్యంగా క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ ముద్దు బిడ్డ, ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం పట్ల ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరో సారి చాటడం అభినందనలు తెలిపారు.ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా చికితారావు ప్రపంచ క్రీడా చరిత్రలో తెలంగాణ క్రీడా ప్రతిభకు మరోసారి చాటిందన్నారు.ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, చికితారావు ప్రతిభ మన దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఆమెకు సన్మానం చేశారు.

# ఫాస్ట్‌ట్రాక్‌లో గిరిజన సమస్యల పరిష్కారం

## నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు

## జాతీయ కమిషన్‌పై అవగాహన కల్పించాలి

## రాష్ట్రంలో పర్యటిస్తున్న షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** గిరిజన తెగలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానం ద్వారాపరిష్కరిస్తున్నట్లు షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ తెలిపింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత స్థానిక అధికారులు, ప్రజా ఫిర్యాదుల వేదికలకు ఫిర్యాదులు చేయాలని సూచించింది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించాలని ఆ కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని గిరిజన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు జాతీయ కమిషన్ సభ్యులు వివిధ ప్రాంతాల్లోని తండాల్లో పర్యటిస్తున్నారు. తదుపరి జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ బుధవారం పర్యటించారు. అంతకు ముందు వనపర్తి జిల్లాలో ఎనికి తండా, కర్నే తండా, సవైగూడెం కిష్టగిరి తండాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తరచుగా తమ సమ స్యలకు పరిష్కారాలు కోరుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, వాటిని పరిష్క రించకుండా నిరక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కమిషన్ చర్య తీసుకుంటుందని హెచ్చరించారు. ఎన్‌సి ఎస్‌టిగ్రామ్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేస్తే, ఎలాంటి సమస్యలనైనా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని రిజనులకు హామీ ఇచ్చారు. అనంతరం, గిరిజన సంక్షేమం, ఆరోగ్యం, వైద్యం, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలు, అటవీ, రెవెన్యూ, విద్య, వ్యవసాయం, పురపాలక పరిపాలన, ఎక్సైజ్, మరియు పోలీస్ వంటి వివిధ శాఖలకు సంబంధించిన వారి సమస్యల గురించి గిరిజనులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. జూన్ లో పాఠశాలలు తెరిచినప్పటికీ, ఇప్పటివరకు కేవ లం ఒక జత యూనిఫాంలు మాత్రమే అందిం చారని, అలాగే వసతి గృహాలలో సరైన మరుగు దొడ్ల సౌకర్యాలు లేకపోవడాన్ని తాము స్వయంగా గమనించామని వారు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ సమీక్ష సందర్భంగా, కర్నే తండాలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం రెండేళ్ల క్రితమే పూర్తయినప్పటికీ, అందులో ఇప్పటికీ ప్రాథమిక మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది కొరత ఉందని గ్రామస్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అంబులెన్స్ సేవను ఏర్పాటు చేయాలని వారు కలెక్టర్‌ను ఆదేశించారు.

# ప్రజాప్రతినిధుల కోర్టుకు హరీశ్‌రావు హాజరు

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** పరువు నష్టం దావా కేసులో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హరీశ్‌రావు హాజరయ్యారు. క్షుద్రపూజల ఆరోపణల దృష్ట్యా పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌పై ఆయన పరువు నష్టం దావా వేశారు. తనపై అసత్య ఆరోపణలు చేశారంటూ హరీశ్‌రావు న్యాయ పోరాటానికి దిగారు. బుధవారం హరీశ్‌రావు వాంగ్మూలం నాంపల్లి కోర్టు నమోదు చేసింది. తన గౌరవానికి భంగం కలిగించేలా ప్రత్యర్థులు వ్యవహరించారంటూ ఆయన కోర్టుకు వివరించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ తనపై చేసిన అసత్య ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే తన ప్రతిష్టను దిగజార్చేలా ప్రచారం చేశారని ఆరోపిస్తూ ఆయన ఈ న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

# పూడికపై నేడు తుంగభద్ర బోర్డు సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** తుంగభద్ర రిజర్వాయర్‌లో చేరుకున్న పూడికపై గురువారం తుంగభద్రబోర్డు సమావేశం ఏర్పాటు చేశారు. జూలై 27న జరిగిన సమావేశంకు కొనసాగింపుగా ఈ సమావేశం ఉదయం 11 సమావేశం జరుగుతోందని సభ్యరాష్ట్ర ప్రతినిధులు హాజరు కావాలని ఎవరికైనా వీలు కాకపోతే వీడియోకాన్ఫరెన్స్‌లో హాజరుకావాలని బోర్డు కన్వీనర్, సభ్యకార్యదర్శి ఎస్ నారాయణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదిఇలా ఉండగా రిటైర్డు ఇఎన్‌సి ఒ వెంకరమేష్‌బాబు పదవికాలంను మరో మూడునెలలు పొడగిస్తు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# ఎటిసిల్లో శిక్షణ పొందిన వారికి ఎంఎన్‌సిల్లో ఉద్యోగాలు రావడం సంతోషకరం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** యువత బంగారు భవిష్యత్తుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు బాటలు వేస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందిన వారికి ఎంఎన్‌సీల్లో ఉద్యోగాలు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థుల్లో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల పెంపేగా లక్ష్యంగా ఏటీసీల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ట్వీట్ చేశారు. ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేయడం సత్ఫలితాలనిస్తోందన్నారు. యువతకు నైపుణ్యాలను పెంపొందించే శక్తివంతమైన వేదికలుగా ఏటీసీలు నిలవనున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఏటీసీలు అందుబాటులోకి రానున్నాయని సీఎం వెల్లడించారు.

# చెక్‌పోస్టులు దాటుతున్న గంజాయి

## భద్రాచలం మీదుగా అక్రమ రవాణాకు అడ్డుకట్ట ఏదీ?

## మూడు వాహనాల్లో రూ.1.82 కోట్ల విలువైన 365 కిలోలు గంజాయి పట్టివేత

**భద్రాచలం, ప్రభాతవార్త:** సరిహద్దుల్లో ఎన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా.. నిఘా వ్యవస్థను ఎంత పటిష్టం చేసినా.. ఒడిశా, ఆంధ్ర సరిహద్దుల నుంచి భద్రాచలం మీదుగా గంజాయి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది అన్న ప్రశ్నలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మంగళవారం భద్రాచలం పరిసరాల్లో వరుసగా రెండు వాహనాల్లో భారీగా గంజా యి పట్టు బడటం, ఈ నిందితుల సమాచారంతో ఖమ్మంలో మరొక వాహ నం గంజాయి పట్టు పడటం ఈ అనుమానా లకు మరింత బలం చేకూరుస్తోంది. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డీటీఎఫ్, ఇతర ఎక్సైజ్ బృందాలు నిర్వ హించిన తనిఖీల్లో మొత్తం 365.2 కిలోల గంజాయి పట్టుబడింది. అధికారుల ప్రకారం దీని విలువ రూ.1.82 కోట్లు. మొదట భద్రాచలంలోని స్థానిక వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న ఒడిశాకు చెందిన దివాకర్ మండల్ వద్ద 9 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశారు. అనంతరం అదే ప్రదేశంలో అనుమానాస్పదంగా వస్తున్న హ్యుందాయ్ కారును తనిఖీ చేయగా అందులో మరో 100 కిలోల గం జాయి బయటపడింది. కారులో ఉన్న సుమన్‌పాల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీరిని విచారించగా మరో లారీలో గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో ఖమ్మం పట్టణం కరుణగిరి సమీపంలో నిలిపి ఉంచిన లారీని తనిఖీ చేశారు. లారీలో 263.2 కిలోల గంజాయి పట్టుబడగా రాజశేఖర్ మార్గి, క్లీనర్ బ్రిజన్ నాసాలను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు వాహనాల ద్వారా ఒడిశా నుంచి మహారాష్ట్ర వైపు గంజాయిని తరలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు, చెక్ పోస్టులు ఉన్నప్పటికీ గంజాయి రవాణా కొనసాగుతుండటంపై సమగ్ర నిఘా అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా అక్రమ రవాణాకు కొందరు సిబ్బంది సహకరిస్తున్నారంటూ వినిపిస్తున్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద ఒకేరోజున మూడు వాహనాల్లో 365 కిలోలకు పైగా గంజాయి పట్టుబడటం భద్రాచలం మార్గంలో అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై మరింత లోతైన దర్యాప్తు అవసరాన్ని స్పష్టం చేస్తోంది.



పట్టుబడిన గంజాయితో నిందితులు


**బంగారం వేలం నోటీసు**

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");
రిజిస్టర్డ్ ఆఫీస్: 4వ అంతస్తు, బజాజ్ ఫిన్‌సర్వ్ హౌస్,
పుణె-అహ్మదనగర్ రోడ్‌కు సమీపంలో, విమాన్ నగర్, పుణె - 411014

BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలుకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందవేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు), 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(11-11-26): అచ్చంపేట్ - లింగాల ఎక్స్ రోడ్; PJH2SGL41907762. ఆదిలాబాద్ - ద్వారకా నగర్; PEK4SGL91258748, 92141207, 92125054, 92089333, 92625754, 96455051, 96767012, 96734770, 97029851, 97238915, 97654325. ఆర్మూర్ - అంబేద్కర్ చౌరస్తా; PB56SGL91128260. బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL91810501, 93851332, 93989159, 94336954, 95589384, 44155779, 96289557, 45388973. భద్రాచలం - ఆర్‌టీసీ స్టాండ్; PEK5SGL91402870, 91842796, 92654880, 92692412, 93418896, 93852963, 93900803, 94300421, 94642955, 94822637, 95956270, 96057605, 96471598, 96755859, 97234978, 97260481. భైంసా - నిర్మల్ రోడ్; PPA4SGL91268921, 91653002, 91872434, 92114562, 41425277, 41904922, 42176732, 93942405, 93966846, 94373418, 94427831, 94400024, 94388539, 94416067, 94858217, 94899911, 94890489, 95058966, 95287757, 95353921, 43586080, 96070531, 44148813, 44093163, 96257316, 96712062, 96751860, 45392007. బోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL40805781, 91401875, 92969914, 92927863, 93549222, 43300111, 43812374. భువనగిరి - హైదరాబాద్ రోడ్; PCW1SGL93475382, 95514785, 96201991, 97200739. భూపాలపల్లి - మెయిన్ రోడ్; PCW2SGL95061750, 97579795, 97643472. దేవరకొండ - మెయిన్ రోడ్; PSK2SGL95087552, 97596457. వరంగల్ - కీయూ క్రాస్ రోడ్; PGP7SGL43262416, 96222928. (12-11-26) గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL31019266, 92720664, 92602614, 42026777, 42317869, 95293831, 95526533, 44296645. గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL29627332, 33606521, 91272005, 92602710, 42467070, 94313971, 94314643, 94637578, 95067154, 43474064, 95279405, 95551480, 96202417, 44311748, 96737463, 97966653, 45363198, 45364792. గోదావరిఖని - కళ్యాణ్ నగర్; PEK6SGL91044762, 40736268, 41274002, 93524303, 42160424, 93917486, 96693457, 96970245, 97689116. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL40515412, 90918634, 90796679, 92120034, 92664857, 92756505, 92938065, 92927419, [illegible] ... 97640087, 45422132. తొర్రూర్ - వరంగల్ రోడ్; PJH3SGL91311341, 91443605, 92138113, 92592527, 93022082, 93209295, 93486226, 42205411, 94261509, 42955295, 94628963, 94583635, 94699244, 43104958, 95123859, 95119665, 95136986, 96058627, 43456985, 95529215, 95539586, 95966465, 96007296, 96503272, 96959485, 96943272, 97182624. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్; PJT5SGL95099069, 43581617, 95518124, 95527492, 97622144. తుర్కయంజాల్ - రాఘవేంద్ర నగర్; PLP1SGL91136512, 41278707, 94871276, 95973022, 96311111, 96724078, 96714610, 96977825, 96983600, 96940480, 97157570. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL91113600, 91235308, 41061886, 92112099, 92121794, 92130811, 92213913, 92760246, 92611352, 92631833, 42047368, 93483126, 93502678, 94398778, 43077660, 94862698, 95083700, 96080913, 44336280, 96701375, 44678568. వరంగల్ - సుబేదారి; PB55SGL90809756, 90872415, 90890989, 91105943, 91073675, 91781295, 92185298, 92168321, 92221485, 92619469, 92650634, 92963279, 94320198, 94569072, 94686340, 95984921. ఎల్లందు - బుగ్గవాగు; PGC4SGL91845380, 42229018, 93908991, 94848604, 43298706, 95986977, 96073142, 95995898, 44164942, 97170863. జహీరాబాద్ - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PER4SGL41595886.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# విద్యుత్ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్ ఛార్జీలు

## పారదర్శకత, సరళత, వేగవంతమైన సేవలు

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** విద్యుత్ కనెక్షన్ల మంజూరులో పారదర్శకత, సరళత, సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జీల విధానం అమలు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ అన్నారు. హైదరాబాద్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ నూతన నిబంధనల ప్రకారం లోడ్ ఆధారంగా ముందుగానే నిర్ణయించిన స్థిర ఛార్జీలు ఉండటంతో వినియోగదారులకు ఖర్చుపై స్పష్టత లభిస్తుందని చెప్పారు. అలాగే దరఖాస్తుల పరిశీలన, సేవల మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం వంటి వివిధ ప్రయోజనాలను ఈ విధానం అందిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓవర్‌హెడ్, అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌లకు వేర్వేరు ప్రమాణిత రేట్లు నిర్ణయించడం ద్వారా వ్యవస్థ మరింత పారదర్శకంగా మారిందన్నారు. ఇప్పటి వరకూ అంచనా వ్యయాల్లో 30 నుంచి 40 శాతం వరకు వ్యత్యాసం వచ్చే అవకాశం ఉండేదని అయితే ఇప్పుడు అటువంటి అవకాశం ఉండదన్నారు. హెచ్‌టీ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జీకి అదనంగా డెవలప్‌మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, ఖర్చులు వర్తిస్తాయని చెప్పారు. జీఐఎస్ ఆధారిత నెట్‌వర్క్ మ్యాపింగ్ ద్వారా విద్యుత్ మౌలిక సదుపాయాల వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి వస్తున్నాయని, అయినప్పటికీ లోడ్ ఫీజిబిలిటీ, నెట్‌వర్క్ సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని తుది సాంకేతిక నిర్ణయాలను సంస్థ తీసుకుంటుందని వివరించారు. దరఖాస్తు ఏ దశలో ఉందో, ఎంత ఛార్జీ చెల్లించాలో, ఫైలు ప్రస్తుతం ఎవరి వద్ద ఉందో తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఎల్‌టీ వినియోగదారులకు కూడా లోడ్ ఆధారిత యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జీలు అమలులో ఉన్నాయని తెలిపారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు తదితర అన్ని కేటగిరీలకు సరళమైన, పారదర్శకమైన విధానం అమలులో ఉండటంతో విద్యుత్ కనెక్షన్ల మంజూరు వేగవంతమవుతుందని చెప్పారు. తమ సంస్థ పరిధిలో రాబోయే వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఎటువంటి ఆలస్యం లేదని, అవసరమైన పత్రాలు లేదా ఛార్జీలు పూర్తి కాని కొన్ని దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఆధారిత ఉత్పత్తితో పాటు సౌర, పవన, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, రిన్యూవబుల్ ఎనర్జీ ఆధారిత ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

# దేశంలో మొదటిసారి మాజీ డిఎస్పీ భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** అక్రమా స్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భారీగా ఆస్తులను గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆ తర్వాత చేపట్టిన దర్యాప్తు ఆధారంగా ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఐటీ మరింత దూకుడు పెంచాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల చట్టం కింద కేసులు నమోదు చేశాయి. ఇది దేశంలోనే తొలిసారిగా బినామీ లావాదేవీల చట్టం కింద ఇలాంటి కేసుల నమోదు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. డీజీపీ కార్యాలయం లోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27వ తేదీన నమోదైన ఈ కేసులో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి ఆస్తులకు సం బంధించిన వివరాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ వర్గాల ద్వారా వెల్లడైంది. ఈ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతర వ్యక్తుల పేర్లపై ఉన్నప్పటికీ వాటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. దీంతో బినామీ ఆస్తుల కోణంలోనూ దర్యాప్తును అధికారులు చేపట్టారు. బినామీ ఆస్తులకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, ఇతర కీలక ఆధారాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.

ఆ ఆస్తులకు అసలు యజమాని ఎవరు అనే అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి. ఏసీబీ దర్యాప్తులో లభించిన సమాచారాన్ని పరిశీలించిన ఐటీ శాఖ.. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమా నిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లపై ఉన్న ఆస్తులకు అసలు పెట్టుబడులు ఎవరివి.. ఆస్తుల కొనుగోలుకు ఉపయో గించిన నిధుల మూలం ఏంటి.. ఆస్తులను ఎవరు కంట్రోల్ చేస్తున్నారు వంటి అం శాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
hmda
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ -III, బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ బిల్డింగ్
# 6-1-2/1, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్ - 500063

నిట్ నం.HMDA/DEV/EE/Div-III/2026-27 **టెండర్ ప్రకటన** తేది: 30.09.2026

డివిజన్-IIIలో ఈ క్రింది పని నిమిత్తం టెండర్ కోరబడుతోంది

క్ర.సం.1. నిట్ నం.తేది: HMDA/DEV/EE/Div-III/20/2026-27, తేది:30.09.2026 లొకేషన్: లుంబినీ పార్క్ వద్ద పచ్చదనం నిర్వహణకు STP యొక్క శుద్ధి చేసిన నీటిని అందించటానికి, నిల్వకు మరియు వినియోగానికి సంప్ యొక్క నిర్మాణం మరియు NTR గార్డెన్స్ నుండి లుంబినీ పార్క్‌కు HDPE పైప్‌లైన్ ఏర్పాటు. బిడ్ దాఖలుకు చివరి తేది: 16.10.2026 మ.3.00గం. వరకు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in వీక్షించండి.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-III, HMDA.

DIPR.NO. 10940-PP/CL/ADVT/1/2026-27 తేది: 30.09.2026



దేవాదాయ-ధర్మాదాయ శాఖ

**శ్రీ హనుమాన్ దేవస్థానము**

కర్మన్‌ఘాట్ గ్రామ, సరూర్ నగర్ మండ, రంగారెడ్డి జిల్లా - 500 079.
ఫోన్ నెం.040-24073141, సెల్ నెం.9704175441.

**సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రకటన**

File No.47/SKHD/2026 తేది: 30-09-2026

ఒక సంవత్సర కాలపరిమితి అనగా తేది 11-11-2026 నుండి 10-11-2027 వరకు దేవాలయములో దిగువ కనపరచిన లైసెన్స్ హక్కుల నిమిత్తము సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలములు కోరడమైనది.

| క్ర. సం. | టెండరు వివరములు | కాల పరిమితి | ధరావత్తు (E.M.D) | టెండరు షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | వాహనముల పార్కింగ్ నిర్వహణ | తేది 11-11-2026 నుండి 10-11-2027 వరకు | ₹.3,00,000/- | ₹. 1000/- + 18% GST |
| 2. | కొబ్బరి చిప్పలు సేకరించుకొనుట | -do- | ₹.50,000/- | ₹. 1000/- + 18% GST |
| 3. | అమ్మవారి చీరలు సేకరించుకొనుట | -do- | ₹.25,000/- | ₹. 500/- + 18% GST |

1) తేది 03-10-2026 నుండి 08-10-2026 వరకు దరఖాస్తులు స్వీకరించబడును.
2) తేది 09-10-2026 నుండి 12-10-2026 వరకు టెండర్లు షెడ్యూల్ జారీ చేయబడును.
3) తేది 13-10-2026, మంగళవారము రోజున ఉ॥ 10.00 గం॥ల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడును.
4) అదే రోజు ఉ॥ 11.30 ని॥లకు టెండరు దారుల సమక్షములో సీల్డ్ టెండరు-కమ్-బహిరంగ వేలములు నిర్వహించబడును.
5) ఆసక్తి గలవారు సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలము 2 పద్ధతులలో పాల్గొనవలెను.
6) సీల్డ్ టెండర్, బహిరంగ వేలము 2 పద్ధతులలో వచ్చిన అధిక మొత్తాన్ని మాత్రమే అంగీకరించబడును.
7) హెచ్చుటెండరు / పాటదారుడు కోట్ చేసిన మొత్తముపై జి.ఎస్.టి., ఆదాయపు పన్ను, ఇతర ప్రభుత్వ పన్నులు అదనముగా యుండగలదు. అట్టి మొత్తమును పాట సొమ్ముతో పాటుగా చెల్లించవలెను.

పూర్తి వివరములకు దేవాలయ పని వేళల్లో కార్యాలయమునందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

Dipr.No. 10916-PP/CL/Advt/1/2026-27, Dt: 30.09.2026


# నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ సస్పెన్షన్



లక్ష్మీ భాస్కర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** అవినీతి నిరోధక శాఖ కేసులో అరెస్టై 48 గంటలకు మించి కస్టడీలో ఉన్న నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్, అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవ్‌రాజ్ సెప్టెంబర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ నమోదు చేసిన అక్రమాస్తుల కేసులో లక్ష్మీ భాస్కర్‌ను సెప్టెంబర్ 22న సాయంత్రం 6.30 గంటలకు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆయన కస్టడీ 48 గంటలకు మించడంతో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం సస్పెన్షన్ విధించాలని ప్రభుత్వం సెప్టెంబర్ 26న నిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించింది. దీనిపై సమగ్రంగా పరిశీలించిన అనంతరం సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చేలా లక్ష్మీ భాస్కర్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం ఆయనకు జీవనాధార భత్యం చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని అందులో పేర్కొన్నారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
AU SMALL FINANCE BANK - A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN:L36911RJ1996PLC011381)

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 24660000358784 ఆకారపు సదానందం (రుణగ్రహీత) ఆకారపు దుర్గమ్మ (సహ-రుణగ్రహీత) ఆకారపు కనకయ్య (సహ-రుణగ్రహీత) | 16-జూన్-26 రూ.7,60,876/-, ఏడు లక్షల అరవై వేల ఎనిమిది వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే 15-జూన్-26 నాటికి | 25-సెప్టెంబర్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: గౌరవెల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, అక్కన్నపేట మండలం, సిద్దిపేట జిల్లా పరిధిలోని సిద్దిపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు హుస్నాబాద్ జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న ఆస్తి వివరాలు: GPH నం. 3-143 మరియు అసెస్‌మెంట్ నం. 474 కలిగిన, మొత్తం 242.00 చదరపు గజాలు లేదా 202.31 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన ఇల్లు మరియు ఖాళీ స్థలం. ఇందులో RCC పైకప్పు కలిగిన ఇంటి భాగం యొక్క ప్లింత్ ఏరియా 423.87 చదరపు అడుగులు; ACC షీట్ పైకప్పు కలిగిన ఇంటి భాగం యొక్క ప్లింత్ ఏరియా 217.43 చదరపు అడుగులు లేదా 71.25 చదరపు గజాలు లేదా 59.56 చదరపు మీటర్లు; మరియు ఖాళీ స్థలం విస్తీర్ణం 170.75 చదరపు గజాలు లేదా 142.74 చదరపు మీటర్లుగా ఉంది. ఈ ఆస్తి యొక్క సరిహద్దులు: తూర్పున - కొమ్ముల పరశయ్య ఇల్లు, పడమరన - కొమ్ముల మల్లేష్ ఇల్లు, ఉత్తరాన - కొమ్ముల శాంతవ్వ ఇల్లు, దక్షిణాన - రోడ్డు. | | |
| (Loan A/C No.) 24660002413106 కానుకమ్మ ఆకారాం (రుణగ్రహీత), బాలయ్య ఆకారం (సహ-రుణగ్రహీత) | 06-జూలై-26 రూ.8,43,600/-, ఎనిమిది లక్షల నలభై మూడు వేల ఆరు వందలు రూపాయలు మాత్రమే 04-జూలై-26 నాటికి | 25-సెప్టెంబర్-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సిద్దిపేట జిల్లా, అక్కన్నపేట మండలం, గౌరవెల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో సిద్దిపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు హుస్నాబాద్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న ఆస్తి వివరాలు: ఇంటి H.No.3-100/1 మరియు అసెస్‌మెంట్ నం. 900 కలిగిన RCC పైకప్పు గల ఇల్లు మరియు ఖాళీ స్థలం. దీని మొత్తం విస్తీర్ణం 372.22 చదరపు గజాలు లేదా 311.17 చదరపు మీటర్లు. ఇందులో ఇంటి నిర్మాణ విస్తీర్ణం ప్లింత్ ఏరియా 814.00 చదరపు అడుగులు లేదా 90.44 చదరపు గజాలు లేదా 75.61 చదరపు మీటర్లు మరియు ఖాళీ స్థలం 281.78 చదరపు గజాలు లేదా 235.56 చదరపు మీటర్లు ఉన్నాయి. దీని సరిహద్దులు: తూర్పున – కొమ్ముల కొమురయ్య ఇల్లు, పడమరన – అలెన ఎర్రయ్య ఖాళీ స్థలం, ఉత్తరాన – CC రోడ్డు, దక్షిణాన – పులి పోచయ్య వ్యవసాయ భూమి. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదువబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 30/09/2026 ప్రదేశం : హైదరాబాద్, తెలంగాణ

అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

వార్త

దేనిని విశ్వసించాలి, దేనిని కోరాలి, దేనిని విధిగా నిర్వహించాలన్న మూడు విషయాలను ముక్తి సాధకుడు ముఖ్యంగా తెలుసుకోవాలి.

- థామస్ ఆక్వినాస్

# సుస్థిరాభివృద్ధికి గమ్యమేది?

దేశ మానవ వనరుల వికాసానికి పాఠశాలలే పునాదులు. విద్యాభ్యాస మంటే కేవలం పుస్తకాలు, తరగతి గదులకే పరిమితం కాదు. పాఠశాల ఆవరణలో సురక్షితమైన తాగునీరు, శుభ్రమైన శౌచాలయాలు, సబ్బుతో చేతులు శుభ్రం చేసుకునే వసతులు ఉండటంతో బాటు చదువుకునే వాతావరణం కూడా అవసరమే. అవి విద్యార్థులు, ముఖ్యంగా బాలికల ప్రాథమిక హక్కుగా భావించాలి. 2030 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యం, బాధ్యత కూడా ఎక్కువే. భారత్ ఏటా 4కంటే ఎక్కువ అభివృద్ధి సాధిస్తూ సురక్షిత నీటి సరఫరాలో ప్రశంసనీయమైన పురోగతిని నమోదు చేసింది. 2030 నాటికి విశ్వవ్యాప్త తాగునీటి లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఉన్న 28 దేశాల్లో భారత్ ఒకటి. కాగా ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ సంయుక్తంగా విడుదల చేసిన 'గత పదేళ్ల కాలంలో పాఠశాలల్లో మంచి నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత' నివేదిక, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రపంచ దేశాలు ఎంత వెనుకబడి ఉన్నాయో స్పష్టం చేస్తోంది. ఆ మధ్యకాలంలో సాధించిన పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. ఈ నివేదిక భారతదేశానికి ఒక పెద్ద హెచ్చరిక చేసింది. నిజానికి 2030 నాటికి ప్రపంచంలోని పాఠశాలలన్నింటికీ ప్రాథమిక సదుపాయాలు కల్పించాలనేది నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం లక్ష్యం. ఇంతవరకు సాధించిన పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. ఇదే వేగం కొనసాగితే, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 31.4 కోట్ల మంది పిల్లలు సురక్షిత తాగునీటి సౌకర్యానికి చేరువకాలేరు. పారిశుధ్యం విషయంలో భారతదేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. నేటికీ 5 కోట్ల మంది పిల్లలకు పాఠశాలల్లో తగిన శౌచాలయ వసతులు అందుబాటులో లేవు. ప్రపంచవ్యాప్తంగా పాఠశాలల్లో శౌచాలయాలు లేని పిల్లల సంఖ్యలో భారత్ అగ్రస్థానంలో ఉంది. సుమారు 36.4కోట్ల మంది విద్యార్థులకు తగిన శౌచాలయ వసతులు ఉండవు. పరిశుభ్రత దాదాపు 40.6 కోట్ల మంది పిల్లలకు చేతులు శుభ్రంచేసుకునే సదుపాయాలు అందుబాటులోకి వచ్చేఅవకాశం లేదు. 2030నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రస్తుత పురోగతి వేగం మంచినీటి విభాగంలో 4 రెట్లు, పారిశుధ్య విభాగంలో 5 రెట్లు, చేతుల పరిశుభ్రత విభాగంలో 4 రెట్లు పెరగాలి. భారత దేశానికి సంబంధించి నంతవరకు ఈ నివేదిక మిశ్రమ ఫలితాలనే వెల్లడించింది. 2025 నాటికి ప్రపంచంలో పాఠశాలలో మరుగుదొడ్డి సౌకర్యం లేని 24.4 కోట్ల మంది పిల్లలలో, దాదాపు ఐదోవంతు మంది భారతదేశంలోనే ఉన్నారు. ఇదేఆందోళనకరమైన విషయం. ప్రపంచంలో 24.4 కోట్లు, అందులో భారత్ లో 5 కోట్ల మంది పిల్లలకు పాఠశాలలో సౌకర్యం లేదు. 1.2 కోట్ల మంది పిల్లలకు పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదు, ప్రపంచంలో ప్రతి 20మందిలో ఒకరన్నమాట. దాదాపు 2కోట్ల మంది పిల్లలకు సబ్బుతో చేతులు కడుక్కునే సౌకర్యం లేదు. బాలికల విద్య, బహిష్టు సమయ పరిశుభ్రత, పాఠశాలల్లో ప్రత్యేక శౌచాలయాలు, నీటి సరఫరా, చెత్త బుట్టలు లేకపోవడం బాలికల విద్యా ప్రయాణానికి పెద్ద ప్రతిబంధకంగా మారుతోంది. వయసొచ్చిన బాలికలు పాంశాలలు మానడానికి పరిశుభ్రత లేని శౌచాలయాలే ప్రధాన కారణం. ప్రభుత్వాలు, స్వచ్ఛభారత్ వంటి పథకాలద్వారా శౌచాలయాల నిర్మాణాలు చేపట్టినప్పటికీ, వాటి నిర్వహణలో తీవ్ర అలసత్వం కనిపిస్తోంది. నీటిసరఫరా లేకపోవడం వల్ల నిర్మించిన శౌచాలయాలు కొద్ది కాలానికేవినియోగానికి పనికి రాకుండా పోతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న వరదలు, కరువులు పాఠశాలల నీటిసరఫరా వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి. వాతావరణాన్ని తట్టుకోగల స్థిరమైన మౌలిక వసతులు లేకపోవడం పురోగతిని వెనక్కి నెడుతోంది. నివేదిక హెచ్చరికల నేపథ్యంలో, కేవలం భౌతిక భవనాలు లేదా శౌచాలయాల నిర్మాణం సరిపోదు. పాఠశాలల్లో సదుపాయాల సమర్థవంతమైన నిర్వహణకు నిధుల కేటాయింపు నిరంతరం జరగాలి. పంచాయతీలు, స్థానిక సంస్థలకు పాఠశాల పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను, ప్రత్యేక నిధు లను అప్పగించాలి. పాఠశాలల ప్రణాళికల్లో కేవలం మౌలిక వసతులే కాకుండా, నిరంతర నీటిసరఫరా, సబ్బులు అందుబాటులో ఉండేలా చూడటం ప్రాథమిక బాధ్యతగా మారాలి. మౌలిక వసతుల నిర్వహణ దివ్యాంగ విద్యార్థు లకు అనుకూలంగా ఉండేలా పునర్నిర్మించాలి. అంతేకాదు, తగినంత తాజా డేటా లేకపోవడం వల్ల 2024 తర్వాత భారతదేశానికి సంబంధించిన పరిశుభ్రత అంచనాలను కూడా రూపొందించలేకపోయింది. స్వచ్ఛభారత్, స్వచ్ఛ విద్యాలయ, సమగ్ర శిక్షా పథకాల కింద మనం లక్షలాది మరుగుదొడ్లు కట్టాం. ఆ నివేదిక చూస్తే భారత్ 14 శాతం మెరుగుదల సాధించిందని చెప్పింది. పాఠశాలలో మరుగుదొడ్డి సౌకర్యం తప్పనిసరి. శుభ్రత లేకపోతే అతిసారం, నులి పురుగులు, కలరా వంటి వ్యాధులు పిల్లల హాజరును, అభ్యసన సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. నివేదికలో అత్యంత ఆందోళనకర అంశం 2024 తర్వాత భారత్ నుండి సరైన డేటా లేదని చెప్పడం. అన్నీ ఉన్నాయని చూపిస్తాం, కానీ క్షేత్రస్థాయిలో స్వతంత్రంగా తనిఖీ చేసే వ్యవస్థ లేదు. వీటి నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రతి పాఠశాలకు శుభ్రత కోసం ప్రత్యేక సిబ్బంది, నెలవారీ సబ్బు, ఫినాయిల్ ఖర్చులు ఇవ్వాలి. దీనిని జల్ జీవన్ మిషన్ తో అనుసంధానం చేయాలి. కేవలం మరుగుదొడ్డి కాదు, రుతుక్రమ పరిశుభ్రతకు డస్ట్‌బిన్, ఇన్సినిరేటర్, నీరు తప్పనిసరి చేయాలి. లేకపోతే 'బేటీ బచావో, బేటీ పడావో' నినాదం పాఠశాల గేటుదగ్గరే ఆగిపోతోందన్నమాటేగా. 2030నాటికి అందరికీ శుభ్రతకు అనువైన సకలసౌకర్యాలు కల్పించాలంటే, ప్రస్తుత వేగాన్ని పెంచినప్పుడే సాధ్యమవుతుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే యాజమాన్య నిర్వహణ పద్ధతులను కూడా చిత్తశుద్ధితో స్వీకరించాలి.

ప్రజల భాషలో మాట్లాడాలి, మేధావుల ఒరవడిలో ఆలోచించాలి.



అరిస్టాటిల్

ఎదురుగా నీకు భయపడినవాడు చాటుగా నిన్ను అసహ్యించుకుంటాడు.



థామస్ ఫుల్లర్

## ప్రజావాక్కు



### కాలుష్యాలను నిరోధించాలి

పురాణాల్లో శివుని వరంపొందిన భస్మాసురుడు ఆ వరంతోనే భస్మమైనట్లు, మానవజాతి కూడా సాంకేతిక విప్లవమనే వరంతో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ, చివరికి తనమనుగడకే ముప్పు తెచ్చుకుంటుంది. ఈమధ్య నగర, పట్టణ ప్రాంతాల్లో చీటికి మాటికి ఏదో ఒక పేరున, ముఖ్యంగా పుట్టిన రోజు వేడుకలని అర్ధరాత్రివేళ ఇళ్ళ మధ్య వేసే పెద్ద డీజే సౌండ్ పాటలు, బాంబులు, బాణాసంచా వల్ల వాయుకాలుష్యమే గాక చుట్టు పక్కల వారికి నిద్రాభంగం కలుగుతుంది, అప్పుడే డ్యూటీలు ముగించి వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉంటారు. ఇక వృద్ధులు, రోగులు ముఖ్యంగా హృద్రోగులకి ప్రాణాంతకమై పోయింది. ఇప్పటికే పెరిగిన కాలుష్యాలతో అత్యధిక శాతం ప్రజలు రోగ గ్రస్తులయ్యారు. ఇప్పుడున్న చట్టాల ప్రకారమైనా రాత్రి పది గంటల తర్వాత బాంబుల మోత వినిపిస్తే, పోలీస్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటే ఈ రణగొణధ్వనులన్యూసెన్స్ పీడతప్పి, ప్రజలూ హర్షిస్తారు.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### సహజ వనరులను కాపాడుకోవాలి

అభివృద్ధి అంటే దేశంలోని సహజవనరులను గుత్త పెట్టుబడి దారులకు కట్టబెట్టడంగా మారిపోయింది. అది ఒడిస్సాలోని బాక్సయిట్ గనులు కావొచ్చు ఇంకా ఏది అయినా అందుకే దేశంలో పేదరికం తగ్గడం పక్కన పెట్టి అసమానతలు అనే కొత్త రకంఅయినా పేదరికం వచ్చి చేరింది. దేశంలో స్వాతంత్ర్యం తరవాత కూడా అందరికి ఇల్లు ఉండాలి. అనేది ఎన్నికల వాగ్దానం లేక ఎన్నికల ప్రచార అంశంగా మారిపోతోంది. దేశంలో 2013లోసుప్రీం కోర్టు చెత కొట్టివేయబడిన ఒక ప్రాజెక్ట్ మళ్ళీ పట్టాల మీదికి ఎక్కింది. ఈప్రాజెక్టు కోసం ఒడిస్సాలోని ఆరుదు అయినా గిరిజన సమూహాలను బయటకు నెట్టి వేయడం ఆపాలి.

- భారత అవినాష్, జనగామ

### లంచగొండితనాన్ని అరికట్టాలి

రాష్ట్రంలో ప్రభుత్వ ఆఫీసులలో లంచాలు మంచమెక్కుతున్నాయి. సదరు పేదవాడి ఏపనికావాలన్న ఫైలు ముందుకు కదలాలన్న మూట అప్పజెప్పనిది ముందల్కి పోత లేదు. ఆఫీసుకు వచ్చేదేమో లేటు దండుకునేది మాత్రం చాలా. ఇలాంటి అధికారులను లంచాలు అడుగుతుంటేనే వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టాలి. ఎలాగైనా మారతారేమో. పొందుందాకా కష్టం జేస్తే తెలుస్తుంది

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### వాగ్దానాలను నెరవేర్చాలి

కాంగ్రెసు పాలన కోస్తే చేయూతపథకంలో ఇప్పుడన్న 2016 రూపాయలను 4000 చేస్తామన్నారు. ప్రజలు నమ్మి ఓటు వేసి గెలిపించారు. మూడేళ్ల గడచినా అతీ గతీ లేదు. బి.ఆర్.ఎస్. ఏడాదికి 500పెంచుతామని హామీఇచ్చింది. అంటే ఈ పాటికి 1500 పెరిగేది. చేయూతను పెంచడం మాని కొత్తవారిని ఈపథకంలో చేర్చుకునే ప్రక్రియ ప్రారంభమయింది. చూస్తుంటే ఇక బి.ఆర్.ఎస్. పథకాన్నే కొనసాగిస్తారని రూఢీ అయింది. ఇంకా రెండేళ్ళలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల ముందు మరచిన వాగ్దానాలను నెరవేర్చక పోతే ఈ ప్రభావం ఓట్లమీద పడే ప్రమాదం ఉంటుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### నాణ్యమైన విద్య అందించాలి

మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు భవనాల కొరత, తగిన నిధుల లేమి, ప్రాథమిక సౌకర్యాల అభావం, ఉపాధ్యాయుల క్రమరాహిత్య హాజరుతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాల్సిన చోట, శిథిలావస్థలో ఉన్నతరగతి గదులు వారి భవిష్యత్తునుప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ యంత్రాంగం అత్యంత దూర ప్రాంతాలకు రేషన్, విద్యుత్, రవాణావంటి సేవలను విజయ వంతంగా అందించగలుగుతోంది. అయితే అదే ప్రాంతాల్లో ఒక సమర్థవంతమైన ప్రభుత్వ పాఠశాలను నిర్వహించడంలో విఫలమవడం కేవలం పరిపాలనా నిర్లక్ష్యానికే నిదర్శనం. ఇది వనరుల కొరత కాదు, సంకల్పం కొరత. ఈ పరిస్థితుల కారణంగా పేద కుటుంబాలు తమ పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే ఆశతో అప్పుల పాలై ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మనశ్శాంతిలో ఆత్మానుభూతి

మనశ్శాంతి అనేది బయట ఎక్కడో దొరికేది కాదు. మన ఆలోచనల్లో, మనదృక్పథంలో, మన నిర్ణయాల్లో ఉంటుంది. అందుకే కొన్ని మార్చుకోవాలి. కొన్ని మర్చిపోవాలి. కొన్ని వదులుకోవాలి. కొన్నివదిలేయాలి. అప్పుడుమనసు తేలిక అవుతుంది. జీవితం ప్రశాంతంగా మారుతుంది. గతం పాఠంగా మిగులుతుంది. వర్తమానం ఆనందంగా మారుతుంది. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. ఇదే నిజమైన మనశ్శాంతి. శీతోష్ణ, సుఖదుఃఖాలలో శరీరం వేరువేరుగా స్పందిస్తుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మధ్య ప్రాచ్యంలో మంటలు ఇంకా ఎంతకాలం?

***చుట్టూ శత్రుదేశాలతో కూడుకున్న ఒక ఎడారి ప్రాంతం ప్రపంచంలో అత్యాధునిక సాంకేతిక రక్షణ వ్యవస్థగల ఇజ్రాయిల్ దేశంగా రూపాంతరం చెందింది. తమ చుట్టూ ఉన్న అరబ్ దేశాలు తమ అస్థిత్వానికి ముప్పుగా పరిణమించాయని భావించిన ఇజ్రాయిల్ తమ దేశాన్ని శత్రు దుర్భేద్యంగా మలచుకుంది. కేవలం కోటి మంది జనాభా గల ఇజ్రాయిల్ నేడు సాంకేతికంగా ప్రపంచంలో అగ్రభాగంలో ఉంది. వివక్షత కారణంగా ఏర్పడిన విద్వేషం ఎంత భయంకరంగా ఉంటుందో ఇజ్రాయిల్ దాడులు నిరూపిస్తున్నాయి. గాజా, లెబనాన్, ఇరాన్ పై ఇజ్రాయిల్ తన దాడులను ఆపనంత కాలం, ఇరాన్ పగ ప్రతీకారాలు చల్లారనంతకాలం, అమెరికా ఆధిపత్యం చెలా యించినంత కాలం పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతూనే ఉంటుంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలకు యావత్ ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు.***



సుంకవల్లి సత్తిరాజు

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అన్ని దేశాలు తమతమ దేశాల రక్షణకు అధునాతన ఆయుధాలు కూడబెట్టుకోవలసిన దుస్థితి ఏర్పడింది. గతంలో మాదిరిగా ఒక దేశం మరొక దేశాన్ని కాపాడడానికి సిద్ధంగా లేవు. హౌతీల నుండి సౌదీని కాపాడవలసిన అమెరికా చల్లగా జారుకుంది. పాక్, టర్కీ, సౌదీల మధ్య కుదిరిన రక్షణ ఒప్పందం మూణ్ణాళ్ళ ముచ్చటగామారింది. ఇస్లామిక్ నాటో నీరుగారిపోయింది. ఉక్రెయిన్‌ను రెచ్చగొట్టి, నాటోలో భాగస్వామి చేయడానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని రష్యా పై యుద్ధానికి పురిగొల్పి తీవ్రమైన తప్పిదం చేశారు. తాను రష్యా ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని నిలువరిస్తానని అధికారంలోకి వచ్చిన ట్రంప్, మొదట్లో జెలెన్ స్కీకి వ్యతిరేక గళం వినిపించినా, చివరికి ఉక్రెయిన్ పక్షాన నిలబడుతూ, రష్యా పై వాణిజ్య పరమైన ఆంక్షలు విధించడమే కాకుండా రష్యాతో సంబంధ బాంధవ్యాలు గల భారత్ వంటి దేశాలను టారిఫ్‌లతో బెదిరించడం అసమంజసం. 140 కోట్ల జనాభా గల సువిశాలమైన భారత దేశంలో చమురు కొరత ఏర్పడితే ఎంతటి ప్రమాదమో ట్రంప్‌కు తెలియదా? భారత్ తన ఇంధన, ఆయుధ అవసరాల కోసమే కాకుండా రష్యాతో ఏర్పడిన చిరకాల స్నేహ బంధం కొనసాగించడం కూడా అంతే అవసరం. ఈవిషయంలో ట్రంప్ భారత్ పై కారాలు మిరియాలు నూరడం అనుచితం. ప్రపంచంలో ప్రస్తుతం ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులకు, యుద్ధాలకు అమెరికా బాధ్యత వహించక తప్పదు. తనకు సంబంధం లేనిఅంశాల్లో అమెరికా అనవసర జోక్యం చేసుకోవడం తీవ్రమైన తప్పిదం. ఇజ్రాయిల్ మాటలను నమ్మి ఇరాన్ పై యుద్ధానికి తలపడి ప్రపంచాన్ని ఇబ్బందులు పాలు చేసిన ట్రంప్ క్షమార్హుడు కాదు. కొన్ని రోజుల్లోనే యుద్ధాన్ని ముగించి, ఇరాన్‌ను పాత రాతియుగం వైపు, అంధకారం వైపు తీసుకుపోతానన్న ట్రంప్ ప్రగల్భాలు హాస్యాస్పదంగా మారాయి. ఇరాన్ తో జరుగుతున్న యుద్ధం 8వ నెలలోకి ప్రవేశించినా అమెరికా ఆశలు నెరవేరలేదు. ఇరాన్ వ్యూహాత్మక దాడులు అమెరికా ఆయుధ, ఆర్థిక సంపత్తిని హరించాయి. స్వేచ్ఛాయుత చమురు వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి అమెరికా జోక్యం వలన కీలక యుద్ధ వ్యూహానికి కేంద్ర బిందువుగా మారింది. ఇరాన్ ఓడ రేవులను అమెరికా దిగ్బంధించడంతో ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులు అస్తవ్యస్తమయ్యాయి. బాబ్ ఎల్ మండేబ్ జలసంధి పై హౌతీలు పట్టు బిగించడంతో పరిస్థితి మరింత చేజారింది. యుద్ధాల వలన ప్రపంచం తీవ్రమైన ఆర్థిక మాంద్యం ఎదుర్కొంటున్న దశలో ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం జరిగింది. ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ భారత్‌లో అడుగు పెట్టడం, ఏకపక్ష యుద్ధాలకు స్వస్తి చెప్పాలన్న భారత్‌ను సమర్థించడం విశేషం. కిర్గిస్తాన్ లోని బిష్కెక్‌లో ఇటీవల జరిగిన ఎస్‌సిఓ సదస్సులోకూడా యుద్ధాలను ముగించాలని భారత్ సంబంధిత దేశాలకు విజ్ఞప్తి చేసింది. బ్రిక్స్ సదస్సు తర్వాత అమెరికాలో పర్యటించిన జిన్‌పింగ్ కు ప్రోటోకాల్ పక్కన బెట్టి, ట్రంప్ సాదరంగా స్వాగతం పలకడం విశేషం. ఒక వైపు భారత్‌తో పాటు చైనా పై కూడా 100శాతం టారిఫ్ విధించడం, మరో వైపు చైనా అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు విస్తరించాలని ట్రంప్ అభిలషించడం విడ్డూరం. తైవాన్ విషయంలో అమెరికా ధోరణి మారిందా? చైనాకు తైవాన్‌ను ధారాదత్తం చేసి, చైనాను తనకు అనుకూలంగా మార్చుకుంటుందా? అనే అనుమానాలు పురుడుపోసుకున్నాయి. ఇక



చైనా ఎప్పటి మాదిరిగానే భారత్‌పట్ల తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నది. భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వం పై స్పష్టత నీయకుండా సాకులు వెతుక్కోవడం తగని పని. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారతదేశం చేస్తున్న ప్రయత్నానికి రష్యా మరోసారి బహిరంగ మద్దతు ప్రకటించింది. ఇదే సందర్భంలో బ్రెజిల్‌కు శాశ్వతసభ్యత్వం ఇవ్వాలని రష్యా డిమాండ్ చేస్తున్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఏర్పడిన ఐక్యరాజ్య సమితిలో ప్రస్తుతం 193 సభ్య దేశాలుండగా, భద్రతా మండలిలో 5 శాశ్వత, 10 తాత్కాలిక సభ్య దేశాలున్నాయి. శాశ్వత సభ్య దేశాలు వీటో అధికారం కలిగి ఉండగా, జనాభాలో ప్రపంచంలో అతి పెద్ద దేశంగా ఆవిర్భవించి, అణ్వాయుధ సామర్థ్యం కలిగి, ఆర్థికంగా బలమైన దేశాల సరసన నిలబడి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న భారత్‌ను శాశ్వత సభ్యత్వ దేశంగా పరిగణించకపోవడందురదృష్టకరం. డ్రాగన్ ఆడుతున్న నాటకమే భారత్‌కు శాశ్వత సభ్యత్వం రాకపోవడానికి కారణం. భారత్‌కు శాశ్వత సభ్యత్వం విషయంలో జి4 దేశాలతోపాటు మధ్య యూరప్‌కు చెందినవి4 దేశాలైన చెక్ రిపబ్లిక్, హంగేరీ, పోలాండ్, స్లోవేకియాలు మద్దతునిస్తున్నాయి. ఇకనైనా చైనా ధోరణిమారాలి. శాశ్వత సభ్యత్వానికి భారత్‌కు మద్దతు ప్రకటించాలి. భారత భద్రతకు ప్రమాదమైన పాక్‌లో నిర్మిస్తున్న ఎకనామిక్ కారిడార్ విషయంలోను, టిబెట్‌లో నిర్మిస్తున్న జల విద్యుత్ ప్రాజెక్టు విషయంలోను చైనా వైఖరిలో మార్పు రావాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో చైనా జోక్యం ఉండేలా పాక్ పావులు కదపడం పాక్ చైనా బోర్డర్ కమీషన్ ఏర్పాటుకు నిర్ణయించడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే. ప్రపంచలోవరస్ట్ కంట్రీగా పేరొందిన పాక్ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. బెలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతున్న దారుణాలను, భారత్‌లో విలీనం కావాలనుకుంటున్న ఆ ప్రాంత ప్రజల మనోభీష్టాన్ని వదిలేసి, ఐక్యరాజ్య సమితిలో కాశ్మీర్ గురించి పాక్ మాట్లాడడం సిగ్గుచేటు. ఈ సందర్భంగా భారత విదేశాంగ శాఖా మంత్రి జై శంకర్ ఒక టెర్రరిస్టు దేశం నీతులు చెప్పడాన్ని ఎద్దేవా చేసారు. ప్రస్తుత ప్రపంచం యుద్ధాలతో సతమతమవుతూ ఆర్థికంగా అస్తవ్యస్తమైన నేపథ్యంలో చైనా, పాక్ వంటి దేశాల కారణంగామరో సంక్షోభం రాకుండా చూసుకోవాలి. ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా ఇజ్రాయిల్ దేశాలముగింపు పలకాలి. ఉక్రెయిన్, రష్యాలు యుద్ధాన్ని ముగించి ప్రపంచ దేశాలకు స్వాంతన కలిగించాలి. అదేవిధంగా కెనడాను 51వ రాష్ట్రంగా చేసుకోవాలన్న దురాశను ట్రంప్ విడనాడాలి. హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా నామకరణం చేయడం కవ్వింపు చర్యకాగలదు. ఇజ్రాయిల్ కూడా ప్రపంచం ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని, ఇరాన్ విషయంలోపట్టువిడుపుల ధోరణి ప్రదర్శించాలి. ఆధిపత్యం, అహంకారం ఇతరులపై దౌర్జన్యానికి పురిగొల్పుతుంది. దౌర్జన్యాలు, దారుణాలకు గురైన ప్రజలు ఏనాటికైనా తిరగబడి ప్రతీకారం తీర్చుకుంటారన్న స్పృహ ప్రస్తుతం యుద్ధాలు సాగిస్తున్న దేశాలకు కలగాలి. అప్పట్లో హిట్లర్ జాత్యహంకారంతో ఒక జాతి ప్రజలను, వారి సంస్కృతిని నాశనం చేయడానికి, వారి ఉనికినే లేకుండా చేయడానికి సుమారు 60లక్షల మంది ప్రజలను చంపిన ఘటన చరిత్రలో ఒక దారుణ దమనకాండకు సాక్షీభూతంలా నిలిచింది. ఇదే ఇజ్రాయిల్ ఆవిర్భావానికి దారితీసింది. చుట్టూ శత్రుదేశాలతో కూడుకున్న ఒక ఎడారి ప్రాంతం ప్రపంచంలో అత్యాధునిక సాంకేతిక రక్షణ వ్యవస్థ గల ఇజ్రాయిల్ దేశంగా రూపాంతరం చెందింది. తమ చుట్టూ ఉన్న అరబ్ దేశాలు తమ అస్థిత్వానికి ముప్పు గా పరిణమించాయని భావించిన ఇజ్రాయిల్ తమ దేశాన్ని శత్రు దుర్భేద్యంగా మలచుకుంది. కేవలం కోటి మంది గల జనాభా గల ఇజ్రాయిల్ నేడు సాంకేతికంగా ప్రపంచంలో అగ్రభాగంలో ఉంది. వివక్షత కారణంగా ఏర్పడిన విద్వేషం ఎంత భయంకరంగా ఉంటుందో ఇజ్రాయిల్ దాడులు నిరూపిస్తున్నాయి. గాజా, లెబనాన్, ఇరాన్ పై ఇజ్రాయిల్ తన దాడులను ఆపనంత కాలం, ఇరాన్ పగ ప్రతీకారాలు చల్లారనంతకాలం, అమెరికా ఆధిపత్యం చెలాయించినంత కాలం పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతూనే ఉంటుంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలకు యావత్ ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు. ●

# జీవన సంధ్యలో నీడెవరు! తోడెవరు?

వరిగొండ నవీన్ కుమార్

జీవితంలోని మధురిమలన్నీ చవిచూశాక జీవన యాత్రలో ఆఖరి మజిలీ చేరేసరికి కానీ వార్ధక్యం ఎంతదుర్భరమో తెలుస్తుంది. కొంతమంది బాగా బ్రతికేసామని చెప్పుకున్నా కన్న బిడ్డలకు దూరంగా బ్రతుకుతూ లోలోపల ఎంత కుమిలిపోతున్నారో ఇట్టే పసికట్టవచ్చు. నిజానికి వృద్ధాప్యం శాపం కాదు. 60ఏళ్ల దాటిన తర్వాత శరీరం కంటే ముందు మనసు అలసిపోతుంది. శరీర అవయవ వ్యవస్థ తరచూ మనమీద తిరగబడుతుంది. అడుగడుగునా వయస్సును గుర్తుచేసి మరీ హెచ్చరిస్తుంది. కాదు..కాదు. వెక్కిరిస్తుంది. ఇలాంటివన్నీ పాత అనుభవాలను మింగేస్తాయి. ఐక్యరాజ్యసమితి 1990లో ప్రకటించిన అక్టోబరు 1వ తేదీని ప్రపంచం అంతా 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' గా జరుపుకుంటోంది. భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన వారిసంఖ్య దాదాపు 14కోట్లు దాటింది. మధుమేహం, రక్తపోటు, కీళ్ల నొప్పులు, డిమెన్షియా. ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చు భరించలేని పరిస్థితి. ఆర్థిక అభద్రత కూడా కుంగదీసే విధంగా తయారవుతుంది. పెన్షన్ లేని వారు, పొదుపు లేకపోవడం, పిల్లలపై ఆధారపడటం. ఒంటరితనం, కుటుంబ నిరాదరణ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు కనుమరుగయిన ప్రభావం, ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్‌లు ఇబ్బంది పెడతాయి. కొత్తగా సామాజిక భద్రత లోపం ఒకటి ఆర్థిక దోపిడీకి గురిచేస్తోంది. ఇక ఆధునిక సాంకేతికత కూడా వారిని ఆందోళనలో ముంచేస్తోంది. ఆన్‌లైన్ లావాదేవీలు తెలియక మోసాల వలలో చిక్కుకొంటున్నారు. వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు ప్రతి జిల్లా ఆసుపత్రిలో జెరియాట్రిక్ వార్డు, మొబైల్ హెల్త్ వ్యాన్లు అందుబాటులో ఉంచాయి. ప్రతి మండలంలో వృద్ధుల డేకేర్ కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చాయి. ఓ వయసు వచ్చాక తన అవసరం ఇక ఎవరికీ లేదన్న భావనలో డిప్రెషన్‌తో దిగులుగా ఉండటం, ఆకలి, నిద్రలేకపోవడం, ఆందోళన కలిగించేఅంశాలు. ఆరోగ్యం, భవిష్యత్తు గురించి అతిగా ఆలోచించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, మతిమరుపు, డిమెన్షియా. చిరాకు, మొండితనం ఒక దాని వెంట చుట్టుముడతాయి. వీటన్నింటినీ అధికమించడానికి మనసును ఆరోగ్యంగా ప్రశాంతంగా ఉంచే కార్యకలాపాలకు అలవాటుపడాలి. పుస్తక పఠనం మంచిది. ఉదయం నడక, యోగా, ధ్యానం, తోటపని, సంగీతం, భజన. రోజూ అరగంట కాలనీలలో వృద్ధ మిత్ర కమిటీలతో కాలక్షేపం మనసును మంచి దారివైపు మళ్లిస్తుంది. ఇప్పుడు కుటుంబానికి దూరమై ఎంతోమంది వృద్ధులు 'వృద్ధాశ్రమంలో తమ జీవిత చరమాంకాన్నిఅక్కడే గడపాలని నిర్ణయం తీసుకుంటున్నారు. అవన్నీఅలాఉంచితే సామాజిక పరిస్థితుల రీత్యాకాలం కర్మం కలిసిరాక 'కుటుంబ పెద్ద'ను నడిరోడ్డు మీద నిలబెడితే ఏంచేయాలో చెప్పి అండదండలు అందించే చట్టాలు కూడా ఉన్నాయి. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం2007, సెక్షన్ 4,5 కింద 60ఏళ్లు దాటిన వారు పిల్లల నుండి భరణం పొందే హక్కు ఉంది. సెక్షన్ 23 నీడలో ఒకవేళ బిడ్డలకు ఆస్తి రాసిచ్చిన తర్వాత వారు పట్టించుకోకపోతే రిజిస్ట్రేషన్ రద్దు చేసుకునే హక్కు వృద్ధులకు ఒక వరంగా ప్రసాదించబడినది. 70ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి రూ.5 లక్షల ఉచిత వైద్యం, ఆదాయంతో సంబంధంలేదు. ఇలాంటి కేంద్రప్రభుత్వ పథకాలు కూడా వృద్ధులను ఆదుకుంటున్నాయి. వృద్ధాప్యంలో ఎదురయ్యే సంగతులనుముందుగానే అంచనా వేసుకుని జీవిత లక్ష్యాలను తొలి రోజుల్లోనే సాధించడం వలన తుదిరోజుల్లో సంతోషంగా బతికేయచ్చు. జపాన్‌లో శతాధిక వృద్ధులు లక్షపైమాటే. ఇప్పుడు వారెంతో ఆనందంగా ఉన్నారు. దీర్ఘాయుష్షుతో జీవించడం అంటే అదృష్టమే. కానీ వార్ధక్య బాధలు ఎవరికైనాఒక్కటే. చరమాంకంలో ఆధ్యాత్మికత వైపు మనసు మళ్లిస్తే వృద్ధాప్యం ఒక వరం అవుతుంది. ●

# శాకాహారంతో ఆరోగ్యమే కాదు, ఆర్థిక వ్యవస్థకూ మేలు

దుంగ జయరాం

భారత్‌లో శాఖాహారం గురించి సాధారణంగా సంప్రదాయం, సంస్కృతి, వ్యక్తిగత అభిరుచుల కోణంలోనే చర్చ జరుగుతుంది. కానీ ఇప్పుడు దాన్ని ఆర్థికకోణంలోనూ చూడాల్సిన అవసరం ఉంది. మనం తినే ఆహారం కుటుంబాల ఖర్చులనే కాదు వైద్య వ్యయం, రైతుల ఆదాయం, నీటి వినియోగం, భూమిపై ఒత్తిడి, పని సామర్థ్యం వంటి అంశాలనూ ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగతంగా కనిపించే ఆహార ఎంపికలు కోట్లాది మంది విషయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశంగా మారతాయి. భారత్‌లో పోషకాహార సమస్య స్వరూపం కూడా మారుతోంది. కడుపు నింపడం ఒక్కటే లక్ష్యం కాకుండా తగినంత ప్రొటీన్లు, పీచు పదార్థాలు, సూక్ష్మ పోషకాలు, వైవిధ్యమైన ఆహారం అందడం ఇప్పుడు ముఖ్యమైంది. 2024లో భారత వైద్య పరిశోధనా మండలి-జాతీయ పోషకాహార సంస్థ విడుదల చేసిన ఆహార మార్గదర్శకాలు కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, చిక్కుళ్లు, ధాన్యాలు, గింజలు తదితర వైవిధ్యమైన ఆహారాన్ని ప్రోత్సహించాయి. ఇది కేవలం ఆరోగ్య సూచన కాదు. భారత్‌లో అందుబాటులో ఉన్న ఆహార వనరులతో మెరుగైన పోషణను తక్కువ ఖర్చుతో అందించే అవకాశాన్ని కూడా సూచిస్తోంది. ఆహార ధరలపై దీని ప్రభావం గణనీయంగా ఉండవచ్చు. 2025లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం జాతీయ పోషకాహార సంస్థ సూచించిన ఆహార విధానానికి భారత్ క్రమంగా మారితే 2050 నాటికి ఆహార ధరలు 24శాతం వరకు, కుటుంబాల ఆహార వ్యయం 23 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. అదే నమూనా ప్రకారం మీథేన్ ఉద్గారాలు 36శాతం, నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు 35శాతం తగ్గవచ్చని పేర్కొంది. ఇవి అంచనాలు మాత్రమే. ఖచ్చితమైన ఫలితాలకు హామీ కాదు. అయినప్పటికీ ఆరోగ్యకరమైన ఆహారం తప్పనిసరిగా ఖరీదైనదే అన్న అభిప్రాయాన్ని ఇవి ప్రశ్నిస్తున్నాయి. ఆహారం-ఆరోగ్యం సంబంధాన్ని ఆర్థిక వ్యవస్థ నుంచి వేరు చేయలేం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2021లో భారత్‌లో నమోదైన మరణాల్లో దాదాపు 49శాతం అసంక్రమిత వ్యాధుల వల్లే సంభవించాయి. వీటికి ఆహారం ఒక్కటే కారణం కాకపోయినా, అనారోగ్యకరమైన ఆహారం మార్పగలిగే ప్రమాద కారకాల్లో ఒకటి. వ్యాధుల భారం పెరిగితే వైద్య ఖర్చులతో పాటు పని దినాల నష్టం, ఉత్పాదకత తగ్గడం, ముందస్తు మరణాలు వంటి ఆర్థిక నష్టాలుకూడా పెరుగుతాయి. అందువల్ల మెరుగైన ఆహారవ్యవస్థను ప్రజారోగ్య చర్యగానే కాకుండా మానవ వనరులపై పెట్టుబడిగానూ చూడాలి. అయితే శాఖాహారం అంటే ఆరోగ్యకరమైన ఆహారం అని భావించడం కూడా సరికాదు. మైదా, చక్కెర, వేయించిన పదార్థా



లు, అత్యధికంగా శుద్ధి చేసిన ఆహారంతో కూడిన శాఖాహారం కూడా పోషకపరంగా బలహీనంగాఉండవచ్చు. కాబట్టి లక్ష్యం కేవలం శాఖాహారం అనే ముద్ర కాదు. తక్కువగా శుద్ధి చేసిన, వైవిధ్యభరితమైన, మొక్కల ఆధారిత ఆహారంతో తగిన పోషకాలు అందే విధానాన్ని ప్రోత్సహించాలి. పర్యావరణ పరంగా కూడా ఆహార ఎంపికలకు ఆర్థిక ప్రాధాన్యం ఉంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ అంచనా ప్రకారం 2023లో ప్రపంచ వ్యవసాయ-ఆహార వ్యవస్థల నుంచి 1,650 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ సమాన ఉద్గారాలు వెలువడ్డాయి. ఇది మానవ కార్యకలాపాల ద్వారా వెలువడే మొత్తం ఉద్గారాల్లో సుమారు 32 శాతం. ఇందులో పశుసంవర్ధక రంగం వాటా 430 కోట్ల టన్నులు. నీటి కొరత, భూమిపై పెరుగుతున్న ఒత్తిడిని ఎదుర్కొంటున్న భారత్‌కు ఆహార ఉత్పత్తి వనరుల వినియోగం కీలకమైన అంశం. అయితే పర్యావరణ భారం మాంసాహారానికే పరిమితం కాదు. 2025లో వచ్చిన మరో భారతీయ అధ్యయనం పరిశీలించిన ఆహార విధానాల పర్యావరణ ప్రభావం జాతీయ ఆహార మార్గదర్శకాలతో పోలిస్తే 40-48 శాతం ఎక్కువగా ఉందని అంచనా వేసింది. పాల ఉత్పత్తులు, కొవ్వులు-నూనెలు, అత్యధికంగా శుద్ధి చేసిన ఆహార పదార్థాలు కూడా ఇందులో గణనీయమైన పాత్ర పోషించాయి. అందువల్ల శాఖాహారాన్ని మాత్రమే పర్యావరణ పరిరక్షణకు సమానంగా చూడటం సరైనది కాదు. ఇక్కడ వ్యవసాయ విధానానికి కీలకమైన పాత్రఉంది. భారత ఆహార భద్రత దశాబ్దాలుగా బియ్యం, గోధుమల చుట్టూనే నిర్మితమైంది. ఇక ముందు పోషక భద్రతకు, పంటల వైవిధ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, గింజలకు డిమాండ్ పెరిగితే రైతులకు కొత్త మార్కెట్లు ఏర్పడతాయి. అయితే ఏ పంటను ఎంతగా సాగు చేయాలన్నది స్థానిక నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను బట్టి నిర్ణయించాలి. ప్రజలు ఏం తినాలో ప్రభుత్వం నిర్దేశించాల్సిన అవసరం లేదు. కానీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వచ్చేలా ఆహారవ్యవస్థనుమార్చగలదు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకాలు, పోషకాహార కార్యక్రమాలు, ప్రభుత్వ కొనుగోళ్లు, సంస్థాగత వంటశాలలు వైవిధ్యమైన ఆహారానికి స్థిరమైన డిమాండ్ సృష్టించగలవు. నిల్వ, శీతలీకరణ, ప్రాసెసింగ్, సరఫరావ్యవస్థలను మెరుగుపరిస్తే పండ్లు, కూరగాయలు వంటి త్వరగా పాడయ్యేఆహార పదార్థాలు కూడా ప్రజలకు మరింతఅందుబాటులోకి వస్తాయి. అందువల్ల అసలు ప్రశ్న భారత్ మొత్తం శాఖాహార దేశంగా మారాలా అనేదికాదు. తక్కువ వనరులతో మెరుగైన పోషణ అందించే ఆహార వ్యవస్థను భారత్ నిర్మించగలదా? అన్నదే. ఆహారం మానవ వనరులకు ఇంధనం. వ్యవసాయానికి అది మార్కెట్. ప్రజారోగ్యానికి అది తొలిరక్షణ. పర్యావరణానికి అది వనరుల వినియోగానికి సంబంధించిన నిర్ణయం. అందుకే ఆరోగ్యకరమైన, వైవిధ్యమైన, ప్రధానంగా మొక్కల ఆధారిత భారతీయ ఆహారం అధిక ఆదాయ వర్గాలకే పరిమితంకాకుండా సామాన్యులకుకూడా అందుబాటులో ఉండేలా చేయడం విధానపరమైన లక్ష్యంగా ఉండాలి. వ్యక్తిగతంగా కనిపించే పళ్లెంనిర్ణయం 140కోట్ల మంది విషయంలో ఆర్థికవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. భవిష్యత్తులోభారత్ ఆహారానికి చెల్లించాల్సిన ధరకేవలం కిరాణా బిల్లులో కనిపించదు. వైద్యఖర్చుల్లో, పనిసామర్థ్యంలో, రైతుల స్థిరత్వంలో, నీరు, భూమిపై పెరిగే ఒత్తిడిలోనూ కనిపిస్తుంది. ●

# బిజెపి రాగానే పంజాబ్‌కు డ్రగ్స్ నుంచి విముక్తి



'నషా - ముక్త్ - పంజాబ్ యాత్ర'లో కేంద్ర మంత్రి అమిత్ షా

**జలంధర్, సెప్టెంబరు 30:** పంజాబ్‌లో బిజెపి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. బుధవారం జలంధర్‌లో నిర్వహించిన 'నషా ముక్త్ - పంజాబ్ యాత్ర'లో అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీపై, కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. పంజాబ్ ప్రజలు కపటం పువ్వు గుర్తుకు ఓటేస్తే.. పంజాబ్‌లో అధికారంలోకి వస్తే డిసెంబరు 31, 2029లోపు రాష్ట్రాన్ని డ్రగ్స్ లేని రాష్ట్రంగా మారుస్తాం అన్నారు. కృత్రిమ మత్తు పదార్థాల్ని అమ్ముకునేందుకు పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం అనుమతించిందని ఆరోపించారు. పంజాబ్‌లో రైతులు, పరిశ్రమలు, వ్యవసాయం, శాంతి భద్రతల సమస్య, మహిళల రక్షణ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. బిజెపి ఇచ్చిన హామీలపై కేజ్రీవాల్ అండ్ కంపెనీ ఏం స్పందిస్తుందో చూడాలని షా అన్నారు. ఇచ్చిన హామీల్ని బిజెపి నెరవేరుస్తుందని గుర్తు చేశారు. మోడీ నాయకత్వంలో కాశ్మీర్‌లో బిజెపి తీవ్రవాదాన్ని అంతం చేసిందన్నారు. అలాగే, 50యేళ్లుగా దేశంలోని కీలక సమస్య అయిన నక్సలిజాన్ని నిర్మూలించామన్నారు. ఇప్పుడు పంజాబ్ నుంచి డ్రగ్స్‌ను అంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే, 2004 నుంచి 2014 వరకు దేశంలో కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉన్న సమయంలో 26 లక్షల కేజీల డ్రగ్స్‌ను సీజ్ చేస్తే, 2014 నుంచి 2024 వరకు తమ ప్రభుత్వం 1.2 కోట్ల కిలోల డ్రగ్స్ సీజ్ చేసిందని వివరించారు. కాంగ్రెస్ (యుపిఎ) హయాంలో సీజ్ చేసిన డ్రగ్స్ విలువ రూ.40వేల కోట్లు అయితే, తమ ప్రభుత్వం రూ.1.90 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేసిందని అమిత్ షా వెల్లడించారు.

# ఇబి-5 గ్రీన్‌కార్డ్ ఫీజు భారీగా పెంపు

## విదేశీ పారిశ్రామికవేత్తలకు అమెరికా షాక్



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** అమెరికాలో భారీగా పెట్టుబడులు పెట్టి తద్వారా గ్రీన్‌కార్డ్ పొందాలనుకునే విదేశీయులకు ట్రంప్ సర్కార్ గట్టి షాక్ ఇచ్చింది. భారతీయ పారిశ్రామికవేత్తలు గ్రీన్‌కార్డ్ పొందేందుకు అత్యంత నమ్మకమైన మార్గంగా భావించే ఇబి-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ దరఖాస్తు ఫీజులను రెట్టింపు చేస్తూ అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెరికా సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీస్ యుఎస్‌సిఐఎస్ కొత్త నిబంధనలను ఖరారు చేసింది. పెరిగిన ఈ ఫీజులను నవంబరు 30 నుంచి అమలులోకి రానున్నట్లు స్పష్టం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. స్టాండ్‌ఎలోన్ ఇన్వెస్టర్లు దాఖలు చేసే ఐ-526 ఫామ్ రుసుము భారీగా పెరగనుంది ప్రస్తుతం 3,675 డాలర్లుగా ఉన్న ఈ ఫీజును 7,615 డాలర్లకు పెంచారు. అంటే దరఖాస్తుదారులు గతంలో చెల్లించిన దానికంటే గణనీయంగా ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా, గుర్తింపు పొందిన రీజినల్ సెంటర్ ద్వారా పెట్టుబడులు పెట్టే విదేశీ ఇన్వెస్టర్లు దాఖలు చేసే ఐ-526ఇ ఫామ్ రుసుమును కూడా పెంచారు. ప్రస్తుతం 3,675 డాలర్లుగా ఉన్న ఈ ఫీజు 7,850 డాలర్లకు చేరనుంది. దీనికి అదనంగా 75 డాలర్ల టెక్నాలజీ ఫీజును కూడా చెల్లించాల్సి ఉంటుంది.

**ఐ-829, ఐ-956ఎఫ్ ఫీజులు కూడా పెంపు**

శాశ్వత నివాస హోదాపై ఉన్న షరతులను తొలగించాలని కోరుతూ పెట్టుబడిదారులు దాఖలు చేసే ఐ-829 ఫామ్ ఫీజును కూడా పెంచారు. ప్రస్తుతం 3,750 డాలర్లుగా ఉన్న ఈ రుసుము ఇకపై 5,000 డాలర్లకు చేరనుంది. అలాగే వాణిజ్య సంస్థల్లో పెట్టుబడికి అనుమతి కోరుతూ దాఖలు చేసే ఐ-956ఎఫ్ ఫామ్ ఫీజులోనూ భారీ మార్పు చేశారు. ప్రస్తుతం 17,795 డాలర్లుగా ఉన్న ఈ దరఖాస్తు రుసుమును ఏకంగా 42,675 డాలర్లకు పెంచనున్నారు. దీంతో ఇబి-5 ప్రోగ్రామ్ ద్వారా పెట్టుబడులు పెట్టే విదేశీయులకు దరఖాస్తు దశలోనే గణనీయంగా పెరగనుంది.

**ఇబి-5 ప్రోగ్రామ్ అంటే?**

అమెరికాలో పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించడమే లక్ష్యంగా 1990లో అమెరికా కాంగ్రెస్ ఇబి-5 ప్రోగ్రామ్‌ను ఆమోదించింది. ఈ ప్రోగ్రామ్ కింద విదేశీ ఇన్వెస్టర్లు అమెరికా వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు 1.05 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

# అటకామా ఎడారిలో విరగబూసిన పూలు!



**లండన్, సెప్టెంబరు 30:** ప్రపంచంపై ఈ యేడాది ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో పరిస్థితులు తీవ్రంగా మారినట్లు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రకటించారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా వర్షాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఎల్ నినో వల్ల చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటే, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాలు సంభవిస్తాయి. ఇదిలా ఉంటే, ఎల్ నినో ప్రభావం ఇప్పటికే కనిపిస్తోంది. ప్రపంచంలో అత్యంత పొడి ప్రాంతాల్లో ఒకటైన చిలీలోని అటకామా ఎడారిలో ఇప్పుడు రంగురంగుల పూలు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా వీడు భూములుగా ఉండే ఈ ఎడారిలో ఈ యేడాది అసాధారణ రీతిలో వర్షాలు కురిశాయి. దీంతో నేల కింద ఎన్నో ఏళ్లుగా నిద్రావస్థలో ఉన్న విత్తనాలు, దుంపలు మళ్లీ మొలకెత్తాయి. దీంతో ఉత్తర చిలీలోని అనేక ప్రాంతాలు ఇప్పుడు ఊదా, తెలుపు రంగు పూలతో దర్శనమిస్తున్నాయి. ఈ సహజ దృశ్యాలను 'డెసియెర్టో ఫ్లోరిడో' అని పిలుస్తారు. వర్షాల తర్వాత పూలు మాత్రమే కాదు, ఎడారిలో జీవ వైవిధ్యం కూడా మారుతోంది. పొప్పొడి సేకరించేందుకు తేనెటీగలు, ఇతర కీటకాలు, వాటిపై ఆధారపడే పక్షులు, సరీసృపాలు కనిపిస్తున్నాయి. చిలీ నేషనల్ ఫారెస్ట్ కార్పొరేషన్ (సిఒఎన్ఎఎఫ్) అంచనాల ప్రకారం ఈసారి అక్టోబరు నెలలో పూలు వికసించడం గరిష్టస్థాయికి చేరే అవకాశం ఉందని చెప్పింది. వీటిని చూసేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు రానున్నారు.

# ఇంట్లో నుంచి బయటకు రాలేకపోతున్నా: మమతాబెనర్జీ

**కోల్‌కతా, సెప్టెంబరు 30:** పశ్చిమబెంగాల్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయని, తాను ఇప్పుడు ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బందిగా ఉందని టిఎంసి అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్న ఆమె, బిజెపిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బెంగాల్ ఎన్నికల్లో బిజెపి గెలిచిన తర్వాత అరాచకం, నిరంకుశత్వం పెరిగిందని మమత ఆరోపించారు. టిఎంసి నేతలపై వరసగా దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. అయితే, బిజెపి మాత్రం ప్రజల్లో టిఎంసికి ఉన్న వ్యతిరేకతకు ఇది నిదర్శనని చెబుతోంది. పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, తాను ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని ఆమె వాఖ్యానించారు

# 'ఫ్లై దుబాయ్స్' విమానం హైజాక్ కలకలం

## ప్రమాదాన్ని తప్పించిన ఇండియన్ కెప్టెన్

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసలు



**టెల్ అవీవ్, సెప్టెంబరు 30:** దుబాయ్ నుంచి 180 మంది ప్రయాణికులతో ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానం హైజాక్ అయినట్లు సంకేతాలు రావడంతో కలకలం సృష్టించింది. ఇజ్రాయెల్ అప్రమత్తమై వైమానిక దళాన్ని రంగంలోకి దించింది. నాటకీయ పరిణామాల మధ్య విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. దీంతో ఫ్లై దుబాయ్ విమానం తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. విమానంలో కోపైలట్ జరిపిన దాడియత్నాన్ని, విమానాన్ని కూల్చేయాలన్న కుట్రను ఓ భారతీయ కెప్టెన్ అత్యంత సాహసోపేతంగా తిప్పికొట్టారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రమాదాన్ని వెనక్కడుగు వేయకుండా, దాదాపు 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి రియల్ హీరోగా నిలిచారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానం (ఎఫ్‌జడ్1073) గాల్లో ఉండగా తీవ్ర ఉద్రిక్త చోటుచేసుకుంది. విమానం ఆస్కీకరంగా కేవలం 2 నిమిషాల్లోనే సుమారు 17,400 అడుగుల కిందకు పడిపోయింది. ఈ క్రమంలో విమానంలో హైజాక్ కోడ్ జారీ అయ్యాయి. కాక్‌పిట్‌లో జరిగిన పెనుగులాట కారణంగా విమానం అదుపుతప్పినట్లుగా ప్రాథమిక సమాచారం వెలువడింది. ఒమన్‌కు చెందిన కోపైలట్ ఉద్దేశపూర్వకంగా విమానాన్ని కూల్చేయడానికి ప్రయత్నించినట్లుగా అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో కోపైలట్ అకస్మాత్తుగా దాడికి పాల్పడటంతో ఇండియన్ ఫ్లైట్ కెప్టెన్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ ప్రాణాలను లెక్కచేయకుండా ఆ నిందితుడితో తీవ్రంగా పోరాడారు. తద్వారా జరగబోయే పెను ప్రమాదాన్ని అడ్డుకున్నారు. ఈ సాహసోపేత పోరాటంలో కెప్టెన్ తీవ్ర గాయాలపాలయ్యారు. ఇక కాక్‌పిట్‌లో ఈ హింసాత్మక ఘర్షణ జరుగుతున్న సమయంలో ప్రయాణికుల్లో ఆఫ్‌డ్యూటీ పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. క్యాబిన్‌లోకి ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ఆ విమానాన్ని అత్యవసరంగా సౌదీ అరేబియాలో సేఫ్‌గా ల్యాండ్ చేశారు. ఈ విమానంలో దాదాపు 180 మంది ప్రయాణికులు ఉండగా.. ఎక్కువగా ఇజ్రాయెల్ దేశస్తులు ఉన్నట్లుగా సమాచారం. అయితే, ఈ ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భద్రతా అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు.

# తండ్రిపై ప్రేమతో నాలుగేళ్లుగా మృతదేహాన్ని భద్రపరిచిన కూతురు

**ముంబై, సెప్టెంబరు 30:** ముంబైలోని మలాడ్ ఈస్ట్‌లో మూసి ఉన్న ఒక డే కేర్ సెంటర్ నుంచి వస్తున్న తీవ్ర దుర్వాసన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. రోజురోజుకు వాసన భరించలేనిదిగా మారడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులకు అక్కడ విస్తుపోయే దృశ్యం కనిపించింది. తాళం వేసి ఉన్న ఆ సెంటర్‌ను తెరిచి చూడగా, లోపల ఒక వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. పోలీసుల విచారణలో ఈ ఘటన వెనుక ఉన్న విలక్షణ కోణం బయటపడింది. మరణించిన వ్యక్తి 2022 జూన్‌లో గుండెపోటుతో చనిపోయినట్లు తేలింది. తండ్రిపై అమితమైన ప్రేమతో ఆయనను దూరం చేసుకోలేకపోయిన ఆయన కూతురు, మృతదేహానికి అంత్యక్రియలు చేయకుండా తన వద్దే ఉంచుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో మృతదేహాన్ని భద్రపరిచేందుకు (ప్రిజర్వ్ చేసేందుకు) ఒక విదేశీ కంపెనీ సహాయం కూడా తీసుకుంది. వాస్తవానికి ఈ భవనం బయట 'డే కేర్ సెంటర్' అనే బోర్డు ఉన్నప్పటికీ, లోపల మాత్రం ఎవరూ ఉండటం లేదు. తండ్రి మరణించినా ఆయన తనతోనే ఉన్నాడనే భావన కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కేసులో తన తరఫున వాదించడానికి ఆ మహిళ న్యాయవాదులను నియమించుకుంది. కురార్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, చట్టపరమైన అంశాలతో పాటు కుటుంబం నేపథ్యాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

# కృత్రిమ మేధ విషయంలో చైనాతో కలిసి పనిచేయం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** కృత్రిమ మేధ భవిష్యత్తు ప్రమాణాలపై అధ్యయనం చేయడానికి అమెరికా, చైనాలు కలిసి పని చేయాలనే ఆలోచనను డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. తమ సాంకేతిక నైపుణ్యాలను మరో దేశంతో పంచుకుంటే టెక్ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కోల్పోతుందని ఆయన చెప్పారు. ఎఐపై వైట్‌హౌస్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాలతో చేతులు కలపకపోవడానికి ఎఐపై అమెరికా పరిశోధనలు చేస్తుందని వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం ఎఐ విషయంలో చైనా సహా అన్ని దేశాల కంటే ముందున్నాం. ఈ ఆధిపత్యాన్ని నేను ఇంకా కొనసాగించాలని అనుకుంటున్నాను. అందుకే మన సాంకేతికను, ఎఐ రహస్యాలను మరో దేశంతో పంచుకోవడం నాకు కొంచెం కూడా ఇష్టం లేదు' అని ట్రంప్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఎఐ ప్రమాణాల నివారించేందుకు అమెరికా-చైనా కలిసి పని చేస్తాయని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. వాటిని ట్రంప్ తిరస్కరించారు ఆరు టెక్ దిగ్గజాలతో కృత్రిమ మేధ భద్రతా ఒప్పందం మరోవైపు అమెరికాతో ఆరు టెక్ దిగ్గజాలు కుదుర్చుకున్న కృత్రిమ మేధ భద్రతా ఒప్పందాన్ని ట్రంప్ విడుదల చేశారు. ఎఐ కొత్త తప్పుత్తున్న నేపథ్యంలో గూగుల్, ఎన్విడియా, ఆంత్రోపిక్, ఓపెన్ఎఐ, స్పేస్‌ఎక్స్ఎఐ, మెటా సంస్థలు స్వచ్ఛందంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికి సంబంధించిన డాక్యుమెంట్‌ను ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు.

# సంక్షిప్త వార్తలు

## పట్టుబడ్డ రూ.3 వేల కోట్ల డ్రగ్స్

ముంబై, సెప్టెంబరు 30: భారతీయ కోస్టు గార్డు, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌తో కలిసి ఇరానీ నౌకలో అక్రమంగా సరఫరా చేస్తున్న మాదకద్రవ్యాలను సీజ్ చేశారు. అరేబియా సముద్రంలోని లక్షద్వీప్ సమీపంలో ఈ ఘటన జరిగింది. 526 కేజీల నార్కోటిక్స్ (డ్రగ్స్)ను పట్టుకున్నారు. ఆ నౌకను పాకిస్థానీ జాతీయులు నిర్వహిస్తున్నట్లు కోస్టు గార్డులు తెలిపారు. సెప్టెంబరు 25వ తేదీన ఈ ఆపరేషన్ చేపట్టారు. కోస్టు గార్డులు పట్టుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.3వేల కోట్లు ఉంటుంది. సముద్ర, వైమానిక నిఘా సహకారంతో నౌకను సీజ్ చేశారు. డ్రగ్స్‌లో హెరాయిన్, మెథంఫిటమైన్ ఉన్నాయి. సీజ్ చేసిన డ్రగ్స్, నౌక సిబ్బందిని ముంబైకి తరలించారు.

## బుద్గాంలో ఎన్‌కౌంటర్.. లష్కరే టాప్ కమాండర్ హతం

**శ్రీనగర్, సెప్టెంబరు 30:** జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో బుధవారం ఉదయం భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో లష్కరే తోయిబాకి చెందిన ఓ టాప్ కమాండర్ హతమయ్యాడు. హతమైన ఉగ్రవాదిని సులేమాన్ షా అలియాస్ 'ముస్సా' అలియాస్ 'ఫౌజీ ముస్సా'గా అధికారులు గుర్తించారు. బుద్గాంలో లష్కరే ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ ఎన్‌కౌంటర్ గట్టి ఎదురుదెబ్బ అని భద్రతావర్గాలు విశ్లేషిస్తున్నాయి. భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీస్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి.

## టెనెస్సీలో తొలిసారిగా మహిళకు మరణశిక్ష



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** అమెరికాలోని టెనెస్సీ రాష్ట్రంలో 200 యేళ్లకు పైగా చరిత్రలో తొలిసారిగా ఒక మహిళకు మరణశిక్ష అమలు కానుంది. 1995లో తన సవతి విద్యార్థినిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో దోషిగా తేలిన 50యేళ్ల క్రిస్టా గెయిల్ పైక్‌కు విషపు ఇంజెక్షన్ ద్వారా శిక్షను అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాష్‌విల్లేలోని రివర్‌బెండ్ మ్యాగ్జిమమ్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూషన్‌లో గురువారం ఈ ప్రక్రియ జరగనుంది. చివరి నిమిషంలో ఆమె పెట్టుకున్న అభ్యర్థనలను అమెరికా సుప్రీంకోర్టు, టెనెస్సీ గవర్నర్ తిరస్కరించడంతో శిక్ష అమలుకు మార్గం సుగమమైంది.

## ఖలీద్, షర్జీల్‌కు మరోసారి బెయిల్ నిరాకరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఢిల్లీ అల్లర్ల కేసు నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు కోర్టులో మరోసారి షాక్ తగిలింది. ఇద్దరికి బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఇద్దరూ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. బుధవారం కోర్టు డిస్మిస్ చేసింది. ఈ అంశంలో ఇప్పటికే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని దృష్టిలో ఉంచుకుని బెయిల్ ఇవ్వలేమని కోర్టు తెలిపింది. ఖలీద్, ఇమామ్ ఇద్దరికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడం ఇది మూడోసారి. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ దినేష్ భటోతో కూడిన ధర్మాసనం బెయిల్‌పై నిర్ణయం తీసుకుంది. ఆప్ మాజీ నేత ఖలీద్ సైఫీ, తాహిర్ హుస్సేన్ సహా పలువురిని అరెస్టు చేశారు. ఖలీద్‌ను సెప్టెంబర్ 13, 2020న అరెస్టు చేశారు. అప్పటినుంచి అతడు జైలులోనే ఉన్నాడు. గత జులై 4న కూడా కోర్టు అతడికి బెయిల్ నిరాకరించింది.

# మేజిస్ట్రేట్ ఇంట్లో విజిలెన్స్ తనిఖీలు

## - కోటి నగదు, నగలు, వాచీలు స్వాధీనం



**పాట్నా, సెప్టెంబరు 30:** పాట్నా జిల్లా అదనపు మెజిస్ట్రేట్ ఇంట్లో విజిలెన్స్ అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసం నుంచి కోటి నగదును స్వాధీనం చేసుకున్నారు. డబ్బుతో పాటు ఆభరణాలు, ప్రాపర్టీ పేపర్లు, ఖరీదైన వాచీలను కూడా సీజ్ చేశారు. జిల్లా అదనపు మెజిస్ట్రేట్ రవీంద్ర కుమార్ దివాకర్, దానాపూర్‌లో జిల్లా సబ్ రిజిస్ట్రార్‌గా చేస్తున్న ఆయన భార్య కుమారి స్వీటీ ఇండ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పాట్నా, బెగుసరాయిలో ఉన్న వివిధ ప్రాంతాల్లో సోదాలు చేశారు. రికవరీ చేసిన క్యాష్‌ను లెక్కించేందుకు మెషీన్లు వాడారు. కోటి ఖరీదు చేసే వాచీలను గుర్తించినట్లు చెప్పారు. పాట్నా ఇంటి నుంచి 70 లక్షల నగదు, 6 లక్షలు ఖరీదు చేసే 48 వాచీలు, బెగుసరాయ నుంచి 9 లక్షల క్యాష్, బంగారం, సిల్వర్ ఆభరణాలను, భూ దస్తావేజులను సీజ్ చేశారు. కోటి ఖరీదు చేసే రెండు ప్లాట్లను భార్యాభర్తల పేరు మీద రిజిస్టర్ చేశారు. భార్య పేరుపై కోటిన్నర ఖరీదైన మూడు ప్లాట్లను కూడా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ శాఖ అధికారులు నగదు, జ్యువెలరీ, డాక్యుమెంట్లను వెరిఫై చేశారు. విజిలెన్స్ శాఖ డిఐజి ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ సాగింది. అయితే సమగ్రంగా దర్యాప్తు పూర్తి అయిన తర్వాత మాత్రమే నగదు, జ్యువెలర్ వివరాలను వెల్లడించనున్నట్లు అధికారులు చెప్పారు.

# టపాసులు ఎప్పుడంటే అప్పుడు కాలుస్తామంటే కుదరదు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశంలో అత్యంత వాయు కాలుష్యం ఉన్న నగరాల్లో ఢిల్లీ ఒకటి. అలాంటి నగరంలో టపాసుల వాడకం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. టపాసుల్ని పూర్తిగా నిషేధించలేమని, అలాగే, 24 గంటలపాటు అనుమతివ్వలేమని కోర్టు వ్యాఖ్యానించింది. అందుకే, మధ్యంతరంగా ఒక పరిష్కారం కనుగొనాలని కోర్టు అభిప్రాయ పడింది. ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. "ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించలేం. ఎలా చేస్తే కొందరి మనోభావాలు దెబ్బతింటాయి. అలాగని, టపాసులు కాల్చేందుకు 24 గంటలు అనుమతి ఇవ్వలేం. దీనివల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు చాలా ఇబ్బందులు పడతారు. అందుకే, ఈ విషయంలో ఒక మధ్యంతర పరిష్కారం అవసరం. అలాగే, కాల్చే టపాసులు ఎలాంటివి ఉండాలి.. ఎంత కాలుష్యం విడుదల చేసేవి.. ఎంత శబ్ద కాలుష్యాన్నిఅనుమతించాలి వంటి విషయాల్లో కొన్ని నిబంధనలు రూపొందించాలి. కొన్ని గంటలపాటే టపాసులు కాల్చేందుకు అనుమతివ్వాలి. అది ఎంత వరకు అనేది తేల్చాల్సి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. టపాసులు కాల్చే విషయంలో, అనుమతించే విషయంలో తాము సూచించిన నిబంధనల్ని పరిశీలించాలని, ఈ విషయంలో స్పందన తెలియజేయాలని కోర్టు కేంద్రానికి సూచించింది. కేసు తదుపరి విచారణను అక్టోబరు 15కు వాయిదా వేసింది.

# ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టివి!

## - కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

## - 19 నగరాల్లో ట్రయల్స్ విజయవంతం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** మొబైల్ ఫోన్‌లో లైవ్ టివి ఛానళ్ళ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (డి2ఎం) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టివి ప్రసారాలను వీక్షించవచ్చు. 'డి2ఎం' అనేది బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టివి, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి.

# భూ వివాదం కేసు - జార్ఖండ్ సిఎంపై అభియోగాలు నమోదు



**రాంచీ, సెప్టెంబరు 30:** రాంచీలోని బర్గైన్ సర్కిల్ పరిధిలో ఉన్న 8.86 ఎకరాల భూమికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై రాంచీలోని ప్రత్యేక పిఎంఎల్ఎ కోర్టు బుధవారం అధికారికంగా అభియోగాలను నమోదు చేసింది. ఈ కేసులో న్యాయపరమైన విచారణ ప్రక్రియలో ఇది ఒక కీలక ముందడుగు. బుధవారం జరిగిన విచారణ సందర్భంగా సోరెన్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రత్యేక పిఎంఎల్ఎ కోర్టు ముందు హాజరయ్యారు. కోర్టు ఆయనపై అభియోగాలను నమోదు చేసిన తర్వాత, ఇప్పుడు ఈ కేసు విచారణ తదుపరి దశకు చేరుకోనుంది. ఇడి దర్యాప్తు అనంతరం ఈ కేసులో మొత్తం 17 మందిని నిందితులుగా పేర్కొన్నారు. మిగిలిన 16 మంది నిందితులపై ఇప్పటికే వివిధ దశల్లో అభియోగాలు నమోదు కాగా, సోరెన్‌కు సంబంధించిన ప్రక్రియ బుధవారం పూర్తయింది. అభియోగాలు నమోదు చేయడానికి ముందే, ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణ ప్రక్రియపై స్టే (నిలుపుదల) కోరుతూ సోరెన్ జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఇడి తన దర్యాప్తును పూర్తి చేసే వరకు అభియోగాలను నమోదు చేసే ప్రక్రియ ముందుకు సాగకూడదని వాదిస్తూ, ప్రత్యేక పిఎంఎల్ఎ కోర్టు సెప్టెంబర్ 21న ఇచ్చిన ఆదేశాలను ఆయన క్రిమినల్ రిట్ పిటిషన్ ద్వారా సవాలు చేశారు. అయితే, ముఖ్యమంత్రికి తక్షణ ఉపశమనం కల్పించడానికి హైకోర్టు బుధవారం నిరాకరించింది. అనుబంధ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, సంబంధిత పలకు దాని కాపీని అందించాలని ఇడిని కోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి విచారణ అక్టోబరు 28కి నిర్ణయించబడింది. సోరెన్‌పై అభియోగాలు నమోదైన నేపథ్యంలో, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పుడు విచారణ దశలోకి ప్రవేశించింది. దీని తర్వాత, ప్రాసిక్యూషన్ కోర్టు ముందు సాక్ష్యాలను సమర్పించడం, సాక్షులను విచారించడం ప్రారంభిస్తుంది. చట్టపరమైన ప్రక్రియకు అనుగుణంగా ప్రత్యేక పిఎంఎల్ఎ న్యాయస్థానం ముందు విచారణ కొనసాగుతుంది.

## రష్యాలో కూలిన టియు - 95 బాంబర్ - ఆరుగురు మృతి



**మాస్కో, సెప్టెంబర్ 30:** రష్యాలో టియు - 95 స్ట్రాటజిక్ బాంబర్ కూలింది. తూర్పు దిశగా ఉన్న అముర్ ప్రాంతంలో శిక్షణ పొందుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ ప్రమాదంలో ఆరు మంది సిబ్బంది మృతి చెందినట్లు రక్షణ శాఖ పేర్కొన్నది. గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. జన సాంద్రత లేని ప్రాంతంలో బాంబర్ కూలినట్లు రక్షణ శాఖ తెలిపింది. బాంబర్ కూలిన ప్రాంతానికి రష్యన్ ఏరోస్పేస్ ఫోర్సెస్ కమిషన్ సభ్యులు వెళ్లారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

## వియత్నాంలో రోడ్డు ప్రమాదం - ఇద్దరు భారతీయులు మృతి

**రాంచీ, సెప్టెంబరు 30:** జార్ఖండ్‌కు చెందిన రాజకుమార్ వర్మ (26), వినయ్ యాదవ్(23) వియత్నాంలోని దాలాట్ నగరంలో జరిగిన బైక్ ప్రమాదంలో మరణించారు. వీరు యోగా నేర్పేందుకు జార్ఖండ్ నుంచి వియత్నాం వెళ్లారు. వీరు యోగా క్లాసులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వీరి బైక్ బురద రోడ్డుపై జారిపడి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వర్మ అక్కడికక్కడే మరణించగా, యాదవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత మరణించారు.

# పారిశ్రామిక పరికరాలు.. ఉత్పత్తి ప్రక్రియపై అవగాహన పెంపొందించాలి

## శక్తి, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి

**హైదరాబాద్,సెప్టెంబరు 30ప్రభాతవార్త:** పరిశ్రమలలో ఉపయోగించే పరికరాలు, ఉత్పత్తి ప్రక్రియలపై విద్యార్థులకు పరిజ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కల్పించడం ద్వారా వారి ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచ వచ్చని అంతేకాదు సాధన చేయడంతోపాటు సంపా దించడం అలవాటు చేసుకోవాలని శక్తి, గనులు భూగర్భ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో శక్తి, గనులుభూగర్భ శాఖల మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్‌ను సందర్శించింది. ఈ పర్యటనలో పెద్దపల్లి లోక్‌సభ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ఉపాధిశిక్షణ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ అమలు చేస్తున్న లెర్న్ అండ్ ఎర్న్‌విధానం, లైవ్ ప్రొడక్షన్ యూనిట్లు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కరికులం, నైపుణ్యాభివృద్ధి నమూనాలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఒడిశా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీగా గుర్తించిన సెంచూరియన్‌వర్సిటీ విద్యార్థులకు డిగ్రీలతో పాటు పరిశ్రమ స్థాయి పరికరాలపై ప్రత్యక్ష ప్రయోగాత్మక శిక్షణ అందిస్తోంది.అడ్వాన్స్‌డ్ మాన్యు ఫ్యాక్చరింగ్, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహనాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ, సిఎన్‌సి మెషినింగ్, స్మార్ట్ అగ్రికల్చర్, అప్పారెల్ ప్రొడక్షన్ తదితర రంగాల్లో లైవ్ ప్రొడక్షన్ యూనిట్లను నిర్వహిస్తు, ఆ ఉత్పత్తులను మార్కెట్లో విక్రయించడం ద్వారా విద్యార్థులు పరిశ్రమ అనుభవాన్ని పొందడంతో పాటు స్టైపెండ్ పొందే అవకాశం కల్పిస్తున్న విధానాన్ని అధ్య యనం చేశారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలను అందించేందుకు గ్రామ్ తరంగ్ సంస్థ ద్వారా నిర్వహి స్తున్న కార్యక్రమాలపై కూడా అవగా హన ఏర్పచుకొన్నారు.. ఈ సందర్భం గా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ముక్తి కె. మిశ్రా, వివిధ విభాగాల అధిపతులతో మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని బృందం సమావేశము య్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేశామని అంతే కాకుండా విదేశాలలో ఉపాధిమార్గాలు కూడా కల్పిస్తు న్నామన్నారు. పిఎం సేతు ద్వారా ఐటిఐల ఆధునీకరణ, అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు వంటివి చేశామని వివరించారు టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను చేపట్టడంతో అనేక మంది విదేశా ల్లో ఉపాధిపొందారని వివరించారు. తెలంగాణలో ఏర్పా టు చేస్తున్న నైపుణ్య శిక్షణ వ్యవస్థకు సెంచూరియన్ యూనివర్సిటీ అనుభవాలను అనుసంధానించే అవకాశాలపై సమాలోచనలు చేయాలని ఆయన కోరారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంత యువతకు తయారీ రంగంలో ప్రత్యక్ష అనుభవం కల్పించడం ద్వారా విధుల్లో చేరిన మొదటి రోజు నుంచే మెరుగైన ప్రదర్శన కనబరిచేలా వారిని తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.


బుధవారం ఒడిశాలోని సెంచూరియన్ వర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌ను సందర్శించిన శక్తి, గనులు భూగర్భ శాఖ మంత్రి వివేక్

**వరల్డ్ స్కిల్ సెంటర్ సందర్శించిన మంత్రి వివేక్**

ఒడిశాలోని భువనేశ్వర్‌లో వరల్డ్ స్కిల్ సెంటర్‌ను మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం సందర్శించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫినిషింగ్ స్కూల్ విధానం, అధు నాతన శిక్షణా ప్రయోగశాలలు, విదేశీ ఉపాధికి అవసంమైన సాంకేతిక, భాషా, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణా విధానాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. సింగపూర్ ఐటిఇ నమూనాతో, ఏడిబి సింగపూర్ఐటిఇస్ భాగస్వామ్యంతో పనిచేస్తున్న డబ్ల్యుసి లో మెకాట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ తదితర రంగాల్లో అధునాతన శిక్షణ అందిస్తున్న విధా నాన్ని తెలంగాణలో కూడా ప్రవేశపెట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ కమిషనర్ భూపేంద్రసింగ్ పూనియా, వరల్డ్ స్కిల్ సెంటర్ సిఇఒ రష్మిరంజన్ మహాపాత్రతో మంత్రి, అధికారుల బృందం సమావేశమైంది.

# 1,157 చరఖాల ప్రదర్శనతో 157వ గాంధీ జయంతి ఉత్సవాలు

## పిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** పరమత సహనం, భారత దేశ ప్రగతికి యువతను గాంధేయమార్గంలో నడిపించడానికి అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా 1157 చరఖాలను ఎల్‌బిస్టేడియంలో ప్రదర్శిస్తామని పిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ తెలిపారు. గాంధీభవన్‌లో బుధ వారం గాంధీ ప్రతిష్ట సంస్థ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్‌లో శ్రీనివాస్ రెడ్డి, కల్వ సుజాత, ప్రభాకర్, నాగేశ్వరరావు, కోటి రెడ్డి, దయాకర్ రెడ్డి తదిత రులు మాట్లాడుతూ జ్ఞానప్రతిష్ట సంస్థ నేతృత్వంలో మహాత్మా గాంధీ 157వ జయంతి కార్యక్రమాలు అక్టోబర్ 2వ తేదీన ఎల్.బి స్టేడియంలో పెద్దఎత్తున ఘనంగా నిర్వహించబోతున్నామనీ ఈ సంద 1157 చరకాలు ప్రదర్శిం చనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్య క్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# రేపటి సిఎం ప్రజావాణి వాయిదా

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో అక్టోబరు 2వ తేదీ (శుక్రవారం) నిర్వహించనున్న సీఎం ప్రజావాణీ కార్యక్రమం గాంధీ జయంతి సందర్భంగా 6వతేదీ (మంగళవారం) కు వాయిదా వేసినట్లు స్టేట్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలియజేసారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి అక్టోబరు 2వ తేదీ శుక్రవారం కాకుండా అక్టోబరు 6వ తేదీ మంగళవారం సిఎం ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

# రాష్ట్రంలో 5.75 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడి

## ఈ ఖరీఫ్‌లో 48.33 లక్షల ఎకరాల్లో సాగు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత 2026-27 ఖరీఫ్ సీజన్‌లో 5.75 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో 48,33,102 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ సీజన్‌లో ఎకరానికి సగటున 11.90 క్వింటాళ్ల ఉత్పాదకత ఉంటుందని అంచనా. రాష్ట్రంలోని ఆదిలాబాద్ తదితరజిల్లాల్లోని పలు ప్రాంతాల్లో నల్లరేగడి నేలల్లో వేసిన పత్తి దిగుబడు బాగుంటుందని లెక్కలు వేస్తున్నారు. చాలా చోట్ల పత్తి పంట ఇంకా కోతకు రాలేదు. గత ఏడాదిలా కాకుండా, ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ సీజన్‌లో వాతావరణం చాలా వరకు పొడిగా ఉన్నందున, పత్తి పంటలో తేమ శాతం ఈ సీజన్‌లో పెద్ద సమస్యగా మారకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనికి తగినట్లుగా రాబోయే నెలల్లో పొగమంచు పరిస్థితులు ఉంటాయని వాతావరణ సూచన కూడా అంచనా వేయలేదు. కాగా పత్తిని మార్కెట్ యార్డ్‌కు తీసుకురావడానికి ముందే కపాస్ కిసాన్ యాప్‌లో తమ స్లాట్‌ను బుక్ చేసుకున్న రైతులకు కొనుగోలులో మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కాటన్ కార్పొరేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొనుగోలు ప్రారంభానికి ఏడు రోజుల ముందు స్లాట్‌ల కేటాయింపు మొదలవుతుందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తేమ మీటర్లు అందుబాటులో ఉంటాయి. రైతులు తమ పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చే ముందు రైతు వేదికల వద్ద అందులోని తేమను తనిఖీ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇక మధ్యవర్తుల వల్ల కలిగే సమస్యలను నివారించడానికి, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చూసేందుకు సంబంధిత మార్కెట్ యార్డ్ అధికారులు యాప్ ద్వారా పత్తి అమ్మకాల కోసం రైతులను ఆయా జిన్నింగ్ మిల్లులకు అనుసంధానించనున్నారు.

# ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌దే గెలుపు

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ ధీమా

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎన్నికలు గ్రామపంచాయతీ నుంచి మొదలు కొని పార్లమెంట్ వరకు జరిగిన ఎన్నికలు ఏవైనా మన పార్టీ వెంట ప్రజలు నడుస్తున్నారని కాంగ్రెస్‌దే గెలుపని రేపు జరగబోయే పట్టభద్రుల ఎన్నికలలో కూడా రెండుస్థానాలు అలవాకోగా మొదటి ప్రాధన్యత ఓటుతోనే కాంగ్రెస్ గెలువబోతుందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌ని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ మాత్రమే కాదు దేశం మొత్తం ఇప్పుడు కాంగ్రెస్ పాలన కోసం చూస్తోందని ఆయన తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితేనే సమసమాజ నిర్మాణం జరుగుతోందని కొంత మంది పెద్దల వద్దమాత్రమే సంపద పోగుచేసేలా బిజెపి పాలన దేశంలో ఉందని దుయ్యబట్టారు. ఇకపై గ్రాడ్యుయేట్‌ల అభిప్రాయం కాంగ్రెస్‌కు అనుకూలంగా కూడగట్టాలని ఆయన కోరారు.

# సంక్షేమ, వ్యవసాయాభివృద్ధి పథకాలు సద్వినియోగం

## కిసాన్ మేళాలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి సూచించారు. మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లిలో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళాకు హాజరైన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలు, వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్రను మరింత ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కిసాన్ మేళాలో రైతుల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను కమిషన్ పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, మరికంటి భవానిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, డి. విజయేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బుధవారంరాత్రి లోక్‌భవన్ ప్రాంగణంలో 18వ పెయింట్ ది సిటీ పింక్ ప్రచారంలో భాగంగా వెల్లివిరిసిన గులాబీ కాంతులు

# రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు గవర్నర్ శివప్రతాప్‌శుక్లా చేయూత

## అవగాహన మాసం సందర్భంగా లోక్‌భవన్ గులాబీమయం.. ముందస్తు గుర్తింపుతోనే ప్రాణరక్షణ

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంపొందించి, ముందస్తు గుర్తింపు ద్వారా మహిళల ప్రాణాలను కాపాడాలన్న సంకల్పానికి రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా మద్దతుగా నిలిచారు. అంత ర్జాతీయ రొమ్ము కేన్సర్ అవగాహన మాసం సందర్భంగా ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ చేపట్టిన 18వ పెయింట్ ది సిటీ పింక్ ప్రచారంలో భాగంగా బుధవారంరాత్రి లోక్‌భవన్ గులాబీ కాంతులతో వెలిగింది. ఫౌం డేషన్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ పి.రఘురామ్‌తో కలిసి గవర్నర్ ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. రొమ్ము ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ముందుగానే గుర్తించేలా మహిళలను చైతన్యపరిచేందుకు డాక్టర్ రఘురామ్ చేస్తున్న విశేష కృషిని ప్రశంసించారు. లోక్ భవన్ వరుసగా ఏడో ఏడాది ఈ ప్రచారంలో భాగస్వామ్యం కావడం విశేషం. చార్మినార్, బుద్ధ విగ్రహం, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల, ప్రసాద్స్ ఐమాక్స్, టీహబ్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, కిమ్స్ ఆసుపత్రి సహా హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రముఖ కట్టడాలు గులాబీ వెలుగులతో మెరిశాయి. 'పెయింట్ ది సిటీ పింక్ కేవలం భవనాలను వెలిగించడం కాదు.. ఆశ, ధైర్యాన్ని నింపుతూ రొమ్ము క్యాన్సర్‌పై మోనాన్ని వీడి, ముందస్తు గుర్తింపుతో ప్రాణాలను కాపాడాలనే సందేశాన్ని చాటడం' అని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ పి. రఘు రామ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే హైదరాబాద్ మాత్రమే వరుసగా 18 సంవత్సరాలుగా ఒకే రాత్రి ఇన్ని చారిత్రక కట్టడాలు, ప్రముఖ భవనాలను గులాబీ రంగులోకి మారుస్తున్న ఏకైక నగరం అని పేర్కొన్నారు. 2009లో ప్రారంభమైన పెయింట్ ది సిటీ పింక్ ప్రచారం ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై ఉన్న భయాలు, అపోహాలను తొలగించి, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రొమ్ములో ఏదైనా కొత్త మార్పు కనిపించినా, నిరక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తు గుర్తింపుతో చికిత్స ఫలితాలు మెరుగుపడటమే కాకుండా, ప్రాణాలను కాపాడే అవకాశం కూడా పెరుగుతుంది.

# నకిలీ సోయా టోకరా

## నిండా మునిగిన రైతులు
## కొన్ని జిల్లాల్లో మొలకలే రాని పరిస్థితి
## మరికొన్ని చోట్ల కాయల్లో మొలకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విత్తనాలు రాజ్యమేలుతూ రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. రైతులను నకిలీ సోయా విత్తనాలు నట్టేట ముంచాయి. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు చేసి సాగుకు సిద్ధమైన రైతన్నలను నాసిరకం విత్తనాలు నట్టేట ముంచుతున్నాయి. తొలకరి వర్షాలకు ఆశగా విత్తనాలు వేసిన రైతన్నకు నకిలీలు గుండెకోత మిగిల్చాయి. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి.. వందలాది ఎకరాల్లో రైతులు విత్తనాలు విత్తగా కొన్ని చోట్ల అవి మొలకెత్తడం లేదు. మరికొన్ని చోట్ల ప్రస్తుతం కాయ కోత దశలో మొలకలు రావడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఎల్ నినో నేపథ్యంలో ప్రభుత్వం, అధికారుల సూచనల మేరకు ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సంగారెడ్డి తదితర జిల్లాలో 3,72,500 ఎకరాల్లో రైతులు పత్తికి బదులు స్వల్పకాలిక పంట అయిన సోయాను సాగు చేశారు. జూన్ మొదటి వారంలో వేసిన సోయా అక్టోబర్ మొదటి, రెండో వారాల్లో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం పంట కోతకు సిద్ధంగా ఉన్న దశలో కాయల్లో మొలకలు రావడంతో రైతులు నష్టపోయారు. సాధారణంగా కాయలు ఎండిపోయిన సమయంలో వానలు పడితే మొలకలు వస్తాయని, జిల్లాలో వేసవిని తలపిస్తున్న వాతావరణం ఉండగా మొలకలు వచ్చే అవకాశం లేదని, నకిలీ విత్తనాల ఇందుకు కారణమని రైతులు అంటున్నారు. ఈ మేరకు సోమవారం పలువురు రైతులు సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. లక్షల రూపాయల పెట్టుబడులతో సాగు చేసిన సోయా పంటను నకిలీ విత్తనాలు కారణంగా నష్టపోయామని, తమకు నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కొంతకాలంగా ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి నాటారు. వ్యాపారులు మహారాష్ట్రతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి సోయా విత్తనాలు దిగుమతి చేసుకొని విక్రయించారు. ఈ ఏడాది సీజన్‌కు ముందుగానే రైతులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతోపాటు ఇతర మండల కేంద్రాల్లోని ప్రముఖ కంపెనీలకు చెందిన విత్తనాలను విత్తారు. నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని హస్గుల్, హంపోలి, మాటేగాం, వాలేగాం, బిజ్జూర్, మాగాం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో రైతులు సోయా సాగు చేశారు. భైంసా పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో వివిధ ప్రైవేటు కంపెనీలకు చెందిన విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ విత్తనాలు వేసి పక్షం రోజులు గడుస్తున్నా మొలకలు రావడం లేదు. అనుమానంతో నేలను తవ్వి చూడగా, విత్తనాలన్నీ మొలకెత్తకుండా భూమిలోనే కుళ్లిపోయి కనిపించాయి. తాజాగా కాయలు కాసినా అవి మొలకలు రావడంతో నకిలీలతో నష్టపోయినట్లు రైతులు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేలా గ్రామాల్లో ఉపాధి పనులు

## గ్రామ సభల నిర్ణయాలకు ప్రాధాన్యం, విబి జిరామ్‌జి అమలుపై మంత్రి సీతక్క సమీక్ష
## 12 వేలకుపైగా సర్పంచులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహణ


బుధవారం సచివాలయం నుంచి సర్పంచులతో మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు, నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సర్పంచులు, సీఈవోలు, డిఆర్డిఒలు, మండల, జిల్లా అధికారులను, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆదేశించారు. విబి-జి రామ్ జీ పథకం అమలుపై బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, అధికారులతో సచివాలయం నుంచి మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి 12 వేలకుపైగా సర్పంచులు హాజరయ్యారు. ఎలినో పరిస్థితుల కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల గ్రామీణ కూలీల ఆదాయం, వ్యవసాయం, భూగర్భజలాలు, పశుగ్రాసంపై ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అందుకే విబి-జి రామ్ జీ పనులను కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమంగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కల్పించేలా, నీటి వనరులను పెంపొందించేలా అమలు చేయాలని సూచించారు. సర్పంచులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించి పనులను వేగవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. 'ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కథానాయకుడిగా వ్యవహరించాలి. మన ఊరు-మనమే బాగు చేసుకోవాలన్న స్ఫూర్తితో పనిచేయాలి' అని అన్నారు. ఉపాధి హామీ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులను వినియోగించకపోతే భవిష్యత్‌లో నిధుల కేటాయింపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని సర్పంచులను మంత్రి హెచ్చరించారు. ఎన్ని పనులు సమర్థవంతంగా చేపడితే అంత మేరకు గ్రామాలకు నిధులు వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 100 నుంచి 150 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, రోజుకు రూ.308 వేతనం అందేలా ఉత్పాదక పనులను ప్రణాళిక చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ పనులు కూడా జరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంలో సమన్వయం పాటిస్తూ ప్రతిరోజూ కనీసం 6 లక్షల మంది కూలీలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎలినో ప్రభావం దృష్ట్యా ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సీతక్క ఆదేశించారు. 'ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట' అనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు.ప్రతి గ్రామ పంచాయతీలో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ ఆధారంగా గ్రామ అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో పనులను ఎంపిక చేయాలని సూచించారు.

అక్టోబ 2న నిర్వహించే గ్రామసభల్లో పనులకు ఆమోదం తీసుకుని, 2026 అక్టోబర్ నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులను ముందుగానే సిద్ధం చేసి, జూన్ 2027లోపు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఇరిగేషన్, ఫారెస్ట్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించే పనులను గుర్తించాలని తెలిపారు.గ్రామంలో అవసరం ఉన్న ప్రతి కుటుంబానికి కొత్త జాబ్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన కుటుంబ సభ్యుల పేర్లను జాబ్ కార్డులో నమోదు చేయాలని, దరఖాస్తు నుంచి జాబ్ కార్డు జారీ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. 'ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు శాశ్వత ఆస్తులు సృష్టించాలి' అని మంత్రి సీతక్క అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి సుమారు రూ.25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉపాధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. జనాభా, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాలకు నిధులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# ఆస్పత్రుల్లో మందులు లేవు.. గనుల్లో సేఫ్టీ లేదు

## సింగరేణికి రావాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి
## కరెంట్ సరిగా రాక రైతన్నల గోస.. మోటార్లు పాడై తీవ్రనష్టం
## సిసిసి కార్నర్‌లో ఎంపి ఈటల రాజేందర్ ధ్వజం


నిరసన సభలో ప్రసంగిస్తున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**నస్పూర్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను తక్షణమే వడ్డీతో సహా చెల్లించాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని సీసీసీ కార్నర్ వద్ద బీజేపీ, బీఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి బకాయి.. బీజేపీ లడాయి పేరుతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ నిరసన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లా డుతూ, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను కేవలం ఆదాయ వనరుగా, బంగారు గుడ్లు పెట్టే బాతులా వాడుకుంటూ నిర్వీర్యం చేస్తున్నాయని మండి పడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సకల జనుల సమ్మెతో రాష్ట్రాన్ని తెచ్చిన సింగరేణి కార్మికులకు బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఒకప్పుడు 1.16 లక్షల మంది శాశ్వత కార్మికులతో కళకళలాడిన సంస్థలో నేడు ఆ సంఖ్య 39 వేలకు పడిపోవడం శోచనీయమన్నారు. కోల్ ఇండియా తరహాలోనే సింగరేణిలోనూ కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.1,250 వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డులో పెద్ద ఎత్తున అవినీతి రాజ్యమేలు తోందని, కాంట్రాక్ట్ కార్మికుల నియామకాల్లో ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కమిషన్ల కక్కుర్తితో ఓబీ కాంట్రాక్టర్లకే బొగ్గు వెలికితీత పనులు అప్పగించడం దారుణమన్నారు. సింగరేణి ఆసుపత్రుల్లో సరైన మందులు లేక, గనుల్లో సేఫ్టీ పరికరాలు కొరవడి కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు ప్రభావిత ప్రాంతాల్లో వెచ్చించాల్సిన డీఎమ్ఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, చివరకు ముఖ్యమంత్రి ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం సింగరేణి నిధుల నుంచి రూ.10 కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, శ్రీశైలం, ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆమరాజుల శ్రీదేవి, బొడిగె శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ వెరిఫికేషన్ యాప్‌తో యాదృచ్ఛిక పద్ధతిలో ఆకస్మిక తనిఖీలు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రైస్ మిల్లుల్లో ధాన్యం, బియ్యం నిల్వలను వివిధ దశను పర్యవేక్షిం చేందుకు కొత్తగాపౌరసరఫరాల శాఖ రూపొందించిన ఫిజికల్ వెరిఫికేషన్ యాప్ యాధృచ్ఛిక పద్ధతిలో డిజిట లైజ్‌డ్ సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేయడానికి అవకాశం ఏర్పడింది.రైసుమిల్లర్లు సిఎంఆర్ బియ్యంతో చేసే అక్రమాలకు ముకుతాడువేసేందుకు ధాన్యం కేటాయింపు నుంచి మిల్లింగ్, బియ్యం, నిల్వలు, సిఎంఆర్ సరుకు సరఫరా వరకు యాదృచ్ఛిక ఎంపిక పద్ధతిలో వారానికి ఒక రోజు ఆకస్మిక భౌతిక తనిఖీలు నిర్వహించే మార్గం సుగమంగా మారింది.ధాన్యం నుంచి బియ్యం వరకు ప్రతి క్వింటాకు లెక్క పక్కాగా ఉండేలా డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థ ఫిజికల్ వెరిఫికేషన్‌తో మరింత పటిష్టం కానుంది.

దీంతో రికార్డుల్లో ఉన్న నిల్వలు, మిల్లుల్లో వాస్తవంగా ఉన్న నిల్వలను అధికారులు అక్కడికక్కడే తనిఖీకి వచ్చిన పోల్చిచూడనున్నారు. రైస్‌మిల్లుల్లో తనిఖీలకు వెళ్లే విషయం ముందుగానే మిల్లరుకు ఉప్పందడంతో ధాన్యం నిల్వలను కృత్రిమంగా సర్దుబాటు చేసుకోవడానికి వీలుకలిగేది.అంతేకాకుండా కొంత మందిఅధికారులు కూడా కాకి లెక్కలు వేసి అమ్యామ్యాల మత్తులో అంతా బాగుందని సంతృప్తిని వ్యక్తంచేస్తూ నివేదించడానికి వీలయ్యేది. ఫిజికల్ వెరిఫికేషన్ కొత్త విధానం అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా యాదృచ్ఛిక ఎంపిక పద్ధతిలో అమలు చేస్తున్నారు. ఏ మిల్లును ఏ అధికారి తనిఖీ చేయాలన్నది ముందుగా నిర్ణ యించకుండా యాప్ ద్వారానే కేటాయిస్తారు. తనిఖీకి వెళ్లే అధికారికి సైతం మిల్లు వివరాలు సుమారు 12 గంటల ముందు మాత్రమే ఎస్ఎంఎస్ ద్వారా అంద నున్నాయి. దీంతో ఆకస్మిక తనిఖీలకు మరింత ప్రాధాన్యం ఏర్పడనుంది. ఫిజికల్ వెరిఫికేషన్ యాప్‌లో తెలంగాణలోని ఏదైనా రైస్‌మిల్లు తీసకొని పరిశీలిస్తే ఆ మిల్లుకు ఎంత ధాన్యం కేటాయించారనే గణాంకాలు అందుబాటులో ఉంటాయి. ఎన్నిరోజులలో ఎంత మిల్లింగ్ చేశారనేది కూడా లభ్యం అవుతోంది. ప్రభుత్వానికి ఎంత సిఎంఆర్ అందించారు ఇంకా ఎంత స్టాక్ అతని వద్ద ఉంది అధికారుల అనుమతితో ఏదైనా ఇతర గోదాముల్లో తరలించి పెడితే అది ఎక్కడ ఉంది ఎంత పెండింగ్‌లో ఉంది ప్రస్తుతం మిల్లులో ఎంత నిల్వ ఉంది వంటి వివరాలు ఫిజికల్ వెరిఫికేషన్ యాప్‌లో అద్దంలా తేటతెల్లంగా ఏగోప్యత లేకుండా అందిస్తోంది. క్షేత్రస్థాయి అధికారి మిల్లు వద్దకు వెళ్లినప్పుడు యాప్‌లోని వివరాలను అక్కడ ఉన్న నిల్వలను సరిపోల్చుకొని తేడాలు కనిపిస్తే వాటిని యాప్‌లోనే నమోదు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ఈ యాప్‌ను అధికంగా అధికారులు ఉపయోగిస్తే తెలంగాణ వ్యాప్తంగా సిఎంఆర్ సరఫరా, మిల్లుల్లో మిగిలి ఉన్న ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు వంటి అంశాలపై వాస్తవ పరిస్థితి మూల్యాంకనం చేయడానికి వీలవుతోంది.

ధాన్యం పక్కదారిపట్టించి సిఎంఆర్ సరఫరాలో ఆలస్యం చేస్తున్న మిల్లులపై డేగకన్ను వేయడానికి అధికారులకు అవకాశం చిక్కుతోంది. క్షేత్రస్థాయి అధికారులు మిల్లరుతో చేతులు కలిపినా రాష్ట్రస్థాయి అధికారులకు వెంటనే తెలిసిపోయే అవకాశం ఉంటుంది. తనిఖీల సందర్భంగా క్షేత్ర స్థాయిలో అధికారులు నమోదు చేసిన వివరాలను జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పరిశీలించే అవకాశం ఉంటుంది. భౌతికంగా చూసిన స్టాక్, యాప్‌లో నమో దైన వివరాల మధ్య తేడా ఉంటే ఆ విషయం డిజిటల్ రికార్డులో స్పష్టంగా కనిపించనుంది. మిల్లింగ్ పురోగతి, పెండింగ్ స్టాక్, ప్రభు త్వానికి అందాల్సిన బియ్యం, సరఫరా గడువు వంటి వివరాలను రాష్ట్రంలోని పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు.

## ధాన్యం నిల్వలు.. సిఎంఆర్ బియ్యం సరఫరాపై పర్యవేక్షణ

# ఆసియా క్రీడలను వీక్షించేందుకు జపాన్‌కు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం బుధవారం బయలుదేరి వెళ్లింది. మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ ఎండీ సోనీ బాలాదేవి. ఆరు రోజుల పాటు జపాన్‌లో ప్రతినిధి బృందం పర్యటించనుంది. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ, ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ తదితర అంశాలపై బృందం అధ్యయనం చేయనుంది. తెలంగాణలో క్రీడా రంగ అభివృద్ధికి, రాష్ట్ర క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించేందుకు ఈ పర్యటన దోహదపడనుంది.

# నెల రోజుల్లో పరిష్కరించకపోతే సెక్రటేరియట్ ముందు ధర్నా

## ఆదివాసుల సమస్యలపై గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు వినతి

## బిజెఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలని లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బిజెఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ ఆదివాసులతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మావల మండలం, బట్టిసవర్గాం గ్రామంలోని సర్వే నం. 72లో ఉన్న కొమురం భీం కాలనీలో సుమారు 500 ఆదివాసీ కుటుంబాలు దాదాపు 30 సంవత్సరాలుగా నివసిస్తున్నా, వారికి ఇళ్ల పట్టాలు/గుర్తింపు పొందిన ఇంటి స్థల హక్కులు లేవని గవర్నర్ దృష్టికి తీసుకుని వచ్చారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యుత్, సురక్షిత తాగునీరు వంటి కనీస సౌకర్యాలు పొందడంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో కలిసి సమావేశంలో కూర్చుని ఆదివాసుల సమస్యలను వివరంగా వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గవర్నర్ హామీ ఇచ్చారు.

అనంతరం కార్యక్రమంలో ఆదివాసీ కుటుంబాలు వారి సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి గవర్నర్‌ని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసుల సమస్యలను ఇప్పటికే అసెంబ్లీలో ఎన్నో సార్లు ప్రస్తావించాచానని, అయినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నెల రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే, అక్కడ నివసిస్తున్న 2 వేల కుటుంబాలతో కలిసి సెక్రటేరియట్ ముందు నిరసన ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిబుధవారం సీఎం రేవంత్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమను అభ్యర్థులుగా ప్రకటించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. వారిద్దరికి సీఎం అభినందనలు తెలపడంతోపాటు ఓటర్ల నమోదు, ప్రచారంపై పలు సూచనలు ఇచ్చారు. అభ్యర్థులతోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఈ భేటీలో ఉన్నారు. అంతకు ముందు ఉదయం పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌ను నివాసంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.



# అక్టోబరులో మళ్లీ రెండు గరుడ సేవలు

## 16న బ్రహ్మోత్సవానికి.. 26న పౌర్ణమి సేవ

**తిరుమల, సెప్టెంబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు అక్టోబర్‌నెలలో మళ్ళీ రెండుసార్లు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి గరుడవాహన సేవ వీక్షించే భాగ్యం కలగనుంది. ఆగస్టు, సెప్టెంబర్‌నెలల్లో గరుడపంచమిరోజు, పౌర్ణమిరోజు ,సాలకట్ల బ్రహ్మోత్సవాన, పౌర్ణమివేళ రెండుసార్లు గరుడవాహనంపై మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చిన విషయం విదితమే. ఇప్పుడు అక్టోబర్‌నెలలోకూడా తిరుమలలో మలయప్పస్వామి గరుడవాహనంపై రెండుసార్లు అభయమివ్వనున్నారు. అక్టోబర్ 16న శుక్రవారం రాత్రి నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ, తిరిగి 26వతేదీ సోమవారం పౌర్ణమిఘడియల్లో గరుడవాహనం ఊరేగింపు జరగనుంది. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహన సేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు.

# శిక్షణతోనే సమర్థ పోలీస్ నాయకత్వం

## ప్రొబేషనరీ డిఎస్పీలకు డిజిపి సి.వి.ఆనంద్ దిశానిర్దేశం

## 112 మంది ప్రొబేషనరీ డిఎస్పీలతో గంటన్నరపాటు ముఖాముఖి

## 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విజేతలకు పతకాలు అందజేత

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వి. ఆనంద్ అన్నారు. సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ బుధవారం ముఖాముఖి నిర్వహించారు. సుమారు గంటన్నరపాటు సాగిన ఈ కార్యక్రమంలో పోలీస్ నాయకత్వం, బాధ్యతలు, నైతికత, ప్రజలతో వ్యవహరించే తీరు తదితర అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వం రాదని, నాయకుడికి ప్రత్యేకమైన లక్షణాలు అవసరమని డీజీపీ పేర్కొన్నారు. ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, విలువలు-నైతికత, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన కమ్యూనికేషన్, కష్టపడి పనిచేసే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతతో పాటు వినయం ముఖ్యమైన నాయకత్వ లక్షణాలని వివరించారు.

ముఖ్యంగా నైతిక విలువలపై యువ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో చేసే చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో వారి ప్రతిష్ఠపై ప్రభావం చూపుతాయని చెప్పారు. పోలీస్ సర్వీసులో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్ ఉండే నేపథ్యంలో తమ ప్రతిష్ఠను కాపాడుకోవడం ప్రతి అధికారికి అత్యంత కీలకమని అన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై ప్రొబేషనర్లు అవగాహన పెంచుకోవాలని డీజీపీ సూచించారు. ప్రజలతో వ్యవహరించడం, నేరాల దర్యాప్తు, చట్టాల అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడం వంటి అంశాల్లో సమగ్ర నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు.

చట్టాలపై పరిజ్ఞానం మాత్రమే మంచి పోలీస్ అధికారిగా తీర్చిదిద్దదని, నాయకత్వం, మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థమైన కమ్యూనికేషన్ కూడా అవసరమని పేర్కొన్నారు. 'ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ అంతిమ లక్ష్యం' అని డీజీపీ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ డీఎస్పీల ప్రొఫెషనల్ కోర్సులో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సుమారు 10 నెలలపాటు జరిగే కోర్సులో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ లా, క్రిమినాలజీతో పాటు నేర దర్యాప్తు, మోడల్ పోలీసింగ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ పోలీస్ అధికారులు, వివిధ రంగాల నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులపై ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-సీలో విజేతలకు డీజీపీ పతకాలు, బహుమతులు అందజేశారు.

సెప్టెంబరు 28న ప్రారంభ మైన మూడు రోజుల పోటీలు బుధవారం ముగిశాయి.

బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని డీజీపీ అన్నారు. ప్రతి పోలీస్ అధికారి రోజుకు కనీసం గంటపాటు క్రీడలు లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. పోలీస్ క్రీడలను గతంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించేవారని, ప్రస్తుతం క్లస్టర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎక్కువ మంది పోలీస్ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు.

క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, వారికి మరింత పోటీ అనుభవం కల్పించడం ద్వారా ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. పోలీస్ శాఖలో క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ (పిఎల్) గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, ఇతర సీనియర్ అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

## ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు

## వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించాలని

## ఇరుదేశాల నేతలు నిర్ణయం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతిక రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని సమీ క్షి ంచారు. భారత్-అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ప్రపంచ శాంతి, భద్రతను పెంపొందించే ప్రయత్నా లతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలు అభిప్రా యాలను పంచుకు న్నారు. "అధ్యక్షుడు ట్రంప్ తో ఫలవంతమైన సంభాషణ జరిపాను. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలు, ఇతర రంగాలలో మన ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించాము. మన సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహిత సంబంధాలను కొనసాగించాలని అంగీకరించాము" అని ఫోన్ కాల్ తర్వాత ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "ప్రపంచ శాంతి, భద్రతను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నా మ్ము" అని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) ప్రకారం ఇవే అంశాలను ప్రస్తావిస్తూ ప్రకటన విడుదల చేసింది.

# 2న మద్యం, మాంసం దుకాణాలు బంద్

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు త2న మద్యం, మాంసం దుకాణాలను బంద్ చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని మాంసం విక్రయశాలలను, మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.


తెలంగాణ ప్రభుత్వం

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్

ప్రధాన వైద్యాధికారి కార్యాలయము, ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల వరంగల్

జిల్లా కలెక్టర్ వరంగల్ వారి ఆదేశానుసారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ప్రధాన వైద్యాధికారి గారి కార్యాలయము, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వరంగల్ నందు ఇన్‌పేషంట్ రోగులు మరియు వైద్యాధికారులు జి.ఓ.నెం. 325 మరియు జి.ఓ.నెం. 34 ప్రకారము ఆహారము సరఫరా చేయుటకు (02) సంవత్సరాల కాలపరిమితికి టెండర్లు కోరడమైనది.

| సంఖ్య | ఆసుపత్రి పేరు | పడకలు |
|---|---|---|
| 1 | ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల వరంగల్ | 58 |

పై విషయమై టెండర్స్ వేయదలచిన అభ్యర్థులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్, ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల వరంగల్ నందు రూ.3,000/- డి.డి. Superintendent Govt Ayurvedic Teaching Hospital Warangal పేరున చెల్లించి, టెండర్ షెడ్యూల్ 03.10.2026 ఉదయం 10.30 నుండి 12.10.2026 సాయంత్రం 5.00 గంటలలోపు టెండర్ ఫారాలు పొందగలరు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు సమర్పించుటకు ఆఖరు తేది: 13.10.2026 సాయంత్రం 4.00 గంటల వరకు. పై టెండర్ రద్దు చేయుటకు/వాయిదా వేయుటకు కమిటీకి సర్వాధికారాలు కలవు.

సం/-. అడిషనల్ కలెక్టర్ మరియు చైర్మన్ డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ, ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల, వరంగల్.

సం/-. సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల, వరంగల్

DIPR.NO.10807-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 29.09.2026


# హరీశ్‌రావును కలిసిన నటుడు ప్రియదర్శి

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** మాజీ మంత్రి, బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావును ఆయన నివాసంలో బుధవారం నటుడు ప్రియదర్శి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘ది ప్యారడైజ్ సినిమాతో పాటు అందులో తాను పోషించిన శంకరన్న పాత్ర గురించి ప్రియదర్శి ఆయనతో చర్చించారు. అలాగే తన సినీ ప్రయాణం, ప్రస్తుతం చేస్తున్న సినిమాలు, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి కూడా హరీశ్ రావుతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.

ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగే పోరాటాలు ఒక సమాజానికి ఎలా స్ఫూర్తిగా నిలుస్తాయో తెలంగాణ ఉద్యమం ద్వారా చూశామని హరీశ్ రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక జాతి గుర్తింపు కోసం సాగిన పోరాటాన్ని ‘ది ప్యారడైజ్ సినిమాలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావవంతంగా చూపించారని ఆయన అన్నారు.

తెలంగాణ సినిమా, సంస్కృతిని మరింత విస్తృతంగా ప్రేక్షకులకు చేరువ చేసేలా భవిష్యత్‌లో ప్రియదర్శి మరిన్ని మంచి ప్రాజెక్టులు చేయాలని హరీశ్ రావు కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావుకు ప్రియదర్శి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి మెగావాట్లు రాజస్థాన్‌కు ఎందుకు?

## సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:** సింగరేణి (జైపూర్) కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సొంత రాష్ట్రంలో రైతులు కరెంటు లేక ఇబ్బందులు పడుతుంటే ఇతర రాష్ట్రాలకు కరెంటును ఎలా ధారాదత్తం చేస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదు. మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేయడం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటి? బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది.. కానీ మంచిర్యాల్ జైపూర్ (సింగరేణి)లో తయారయ్యే 800 మెగావాట్ల కరెంటు మాత్రం రాజస్థాన్‌కా? తల్లికి అన్నం పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిచ్చినట్టు.. సొంత రాష్ట్రంలో కరెంటు ఇవ్వలేక రాజస్థాన్‌కు విద్యుత్‌ను కట్టబెడుతున్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణి నుంచి దాదాపు రూ.22 వేల కోట్ల పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలి? అని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం. విద్యుత్ కోతలతో పవర్ హాలిడేలు ప్రకటిస్తూ.. మీ పాలనా వైఫల్యాన్ని ఎల్‌నినో మీదకు నెట్టి తప్పించుకుంటారా? అని ప్రశ్నించారు. యాదాద్రి ప్లాంటుకు జీ10, జీ11 గ్రేడ్ బొగ్గు వాడాలి.. కానీ నాసిరకం జీ13, జీ14 బొగ్గు వాడి బాయిలర్లు దెబ్బతినేలా చేస్తున్నారని ఆరోపించారు. రాజస్థాన్‌తో చేసుకున్న జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి, ఆ విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు అదనంగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల యూనిట్ విద్యుత్‌ను రాజస్థాన్‌కు కేటాయించేందుకు గతంలో ఒప్పందం కుదిరిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన విద్యుత్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని, దీనిప్రకారం కొత్త యూనిట్ నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ రాజస్థాన్‌కు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి, అందులో సింగ రేణికి 22 శాతం వాటా ఇస్తామన్న ప్రతిపాదనకు బదులుగా తెలంగాణలో ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను అక్కడికి పంపడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోనే విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నప్పుడు ఇలాంటి నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు.


బంగారం వేలం నోటీసు

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");

రిజిస్టర్డ్ ఆఫీస్: 4వ అంతస్తు, బజాజ్ ఫిన్‌సర్వ్ హౌస్,

పుణె-అహ్మద్‌నగర్ రోడ్‌కు సమీపంలో, విమాన్ నగర్, పుణె - 411014

BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలుకు పలుమార్పు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు). 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్దం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏదైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(11-11-26): **అచ్చంపేట్ - లింగాల ఎక్స్ రోడ్**; PJH2SGL41907762. **ఆదిలాబాద్ - ద్వారకా నగర్**; PEK4SGL91258748, 92141207, 92125054, 92089333, 92625754, 96455051, 96767012, 96734770, 97029851, 97238915, 97654325. **ఆర్మూర్ - అంబేద్కర్ చౌరస్తా**; PB56SGL91128260. **బాన్సువాడ - బస్ స్టాండ్**; PCV9SGL91810501, 93851332, 93989159, 94336954, 95589384, 44155779, 96289557, 45388973. **భద్రాచలం - ఆర్టీసీ స్టాండ్**; PEK5SGL91402870, 91842796, 92654880, 92692412, 93418896, [illegible]

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# గేమింగ్, యానిమేషన్ రంగాలకు అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు: సిఎస్ సంజయ్‌జాజు

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరాన్ని గేమింగ్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్ రంగాలకు జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి సహా పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, కామిక్ తదితర క్రియేటివ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ప్రపంచ ప్రసిద్ధ సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించి, తమ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

'కథలు - ఆటలు - కలలు" అనేథీమ్‌తో యువతను ఆకర్షించేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఇందులో భాగంగా కామిక్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ బిజినెస్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలాగే కామిక్ కాన్, డ్రీమ్‌హాక్, ఇండియా గేమ్ ఉత్సవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బి2బి ఎక్స్‌పో, ఇన్నోవేషన్ జోన్, యానిమేషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లోని సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, పెట్టుబడి మరియు వ్యాపార అవకాశాలను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే



బుధవారం సచివాలయంలో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించిన సిఎస్ సంజయ్‌జాజు

సుమారు 50 పెద్ద, 150 వరకు మధ్యతరహా యానిమేషన్, గేమింగ్ సంస్థలు ఉన్నాయని సీఎస్ తెలిపారు. మరిన్ని అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించడంతో పాటు, ఈ అభివృద్ధి చెందుతున్న రంగాల్లో రాష్ట్ర యువతకు విస్తృత అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమాలు, ఎక్స్‌పోలు, స్టాళ్లను నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యా ర్థులు ప్రత్యక్షంగా సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్ తెలిపారు. సుమారు 70 కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు దాదాపు 50 వేల మంది సందర్శకులు ఈ కార్యక్రమాలను సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. యువతలో సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ క్రియేటివ్ మరియు ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు.

## సామాజిక బహిష్కరణల నుండి మమ్మల్ని రక్షించండి ప్రభుత్వానికి తాళ్లరాంపూర్ గౌడకులస్తుల విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్మెంట్ కమిటీల అరాచకాలను అరికట్టాలని, సామాజిక భహిష్కరణనుండి 40 కుటుంభాలను రక్షించాలని భహిష్కృత గౌడ కుటుంభాల సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. సాంకేత పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో తమను గత నెల రోజులుగా సామాజిక బహిష్కరణకు గురిచేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వీడీసీ సభ్యుల పై చట్టపరంగా చర్యలు తీసుకుని కనీస మావన హక్కులు, రాజ్యాంగ విలువలు రక్షించాల్సిన భాద్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈమేరకు బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన సుమారు 40 కల్లుగీత కార్మికుల కుటుంబాలు మీడియా సమావేశం నిర్వహించారు. తాళ్ల రాంపూర్ గ్రామంలో గ్రామ పెద్దలుగా చెలామని అవుతున్న వీడీసీ సభ్యులు 30 గీతకార్మిక కుటుంభాలను మరో 10 దళిత గీతాకార్మిక కుటుంభాలను ఏకపక్షంగా భహిష్కరించి నిత్యం ఇబ్బందుల పాలు చేయడమే కాకుండా గ్రామంలో ఎటువంటి సహాయం అందకుండా నిబంధనలు విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గ్రామస్తులు ఎవరైన సహాయం చేస్తే రూ30 వేల జరిమానా విధించి కనీస మానవ హక్కులు కాలరాస్తు రాక్షసానందం పొందుతున్నారని గీత కార్మిక వృత్తి తమ కులవృత్తి అయినప్పటికీ తమను కుల వృత్తికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విశయమై రాష్ట్ర డీజీపీ సీవీ. ఆనంద్‌కు ఫిర్యాదు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తమ సమస్యను పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈసమావేశంలో బాదితులు శ్రీనివాస్ గౌడ్, జనార్ధన్ గౌడ్, నారా గౌడ్, గంగాధర్, దేవదాస్, సత్యనారాయణ గౌడ్, న్యాయవాది పొన్నం దేవరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎండి జితేష్ పాటిల్, డైరెక్టర్ చక్రపాణి తదితరులు

## ఎల్టీ, హెచ్‌టీ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్‌లైన్ చార్జీలు

### - వినియోగదారులకు ముందుగానే ఖర్చుపై స్పష్టత - పరిశ్రమలకు వేగవంతమైన విద్యుత్ కనెక్షన్లు - టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేశ్ వి పాటిల్

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్(టీజీ ఈఆర్సీ) ఇటీవల జారీ చేసిన నూతన నిబంధనల ప్రకారం ఎల్‌టీ, హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్ లైన్ చార్జీల విధానం ద్వారా పారదర్శకత, సరళత, వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ పాటిల్ తెలిపారు. ఎఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎల్‌టీ, హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్ లైన్ ఛార్జీల విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విధానం ద్వారా వినియోగదారులకు ముందుగానే ఖర్చుపై స్పష్టత, పరిశ్రమలకు వేగవంతమైన విద్యుత్ కనెక్షన్లు అందుతాయని స్పష్టంచేశారు. గతంలో హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో సర్వీస్ ఎక్కడి నుంచి ఇవ్వాలి? ఎంత దూరం నుంచి లైన్ తీసుకురావాలి? ట్రాన్స్‌ఫార్మర్ సామర్థం ఎంత ఉండాలి? వంటి అంశాల ఆధారంగా అంచనా వ్యయాలు మారుతూ ఉండేవని కొత్త విధానంలో లోడ్ ఆధారంగా ముందుగానే నిర్ణయించిన స్థిర చార్జీలు ఉండటంతో వినియోగదారులకు ఖర్చుపై స్పష్టత లభిస్తుందని చెప్పారు. వినియోగదారులకు ముందుగానే ఖర్చుపై స్పష్టత కల్పించడం, కేసు వారీ అంచనాల వల్ల ఏర్పడే అనిశ్చితిని తొలగించడం, దరఖాస్తుల పరిశీలన, సేవల మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం వంటి అనేక ప్రయోజనాలను ఈ విధానం అందిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓవర్‌హెడ్(ఓహెచ్), అండర్‌గ్రౌండ్(యూజీ) నెట్‌వర్క్‌లకు వేర్వేరు ప్రమాణిత రేట్లు నిర్ణయించడం ద్వారా వ్యవస్థ మరింత పారదర్శకంగా మారిందన్నారు. గతంలో అంచనా వ్యయాల్లో 30 నుంచి 40 శాతం వరకు వ్యత్యాసం వచ్చే అవకాశం ఉండేదని, ఇప్పుడు అలాంటి అనిశ్చితికి పూర్తిగా తెరపడుతుందని పేర్కొన్నారు. 11 కేవీ హెచ్‌టీ కనెక్షన్లకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయించిన యూనిఫాం సర్వీస్ లైన్ చార్జీ ప్రతి కేవీఏకు రూ.4,078 గా విధించినట్లు తెలిపారు. ఈ చార్జీకి అదనంగా అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, ఖర్చులు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈ యూనిఫాం సర్వీస్ లైన్ చార్జీల విధానం ప్రస్తుతం ఉన్న 11 కేవీ విద్యుదీకరించిన నెట్‌వర్క్‌లోని కామన్ ఫీడర్ ద్వారా సరఫరా పొందే, విద్యుదీకరించిన నెట్‌వర్క్ నుంచి 1 కిలోమీటర్ మార్గ పొడవు లోపల ఉన్న అర్హత కలిగిన హెచ్‌టీ కనెక్షన్లకు మాత్రమే వర్తిస్తుందని జితేశ్ పాటిల్ వెల్లడించారు. అలాగే కిలోమీటర్‌కు మించి లైన్ పొడిగింపు అవసరమయ్యే హెచ్‌టీ కనెక్షన్లకు యూనిఫాం సర్వీస్ లైన్ చార్జీలు వర్తించవని స్పష్టంచేశారు. అటువంటి సందర్భాల్లో ప్రస్తుత అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ విధానంలో సర్వీస్ లైన్ అంచనాలు రూపొందించి కనెక్షన్లు మంజూరు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ప్రతి సంవత్సరం సగటున 6 నుంచి 7 శాతం మేర పెరుగుతోందని, రాబోయే వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని తెలిపారు. హైదరాబాద్ నగర విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత విశ్వసనీయంగా, సురక్షి తంగా తీర్చిదిద్దేందుకు అండర్‌గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టును పారదర్శక టెండర్ విధానంలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్పీడీసీఎల్ చరిత్రలోనే విద్యుత్ గరిష్ఠ డిమాండ్ తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీ ఎస్పీడీసీఎల్) పరిధిలో బుధవారం సాయంత్రం 4:16 గంటలకు 12,299 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదై సంస్థ చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మొత్తం విద్యుత్ డిమాండ్ 19,400 మెగావాట్లు నమోదు కాగా, అందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 12,299 మెగావాట్లు, టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 6,736 మెగావాట్లు గరిష్ట డిమాండ్ నమోదైనట్లు వెల్లడించారు. ఈ రికార్డు స్థాయి డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ విద్యుత్ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించినట్లు సీఎండీ తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ చక్రపాణి పాల్గొన్నారు.

## 7న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవం

### - వైస్ ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి




సమావేశంలో మాట్లాడుతున్న వి.సి ఘంటా చక్రపాణి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవం అక్టోబర్ 7న ఉదయం 10:30 జూబ్లీ హిల్స్‌లోని యూనివర్సిటీ ప్రాగణం భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో జరగనుందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. ఈమేరకు బుధవారం టూరిజం ప్లాజాలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వెల్లడించారు. ఈస్నాతకోత్సవానికి తెలంగాణ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ఎం.ఫిల్, పీహెచ్.డీ పట్టాలు, యుజి/పిజి డిగ్రీలు, బంగారు పతకాలు మరియు బుక్ ప్రైజ్‌లను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే న్యాక్ మాజీ డైరెక్టర్, డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రముఖ చిత్ర నిర్మాత, రచయిత, నటులు బి. నరసింగరావుకి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ స్నాతకోత్సవంలో మొత్తం 36,145 మంది విద్యార్థులకు డిగ్రీ/పీజీ/డిప్లొమా/సర్టిఫికెట్లు కోర్సుల్లో పట్టాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.24.5 కోట్ల కొకైన్ స్వాధీనం

**శంషాబాద్ సెప్టెంబరు30,ప్రభాతవార్త :** శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ భారీగా కొకైన్‌ను స్వాధీనం చేసుకుంది. దోహా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ భారతీయ ప్రయాణికుడిని అనుమానంతో తనిఖీ చేయగా, అతడి క్యాబిన్ బ్యాగేజీలోని ఏడు లింద్ట్ లిండోర్ చాక్లెట్ ట్యూబ్‌లలో కొకైన్ దాచినట్లు గుర్తించారు. చాక్లెట్ ట్యూబ్‌లు అసాధారణంగా బరువుగా ఉండటంతో వాటిని తెరిచి పరిశీలించగా చాక్లెట్ల మధ్య 207 లేత పసుపు రంగు క్యాప్సూల్స్ బయటపడ్డాయి. వాటిలోని తెల్లటి పొడిని నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా కొకైన్‌గా నిర్ధారణ అయింది. మొత్తం 4.9 కిలోల కొకైన్ స్వాధీనం చేసుకోగా, అంతర్జాతీయ అక్రమ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.24.5 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. నిందితుడిని ఎన్‌డీపీఎస్ చట్టం1985 కింద అరెస్టు చేసి, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు.




స్వాధీనం చేసుకున్న కొకైన్

## ఐసిఎఆర్-నార్మ్‌లో ఘనంగా రాజభాషా పక్షోత్సవం



విజేతలకు సరిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

**అత్తాపూర్ సెప్టెంబరు 30,ప్రభాతవార్త :** ఐసిఏఆర్-జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమీ (నార్మ్)లో సెప్టెంబర్ 14 నుంచి 28 వరకు నిర్వహించిన హిందీ రాజభాషా పక్షోత్సవాలు ఉత్సాహభరితంగా ముగిశాయి. ఈ సందర్భంగా పరిపాలన, ఆర్థిక, సాంకేతిక విభాగాల అధికారులు, ఉద్యోగులతో పాటు మేనేజ్‌మెంట్ విద్యార్థులు, శాస్త్రవేత్తలకు పలు పోటీలు నిర్వహించారు. లేఖా రచన, వ్యాసరచన, గానం, అంత్యాక్షరి, వాదవివాదం తదితర పోటీలు నిర్వహించగా, శాస్త్రవేత్తలకు హిందీలో శాస్త్రీయ సారాంశ రచన, ప్రదర్శన పోటీ ప్రత్యేకంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి మోలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం హిందీ సలహాదారు ప్రొ. ఋషభ్‌దేవ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై బహుభాషా సమాజంలో రాజభాష ప్రాధాన్యతను వివరించారు. ఈపాలన, కృత్రిమ మేధస్సు, జ్ఞాన ఆర్థిక వ్యవస్థ వంటి ఆధునిక రంగాల్లో హిందీ వినియోగాన్ని పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. అకాడమీ డైరెక్టర్ డా. రామన్ మీనాక్షిసుందరం విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. సరళమైన హిందీతో పాటు వివిధ భారతీయ భాషలను నేర్చుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సంయుక్త డైరెక్టర్ డా. గోపాల్ లాల్ కార్యాలయ ఫైళ్లలో సాధ్యమైనంత వరకు హిందీలో పని చేయాలని సూచించారు. ఇన్‌చార్జి అధికారి (రాజభాషా) డా. సంజీవ్ కుమార్ నివేదిక సమర్పించి కృతజ్ఞతలు తెలిపారు.

## హిందూ సమాజానికి సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### ఉట్నూర్‌లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నాయకులు

**ఉట్నూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** హిందూ దేవుళ్లను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. హిందూ ధర్మం, హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా హిందూ దేవుళ్లను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. శ్రీరాముడు, పరమశివుడిని పేదలు, ధనికులుగా విభజిస్తూ మాట్లాడటం హిందువుల మనోభావాలను గాయపరచడమేనని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను లాగడం తగదని, సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ హిందూ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కూడా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు.

## రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### అధికారులకు అదనపు కలెక్టర్ రమేష్ రాథోడ్ ఆదేశం

**సారంగాపూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రమేష్ రాథోడ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం సహా ఇతర వివరాలు స్పష్టంగా నమోదు కావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు విట్టల్, తహసీల్దార్ బి. విజయ్ కాంత్ రావు, నాయబ్ తహసీల్దార్ రాంచందర్, సర్వేయర్ యోహాన్, గిర్దావర్ వెంకట్ నర్సయ్య, జీపీఓ ప్రవళిక, గ్రామ సర్పంచ్ అజయ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అసమర్ధ పాలన : ఆర్.కృష్ణయ్య

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలే కోటలు దాటుతున్నాయి.. ఫీజు బకాయిలు మాత్రం విడుదల కావడం లేదు - పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల 500 కోట్ల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్. - వేలాదిమంది విద్యార్థులతో ఉన్నత విద్యా మండలి ముట్టడి

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలే కోటలు దాటుతున్నాయి తప్ప పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు మాత్రం విడుదల కావడం లేదని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు..నిధులు..నియామకాల పేరుతో జరిగిన తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ఎనలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల 500 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సతీష్ ఆధ్వర్యంలో బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలిని ముట్టడించారు. కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మాసబ్ ట్యాంక్ పరిసరాలన్నీ విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు...రాష్ట్రంలో విద్యార్థులు చదువుకోవడానికి ఫీజులు చెల్లించలేని ప్రభుత్వం ఉన్నా ఒకటే..లేకున్నా ఒకటే అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఫీజు బకాయలను వెంటనే చెల్లిస్తామని ప్రకటించినా అవి నేటికీ విడుదల కాకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి బడ్జెటు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. కాని ఇంత వరకు విడుదల చేయలేదు. బడ్జెటు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభావిస్తున్నరన్నారు. రాష్ట్రంలోని కొన్ని కాలేజీలు అవకతవకలకు పాల్పడితే వాటిపై విజిలెన్స్ విచారణ చేపట్టి చర్యలు తీసుకో వాల న్నారు. విచారణ కాల యాపన జరుగు తుండ డంతో నిజమైన విద్యా ర్థులకు అన్యాయం జరు గు తుందన్నారు. ఉస్మా నియా యూని వర్సిటీ, మహిళ యూని వర్సి టీలు కూడా విద్యా ర్థుల వద్ద ఫీజులు కట్టేవరకు అడ్మిషన్లు ఇవ్వడం లేదని, కోర్సు పూర్తి చేసిన 6 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలో మగ్గుతున్నాయని, ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్న కళాశాలల యాజ మాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ కాలేజీలు, ప్రభుత్వ కాలేజిలు కూడా ఫీజులు వసూలు చేయడం ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించడమే అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించినా... ఫీజుల కోసం సర్టిఫికెట్లు ఆపవద్దని హైకోర్టు తీర్పు వెల్లడించిన కళాశాలల యాజమాన్యాలు మాత్రం అవి ఏవి తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయన్నారు.



మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యా మండలం ముందు ధర్నా చేస్తున్న ఆర్ కృష్ణయ్య, విద్యార్థి సంఘం నేతలు

## శంషాబాద్‌లో విమానం అత్యవసర ల్యాండింగ్

### సాంకేతిక లోపమే కారణం

**శంషాబాద్ సెప్టెంబరు30,ప్రభాతవార్త :** శంషాబాద్ విమానాశ్రయంలో సాంకేతిక లోపం కారణంగా ఓ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరిన 591 ఎయిర్‌లైన్స్ విమానంలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్యను పైలట్ గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కి సమాచారం అందించి విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. విమానంలో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం సురక్షి తంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడకు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

## ఏసిబి వలలో మున్సిపల్ ఉద్యోగి

**మొయినాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా రూ.75 వేల నగదు తీసుకుంటున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎల్లమోని సుదర్శన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణిపైనా చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## 40 వేల ఓటర్ల నమోదు లక్ష్యంగా పనిచేయాలి

### రేవంత్ ప్రభుత్వానికి నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లు ఓటు వేయరు: హరీష్‌రావు

**బేగంపేట సెప్టెంబరు 30,ప్రభాతవార్త :** ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, 40 వేల ఓటర్ల నమోదు లక్ష్యంగా పని చేయాలని, రేవంత్ ప్రభుత్వానికి నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లు, ఎవరూ ఓటు వేయరు అని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని జోరాస్టియన్ క్లబ్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఒక్క గ్రాడ్యుయేట్ కూడా మిస్ కాకుండా ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని అన్నారు. ప్రతి 50 ఇండ్లకు ఒక కమిటీ చొప్పున ఏర్పడి ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం గా చేపట్టాలని పిలుపునిచ్చారు. కాలనీలు, బస్తీలలో, అపార్ట్‌మెంట్ ల వద్ద పార్టీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్‌లను ఓటర్లుగా నమోదు చేసి కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. 2021 లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికలలో 10 వేల మందిని ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందని, ఇప్పుడు 40 వేల ఓటర్ల నమోదు లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలకు నోచుకోకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని వివరించారు.

హామీల అమలుపై ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే నోటికి వచ్చినట్లు అడ్డు అదుపు లేకుండా మాట్లాడుతూ ఎదురుదాడికి దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



జొరాస్టియన్ క్లబ్‌లో జరిగిన నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న హరీష్ రావు

## రబీ పంటల ఎంఎస్‌పి పెంపు రైతులకు మరింత భరోసా

### ఎపి మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 30,ప్రభాత వార్తప్రతినిధి:** 202728 మార్కెటింగ్ సీజన్‌కు రబీ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో అన్ని నిర్దేశిత రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు ఆమోదం తెలపడం రైతులకు మరింత ధర భరోసా కల్పించే నిర్ణయమని పేర్కొన్నారు. గోధుమకు క్వింటాల్‌కు రూ.2,610, బార్లీకి రూ.2,286, శనగకు రూ.5,958, మసూర్ పప్పుకు రూ.7,390, రేప్‌సీడ్ మస్టర్డ్/ఆవాలకు రూ.6,613, కుసుమకు రూ.7,215 కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే కుసుమకు క్వింటాల్‌కు రూ.675, రేప్‌సీడ్ మస్టర్డ్‌కు రూ.413, మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పీ పెంచినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలకు అధిక మద్దతు ధర కల్పించడం ద్వారా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంటకు పెట్టుబడికి తగిన ప్రతిఫలం, గిట్టుబాటు ధర అందాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, మార్కెట్లో ధరల ఒడిదుడుకుల నుంచి రైతులను రక్షించడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం అవసరమన్నారు. రాష్ట్రంలోనూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మార్కెట్ జోక్యం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## నైనీలో సమృద్ధిగా బొగ్గునిల్వలు

### - అయినా రాష్ట్ర థర్మల్ కేంద్రాలకు కొరత - 10 శాతం కూడా సరఫరా చేయలేని సింగరేణి - బొగ్గు లేక తెలంగాణ విద్యుత్ యూనిట్ల మూత

**హైదరాబాద్, సెప్టెంబరు 30, ప్రభాతవార్త** అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోటోన శని అన్న చందంగా రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల పరిస్థితి తయారయింది. సింగరేణి వద్ద బొగ్గు నిల్వలు ఉన్నా వాటిని థర్మల్ కేంద్రాలకు త్వరితగతిన సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతుండగా, మరోపక్క థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరతతో విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడి దశల వారీగా యూనిట్లు మూతపడుతున్నాయి. సమస్య తీవ్రమవుతున్న నేపథ్యంలో థర్మల్ కేంద్రాలు ప్రత్యామ్నాయం కోసం వెదుకులాటలో పడ్డాయి. నైనీ గనిలో 2025 ఏప్రిల్ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాగా, గత 16 నెలల కాలంలో రవాణా కంటే ఉత్పత్తి వేగంగా జరగడం వల్ల మైనింగ్ ప్రాంతంలో దాదాపు 20 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు రవాణాకు సిద్ధంగా ఉన్నప్పటికీ, సింగరేణి అందుబాటులో ఉన్న నిల్వలో కొంత భాగాన్ని మాత్రమే రవాణా చేయగలుగుతోంది. ప్రధానంగా నైని బొగ్గు గనిని నుండి రవాణాలో ఏర్పడిన ప్రతిబంధకం ఒక పెద్ద సమస్యగా తయారయింది. నాణ్యమైన బొగ్గు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రత్యేక రైలు, రోడ్డు అనుసంధానం లేకపోవడం, రవాణా మార్గంలోని గ్రామాల నుండి ఎదురవుతున్న వ్యతిరేకతల కారణంగా సింగరేణి రోజువారీగా నిల్వలో 10 శాతం కూడా రవాణా చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలోని థర్మల్ పవర్ ప్లాంట్‌లకు, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)కు అత్యుత్తమ నాణ్యత గల బొగ్గు నిరంతరాయంగా సరఫరా అవసరం కావడంతో నైనీ నుండి పూర్తి స్థాయిలో సరఫరా కాక కొన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. నైనిలో రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే బొగ్గు రవాణాకు అనుమతి ఉండటంతో పూర్తి స్థాయిలో సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా కోసల గ్రామం గుండా వెళ్ళడానికి అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు మాత్రమే సమయం ఉండటం వల్ల, సింగరేణి ప్రతిరోజూ నైని నుంచి 8 వేల నుంచి 10 వేల టన్నుల బొగ్గును మాత్రమే రవాణా చేయగలుగుతోంది. ఆ గ్రామానికి రాష్ట్ర రహదారి 63ని కలిపే బైపాస్ కూడా లేదు. భారీ ట్రక్కుల రాకపోకల వల్ల కాలుష్యం, ప్రమాదాలు, రోడ్లు దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయని గ్రామస్థులు నిరసనలు తెలపడంతో, ఈ ఏడాది ఆరంభంలో నైని నుంచి బొగ్గు రవాణాను కొంతకాలం పాటు నిలిపివేశారు. ఆ తర్వాత, అంగుల్ జిల్లా యంత్రాంగం రవాణా సమయాలను క్రమబద్ధీకరించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించింది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి, నైనీ నుండి ప్రతిపాదిత 68 కిలోమీటర్ల బొగ్గు కారిడార్ రైల్వే లైన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతిపాదిత రోడ్డు బైపాస్ కోసం భూసేకరణ, పునరుద్ధరణకు కూడా సింగరేణి నిధులను జమ చేసింది. అయితే, ఈ రైల్ కారిడార్ ఒక్కటే కార్యరూపం దాల్చడానికి కనీసం మూడు సంవత్సరాలు పట్టవచ్చని అధికారులు తెలిపారు. ఇది తెలంగాణ థర్మల్ పవర్ ప్లాంట్లకు బొగ్గు రవాణాకు పెద్ద సవాలుగా నిలుస్తోంది.

# పొదుపు మంచిదే!




అను కుంటున్నా కానీ... పొదుపు చేస్తున్నారా అని అడగడం ఆలస్యం... చాలామంది అమ్మాయిల నుంచి ఇలాంటి సమాధానమే వస్తుంది. అవును =మరి... నచ్చినట్టుగా ఖర్చు చేయాలంటే స్వీయ సంపాదనే మార్గమని నమ్ముతున్నారు ఈ తరం అమ్మాయిలు. దీనితో దృష్టంతా నచ్చినవి కొనుక్కోవడం, పర్యటనలు వంటివాటి మీదే! పెళ్లిళ్లల్లో బాధ్యత పడి ఈ స్పృహ ఉండదన్న కారణమూ లేకపోలేదు. దీనితో జీవితాన్ని ఆస్వాదించడం పేరుతో పొదుపుని వాయిదా వేస్తారు. మీరూ అదే కోవకు చెందుతారా? అయితే కొన్ని అలవాట్లు చేసుకోవాల్సిందే! నెలనెలా కొంత పొదుపు చేయాలి. అనుకోక దం వరకూ సరే! కానీ తీద్దాంలే. దాద్దాంలే అని ఆలోచించడంలోనే సమయం మించిపోతుంది. ఖాతా ఖాళీ అవుతుంది. కాబట్టి, రికరింగ్, సిప్, చిట్.. ఇలా ఏదైనా పెట్టుకోండి. ఆటోమేటిక్గా డబ్బులు కట్ అయ్యేలా చూసుకోండి. జీతం పడినరోజే కట్ అయ్యేలా పెట్టుకుంటే మరీ మంచిది.నెలకి ఎంత ఖర్చు పెడుతున్నారు? దేనికి ఎక్కువ మొత్తం వెచ్చిస్తున్నారు? వీటిని గమనించుకోవాలి. అప్పుడే అనవసర ఖర్చు ఎక్కువవుతుందో తెలుస్తుంది. చదవాలి, ఆన్లైన్ వ్యాయామం, గేమ్స్ అంటూ బోలెడు యాప్ డబ్బులు కట్టి, సబ్స్క్రైబ్ చేస్తారు. కానీ, ఉపయోగించ చదం. అలాంటివి రివ్యూ చేసుకోవచ్చు. అనవసరమనిపిస్తే ఆపొచ్చు. అంటే, అవసరమైన వరకే ఉపయోగించే వీలన్నమాట. డిజిటల్ స్టేట్మెంట్స్ వద్యాక బడ్జెట్ వేయడమే మర్చిపోతున్నాం. అవసరమైతే యాప్‌ని, బ్యాంకు ఖాతా తెరిచి చూస్తాం. అలాకాకుండా... స్వయంగా రాయండి. వ్యక్తిగత ఖర్చులు, సేవింగ్స్, ముఖ్యమైనవి విభజించి రాయాలి. దానికి కట్టుబడి ఉండాలి. తెలివిగా ఖర్చుపెట్టడం అలవాటు అవుతుంది. తక్కువలో వ్యాపకాలు పర్యటనలు, ఎంటర్టైన్మెంట్ వగైరాలకి డబ్బు కేటాయించుకోవడమూ తెలుస్తుంది. పెళ్లి, ఆసుపత్రి, బంధువులకు పెట్టుబడులు.. ఇలా అనుకోని ఖర్చులు వాలానే వస్తుంటాయి. వాటికీ సిద్ధంగా ఉండాలి. కాబట్టి, ఎమర్జెన్సీ ఫండ్ని సిద్ధం చేసుకోవాలి. రేపు ఎలాంటి పరిస్థితులైనా, ఎదురవ్వొచ్చు. కాబట్టి, సిద్ధంగా ఉండాల్సిందే. అలాగని సంతోషాలను త్యాగం చేయనక్కర్లేదు. ఆనందాల్నీ, భవిష్యత్తునీ సమన్వయం చేసుకోవాలి. అందుకు ఈ అలవాట్లు సాయపడతాయి. □

# వ్యాయామంతో గుండె పదిలం!



ప్రత్యేకించి మహిళలు గుండె ఆరోగ్యాన్ని కాపాడు కోవా లంటే నెలసరి సమస్యల్ని తగ్గించుకోవడం, పిసిఓఎస్‌ను అదుపు చేసుకోవడంతో పాటు మరికొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలంటున్నారు నిపుణులు. వ్యాయామం ఎలాంటి సమస్యకైనా విరుగుడుగా పనిచేస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తగ్గయి అని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే క్రమం తప్పకుండా వర్కవుట్‌ను రొటీన్‌లోన భాగం చేసుకోవడం మంచిది. రోజూ కనీసం పది వేల అడుగులు వేయడం, మెట్లెక్కడం, భోజనం తర్వాత కాసేపు నడవడం.. ఇలా శరీరానికి కాస్త శ్రమ కలిగించినా చక్కటి ఫలితం ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే బరువును అదుపులో ఉంచుకోవడం కూడా కీలకమే. ఈ క్రమంలో ఎత్తును బట్టి ఎంత బరువు (బిఎఐ) ఉండాలో నిర్ధారించుకోవాలి. మీ బిఎంఐ ఎంతో తెలుసు కొని.. మీరు బరువు పెరగాలా,తగ్గాలా, దానికోసం ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి. ఎలాంటి వ్యాయామాలు చేయాలి? వంటి విషయాలనీనన నిపుణులను అడిగి తెలుసుకుంటే మంచిది. ఇలా బిఎంఐని లఅదుపులో ఉంచుకోవడం వల్ల గుండె సమస్యలు వచ్చే అవకాశం 32 శాతం తగ్గుతుందట. రక్తంలో చక్కెర స్థాయులు బిపి ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం వల్ల ఏమైనా హెచ్చుతగ్గులుంటే డాక్టర్ సలహా మేరకు వాటిని అదుపు చేసుకోవచ్చు. చిరుతిండ్లు నూనె సంబంధిత పదార్థాలంటే ఎవరికైనా ఇష్టమే! కానీ వాటిని అమితంగా తీసుకుంటే మాత్రం బరువు పెరిగిపోయి తద్వారా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఇలాంటి ఆహార పదార్థాలను మితంగా తీసుకోవడం లేదా వీటిని పూర్తిగా పక్కన పెట్టేయడం మంచిదంటున్నారు నిపుణులు. శరీరానికి తగిన పని చెప్పకుండా గంటల తరబడి ఒకేచోట కూర్చుండిపోయే వారిలో గుండె జబ్బులు, మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువని చెబుతున్నాయి అధ్యయనాలు, కాబట్టి శరీరానికి తగినంత వ్యాయామం అందేలా జాగ్రత్తపడాలి. □

# ఎంత డిటర్జెంట్ వాడుతున్నారు? ..

దుస్తులు చేత్తో ఉతుకుతున్నా, వాషింగ్ మెషీన్లో వేస్తున్నా... మోతాదుకు మించి డిటర్జెంట్ వాడొద్దు. అలా చేస్తే డబ్బుతోపాటు వనరుల్నీ వృథా చేస్తున్నట్టే!



బట్టలకు మురికి, చెమట, మరకలు ఎక్కువగా పడితే చేత్తో ఉతికినా, వాషింగ్ మెషీన్లో వేసినా డిటర్జెంట్ కాస్త ఎక్కువ వేయడానికి చూస్తాం. ఈ అదనపు డిటర్జెంట్ వల్ల అదనపు శుభ్రత లభిస్తుందన్న ఆలోచనతో ఇలా చేస్తాం. నిజానికి దీనివల్ల లాభంకంటే నష్టమే ఎక్కువ. ఎక్కువ డిటర్జెంట్ అధికంగా తయారవు తుంది. కానీ దాన్ని పోగొట్టడానికి అవసరమైనట్లు వాషింగ్మెషీన్ ఎక్కువసార్లు తిరగలేదు. మెషీన్ లోపల దుస్తులు ఒకదానికొకటి రుద్దుకోవడంవల్లనే వాటికుండే మురికి పోతుంది. ఎక్కువ డిట ర్జెంట్ ఉండటంవల్ల దుస్తులు అలా రుద్దుకోకుండా జారిపోతాయి. దాంతో అది బట్టలపైనా, వాషింగ్ మెషీన్లోనూ మిగిలి పోతుంది. చేత్తో ఉతికినప్పుడు ఎక్కువ డిటర్జెంట్ ఉంటే ఎక్కువ నీటిని ఉపయోగిం చాల్సి వస్తుంది. దీనివల్ల నీరు, విద్యుత్ వృథాతోపాటు పర్యావరణానికీ నష్టమే. ఎక్కువ డిటర్జెంట్ సరఫరా ఎలా తెలుస్తుం దంటారా? ఉతకడం కాస్తా ఉంటాయి, దుస్తులను పట్టుకుంటే జిడ్డుగా, చేతికి అంటుకుంటు న్నట్లు. బట్టలు రంగులు పోయి త్వరగా వెలిసిపోతాయి. సాధారణంగా ఒక లోడ్ వేసేటప్పుడు టేబుల్ స్పూన్ లిక్విడ్ డిటర్జెంట్ లేదా పావు కప్పు పౌడర్ వేయాలి. జాగ్రత్తగా గమనిస్తే తక్కువలో ఎంత వేయొచ్చో మీకే నిర్ధారణ అవుతుంది. □

# క్యాప్సికం బైట్స్



చిన్న క్యాప్సికం: పావుకిలో
ఆలుగడ్డలు: రెండు
శనగపిండి: రెండు స్పూన్లు
ఉప్పు: తగినంత కారం: స్పూనుధనియాలు జీలకర్ర పొడి: ముప్పావు స్పూనునూనె: రెండు టీస్పూన్లు

తయారీ: ముందుగా క్యాప్సికంను కడిగి సగానికి తరిగి పెట్టుకోవాలి. ఆలుగడ్డలను బాగా ఉడికించి చెక్కు తీసుకోవాలి. వాటిని ఒక గిన్నెలోకి తీసుకొని మెత్తగా మెదిపి అందులో శనగ`పిండి, ఉప్పు, కారం, ధనియాలుజీలకర్ర పొడితో పాటు కొద్దిగా నూనె వేసి మిశ్రమంలా కలుపు కోవాలి. ఆ ముద్దను ఇందాక సగానికి తరిగి పెట్టుకున్న క్యాప్సికం లో కూరాలి. ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టి.. కొద్దిగా నూనె చిలకరించి, క్యాప్సికం ముక్కలకు మళ్లీ నూనె రాసి సన్నటి సెగ మీద రెండు వైపులా బాగా కాల్చుకోవాలి. మధ్యలో కాసేపు మూత పెడితే ముక్కలు బాగా ఉడుకుతాయి. దీన్ని ఎయిర్ ఫ్రైయర్‌లో కూడా ప్రయత్నిం చొచ్చు. సులభంగా వెరైటీగా ఏమన్నా చేసుకోవాలనుకున్నప్పుడు ఈ వంటకం మంచి ఆప్షన్. □

# నేరుగా చెప్పి చూడండి !

ప్రశ్న: మా మారు మద్యానికి బానిసై, తాగినప్పుడు నన్ను హింసిస్తున్నారు. ఆర్థికంగా కూడా చితికి పోయాం. డిగ్రీ చదివిన మా అబ్బాయి గంజాయి వ్యసనానికి గురయ్యాడు. ఇద్దరి పరిస్థితులు చూసి తట్టుకోలేక నాకు బిపి, షుగర్ వచ్చాయి. ఇప్పటికే ఉన్న కొద్దిపాటి పొలం అమ్ముకున్నాం. మా అమ్మగారు ఇచ్చిన నగల్లో సగం కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. నా భర్త ఇలాగే కొనసాగితే మరో రెండు, మూడు సంవత్స రాల్లో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందే మోనని భయంగా ఉంది. మా అబ్బాయి భవిష్యత్తు ఏమవుతుందో అర్థం కావడం లేదు. ఇటీవల వారి ద్దరినీ ఒక పునరావాస కేంద్రంలో 21 రోజులు ఉంచాను. అయినా పెద్దగా మార్పు కనిపించలేదు. ఇప్పుడు మళ్లీ ఎక్కడికీ రామని అంటు న్నారు. వారిద్దరినీ ఎలా బాగుచేయాలి? పూర్తిగా వ్యసనం మానేయ డానికి ఎంతకాలం పడుతుంది? ఎంత ఖర్చవుతుంది?- లక్ష్మీ ృదేవి (పేరు మార్చాను), కాకినాడ

వ్యథ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

జవాబు: అమ్మా, మీరు ఎదుర్కొం టున్న పరిస్థితి చాలా బాధాకర మైనది. మీ భర్త, కొడుకుల వ్యసనానికి మీరు ఒక్కరే బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. వారిని మార్చడానికి మీ ప్రయత్నం అవసరమే కానీ, చికిత్సలో వారి సహకారం కూడా చాలా ముఖ్యం.



21 రోజులు చికిత్స పొందితే వ్యసనం పూర్తిగా పోతుందని చెప్పలేం. మద్య పానం లేదా గంజాయి వ్యసనం నుంచి బయటపడట ం ఒక్కసారిగా జరిగే ప్రక్రియ కాదు. అవసరాన్ని బట్టి డీటాక్సిఫికేషన్, వైద్య చికిత్స, మానసిక చికిత్స, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, పునరావాసం, తదుపరి ఫాలోఅప్ చికిత్స అవసరం కావచ్చు.మీ భర్తకు, కొడుకుకు ఒకే రకమైన చికిత్స తప్పనిసరిగా సరిపోదు. వారి వయస్సు, వ్యసనం తీవ్రత, శారీరక–మానసిక పరిస్థితులను పరిశీలించిన తర్వాత సైకియాట్రిస్ట్ చికిత్సను నిర్ణయిం చాలి. పునరావాస కేంద్రంలో చేర్పించే ముందు అర్హత కలిగిన సైకియాట్రిస్ట్, వైద్య సిబ్బంది, కౌన్సెలింగ్ సౌకర్యాలు ఉన్నాయా? అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి తరలించే వ్యవస్థ ఉందా? వంటి విషయాలు తెలుసుకోండి. కేవలం 21 రోజులు కేంద్రంలో ఉంచడం మాత్రమే వ్యసన విముక్తికి సరిపోదు .ప్రైవేట్ కేంద్రాల్లో ఖర్చు సంస్థ ను బట్టి మారుతుంది. మీ కుటుంబం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున, ముందుగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మానసిక వైద్య విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని డీఅడిక్షన్ సేవలను సంప్రదిం చడం మంచిది. చికిత్స కాలం, ఖర్చు వంటి వివరాలను కేంద్రంలో ముందుగానే స్పష్టంగా తెలుసుకోండి. అన్నింటికంటే, ఓర్పుతో పాటు సరైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం కొనసాగాలి. అదే సమయంలో మీ ఆరోగ్యం,భద్రతను కూడా నిర్లక్ష్యం చేయకండి. □

# సాయి హితవు

కులకర్ణి ఆహ్వానంతో షిర్డీలో ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చింది కళావతి అనే నాట్యకారిణి. అక్కడి స్త్రీలకు ఆమె రాక నచ్చలేదు. ఆమె అందచందాలకు తమ పురుషులు ఆకర్షితులవుతారన్న భయం వారిది. ప్రదర్శన తొలి రోజు ఉదయం కళావతి మందిరానికి రాగా.. కొందరు గ్రామస్థులు ఆమెతో గొడవకు దిగారు. అప్పుడామె మీరంతా మీ పనులు చేసుకుంటారు కదా.. నా పని నాట్యం. నేను కూడా నా పని కోసమే వచ్చాను అంది. అంతలో అటుగా వచ్చిన సాయి ఘర్షణతో సమస్య తాత్కాలికంగా సద్దుమణగచ్చు కానీ సమసిపోదు. ఏ సమస్యకైనా పరిష్కారం గురించి ఆలోచించాలి. మీరు అనవసరంగా భయపడుతున్నారు. భయం మిమ్మల్ని బలహీనం చేస్తుంది. కళావతి గురించి మీవన్నీ అపోహలు. భ్రమలూ మనలో అభద్రతాభావాన్నీ, ఆందోళననూ పెంచు తాయి. మనసులో అలజడి కలిగించే ఆవేదన అతి పెద్ద అనారోగ్యం. ఆమె అందంగా ఉంటుంది. నాట్యం చేస్తుంది కనుక.. అందరినీ ఆకర్షిస్తుంది అంటూ తప్పుగా ఆలోచిస్తున్నారే గానీ ఆమెలో ఉన్న అద్భుత కళను గుర్తించ లేదు. మంచి, చెడు అనేవి మనం చూస్తే కోణాన్ని బట్టి ఉంటాయి. ఆమె నాట్యప్రదర్శన ఇచ్చేందుకే వచ్చింది తప్ప ఎలాంటి కపటాలూ కల్మషాలూ లేవు. అర్థమైందా? మీరెవరూ ఆమెని అడ్డుకోవద్దు.. మందిరంలోకి వెళ్లనివ్వండి అంటూ హితవు పలికాడు. వాళ్లంతా సాయిని క్షమాపణ అడిగి అక్కణ్ణించి వెళ్లిపోయారు. □

# తెర

## ‘తత్వం’లో ఉత్కంఠ థ్రిల్‌ను కలిగిస్తుంది: అర్జున్ కోలా



అర్జున్ కోలా దర్శకత్వంలో దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ఖితత్వంఖి త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ , శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు.

**ఈ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

తత్వం అనే టైటిల్ ఈ స్టోరీకి పెట్టానికి ఓ రీజన్ ఉంది. మర్డర్ మిస్టరీ వెనుక నిజాలు, అబద్దాలు అన్నీ ఉంటాయి. ఓ మనిషి ఏది నమ్మాలి.. ఏది నమ్మకూడదో అనే కన్ఫ్యూజన్ వచ్చినప్పుడు ఈ పాయింట్‌లో స్టోరీ నడుస్తుంటుంది.

**ఈ సినిమా జర్నీలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశా అన్నారు?**

ఈ సినిమా ప్రయాణంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. ఈ సినిమా సమయంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. మేము ఫేస్ చేసిన స్ట్రగుల్స్‌కు మళ్లీ మేము వచ్చి సినిమా విడుదల చేస్తాం అని ఎవరూ అనుకోలేదు. ఈ సినిమా ప్రమోషన్ స్టార్ట్ చేసిన సమయంలో హీరో, హీరోయిన్‌కు కారు యాక్సిడెంట్‌కు గురయ్యారు. మళ్లీ వాళ్లు కోలుకునే సరికి టైమ్ పట్టింది.

**ఈ సమయంలో మీ మానసిక పరిస్థితి ఎలా ఉండేది?**

నాలో కూడా కాన్ఫిడెన్స్ తగ్గుతుండేది .. కానీ నా బాధ్యత గుర్తొచ్చేది.. ఈ సమయంలోనే అందరి సపోర్ట్‌తో ముందుకెళ్లాం..

**సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ ఈ సినిమా చేయడానికి రీజన్?**

జాబ్ గ్యాప్ తీసుకని షూట్ చేశాం. చిన్నప్పటి నుంచి ఇంట్రెస్ట్ అందుకే నా శాటిస్‌ఫాక్షన్ కోసం దర్శకత్వం చేశాను. అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేయకుండా సినిమాను కైవల్య అనే డెమో ఫిలిం చేశాను. అప్పుడు కాన్ఫిడెన్స్ వచ్చింది. టైమ్ డీలే అవుతున్న కొద్ది పాషన్ కూడా డీలే అవుతుంది.

**ఇప్పుడు ఫైనల్‌గా సినిమా చూసిన తరువాత మీ నిర్మాతల స్పందన?**

ఫైనల్ అవుట్‌పుట్ చూసుకున్న తరువాత అనుకున్న దాని కంటే బాగా తీశావు అని మెచ్చుకున్నారు.

**ఇలాంటి మర్డర్ మిస్టరీ సినిమాలకు ఆర్ఆర్ కీలకంగా ఉంటుంది? చేతన్ భరద్వాజ్ ఆర్ఆర్ ఎలా ఉండబోతుంది?**

చేతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి బిగ్గెస్ట్ ఎస్సెట్.. ఈ మిస్టరీని ఆ సౌండింగ్‌తో చూస్తే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సెకండాఫ్‌లో వచ్చే మిస్టరీ అందరిని ఎంతో థ్రిలింగ్‌గా ఉంటుంది.

**దర్శకత్వం కంటిన్యూ చేస్తరా?**

ఇంకా తెలియదు. ఓ సినిమా చేద్దామని అను కున్నాను చేశాను. మాల్గుడి డేస్ లా ద్వారపుడి డేస్ అని గోదావరి నేపథ్యం లో ఓ సినిమా చేద్దామని అనుకు న్నాను. అది కంప్లీట్ ఓ ఎమోషనల్ మూవీ.

## అరుదైన పాత్రలో అల్లు రామలింగయ్య



నేడు అల్లురామలింగయ్య జన్మదినోత్సవం. తెలుగు సినిమారంగానికి ఎనభై సంవత్సరాలు దాటి యింకా యింకా పరుగులు తీస్తున్న ఈ శుభవేళ మరపురాని మహానటుల్లో ఒకరు అల్లురామలింగయ్య పాలకొల్లు పట్టణం నుంచి మంచినటుడిగా వైద్యుడిగా మద్రాసు తరలి వచ్చి తనకంటూ చేరగని పాత్రలు ధరించారు. అందులో ముఖ్యమైనది మమతా ప్రొడక్షన్స్ ‘కాలం మారింది’ చిత్రం 1972 సంవత్సర సీనియర్ జర్నలిస్టు వాసిరాజు ప్రకాశం నిర్మించిన ఈ చిత్రంలో రామలింగయ్య ఎం.ఎం.ఎ. ఏకాంబరేశ్వరరావు అందరికీ పరిచయం చేశారు. చివరకు ఆయన ఒక పిచ్చివాడని, పిచ్చాసుపత్రి నుండి తప్పించుకొని వచ్చిన స్వాతంత్ర సమరయోధుడని తెలుస్తుంది. అల్లురామలింగయ్య హాస్యానికి హరివిల్లు. ఏ పాత్ర ధరించినా, నిర్మాతకు ఆనందంగా వుంటూ, ఆ చిత్రం విజయానికి చేయూత నిచ్చారు. భారతప్రభుత్వం ‘పద్మశ్రీ’ గౌరవం అందుకున్న ఆయన ఎన్నో మహోన్నత సినిమాలు చేసిన మహామనిషి.

## మాసెస్ ఎన్టీఆర్.. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ను అందరూ థియేటర్స్‌లో ఎంజాయ్ చేస్తారు.. సినిమా పెద్ద హిట్ అవుతుంది: దర్శకధీరుడు

### ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ ప్రీ రిలీజ్ ఈవెంట్



ఎస్.ఎస్.రాజమౌళి.. హీరో ఫాహద్ ఫాజిల్ మాట్లాడుతూ ఇంత అభిమానం ఎప్పుడూ చూడలేదు. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. 90 శాతం లైవ్ లొకేషన్స్‌లో షూట్ చేశాం. చాలా మంచి ఫీల్ కలిగింది. ఈ సినిమా షూటింగ్‌లో దర్శక నిర్మాతలు, సినిమా యూనిట్ అంతా ఎంతో సపోర్ట్ చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ.. ఈ సినిమా ఛాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు చాలా థాంక్స్. నిర్మాత ఎస్ ఎస్ కార్తికేయ మాట్లా డుతూ.. నిర్మాతగా ఇది నా మొదటి సినిమా. ఇది ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా. దర్శకుడు శశాంక్ మాట్లా డుతూ.. శోబు సార్, చిన్నా సార్, రాజమౌళి సార్ నాకు ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చినందుకు థ్యాంక్స్, మ్యూజిక్ డైరెక్టర్ కాలభైరవ మాట్లా డుతూ.. అక్టోబర్ 2 న ఈ సినిమా చూసి ప్రతి ఒక్కరికి ఈ సినిమా నచ్చుతుంది. టీం అంతా కలిసి ఎంతో కష్టపడి పని చేశారు. ప్రత్యేక అతిథి రాఘవేంద్ర రావు మాట్లాడుతూ.. కార్తికేయ చాలా కసితో తీసిన సినిమా ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ వీళ్ళు అనుకున్నారు కదా మీరేనా బాహుబలి సినిమా చేసేది. అన్నారు. దిగ్గజ సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ.. ఈ సినిమా దర్శకుడు శశాంక్, వాళ్ళ గురువు చంద్రశేఖర్ ఏలేటిని మించిన వాడు కావాలని కోరుకుంటూ.. మా అబ్బాయి కాలభైరవ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కు మంచి పేరు రావాలని కోరుకుంటూ,. అందరూ సినిమా చూడండి అన్నారు.దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ.. ఎమోషనల్ అవుతున్నా. తారక్ తన తమ్ముడి ఫంక్షన్ కోసం వచ్చాడు. ఫాహద్ ఫాజిల్ ఒక్కో సినిమా చూస్తుంటే మైండ్ బ్లోయింగ్. ఆయన ఒక్కో క్యారెక్టర్ చూసి నిజంగా ఆశ్చర్యపోయా. ఫాఫా తెలుగు ప్రజల్లోకి ఎంతగానో వెళ్లిపోయారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ మాట్లాడుతూ.. గాయం నుంచి కోలుకున్నా. డ్రాగన్ చెప్పిన సమయానికే విడుదల అవుతుంది. అదే ఫాహద్ సార్. మొదటిసారి బెంగళూరులో ఆయన సినిమా చూశా. నాకు అతి తక్కువ మంది యాక్టర్స్ ఇష్టం.

## ‘వేల్’ సినిమా ట్రైలర్ లాంచ్

రవిచంద్ర, ఆదిత్య, అమృత శ్రీవాత్సవ, రాధిక రామ్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా`వేల్’. ఈ చిత్రాన్ని క్షత్రియ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ జి. అశోక్ (రాజు), వై మురళి(రాజు) నిర్మిస్తున్నారు. డైరెక్టర్ నాగేంద్ర ఆవుల రూపొందిస్తున్నారు. వచ్చే నెలలో ‘వేల్’ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ నటుడు నాగమహేశ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ఈ సినిమా మొత్తం గోవాలో చిత్రీకరించారు. ప్రతి సీన్ ఎక్కడా ల్యాగ్ లేకుండా వెళ్తూ మనల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. హీరోయిన్ అమృత శ్రీవాత్సవ మాట్లాడుతూ నేను మిస్ ఇండియా విన్నర్ అయ్యాక మిస్ వరల్డ్ పోటీలకోసం సన్నద్ధమవుతూ వచ్చాను. ఆ క్రమంలో ఈ సినిమా ఆఫర్ వచ్చింది. హీరో రవిచంద్ర మాట్లాడుతూ మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని నమ్ముతున్నాం. మాది స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న మూవీ. హిట్ కొడుతున్నాం అనే నమ్మకం మాలో ఉంది. హీరో ఆదిత్య మాట్లాడుతూ ఒక మనిషి తనకు కావాల్సిన పనులు చేయించుకోవడం కోసం ఎలాంటి మసుగులు వేసుకుని ప్రవర్తిస్తున్నాడు అనే పాయింట్ తో మా డైరెక్టర్ ఈ చిత్రాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించాడు. ప్రొడ్యూసర్ జి. అశోక్ కుమార్ మాట్లాడుతూ మా సినిమా ట్రైలర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే బాగుంటుంది. మా మూవీ ట్రైలర్ కు మీరు ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉంది. డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ మా మూవీ ఇంత బాగా రావడానికి మా ప్రొడ్యూసర్ కారణం. ఆయన ఇచ్చిన సపోర్ట్ వల్లే కథను బాగా తెరకెక్కించగలిగాం .



## ‘అనకాపల్లి’ ఇంటర్వెల్, క్లైమాక్స్ అద్భుతంగా ఉంటాయి: లగడపాటి శ్రీధర్

‘అనకాపల్లి’ అక్టోబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను మీడియా మీట్‌లో త్రినాథరావు నక్కిన.. లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. ‘అనకాపల్లి’ మూవీ అక్టోబర్ 2న రాబోతోంది. ఆగస్ట్‌లోనే ఈ సినిమా రావాల్సింది. అయితే చాలా మందికి ఈ మూవీని చూపించాం. అందరి సలహాల్ని తీసుకున్నాం. సినిమాని మరింత బెటర్ చేశాం. ఈ మూవీ కోసం మా విక్రమ్‌ని అడిగిన త్రినాథరావు గారికి థాంక్స్. నేను ఎప్పుడో ఆయన్ను నాకు ఓ సినిమా చేసి పెట్టండని అడిగాను. విక్రమ్‌కి ఇంత మంచి అవకాశం ఇచ్చిన త్రినాథరావుకి థాంక్స్. తినాథరావు నక్కిన మాట్లాడుతూ.. .. నిర్మాతల కష్టం నాకు ఇప్పుడిప్పుడు అర్థం అవుతోంది. సినిమా తీయడం కంటే ఆడియెన్స్ ముందుకు తీసుకు రావడం మరింత కష్టంగా మారింది. నిర్మాతగా కంటే దర్శకుడిగా ఉండటమే బెటర్ అనిపిస్తోంది. కానీ నిర్మాణం అనేది నాకు ప్యాషన్. నిర్మాతగా నా ఈ జర్నీని ఎంజాయ్ చేశాను. అన్నారు.నిర్మాత కాండ్రేగుల నాయుడు మాట్లాడుతూ.. అనకాపల్లి త్రంలో విక్రమ్ చాలా కొత్తగా కనిపిస్తారు. ఈ సినిమా కోసం విక్రమ్ చాలా కష్టపడ్డాడు. సంధ్య, త్రినాథరావు, తారక్ పొన్నప్ప, ఇంద్రజ ఇలా అందరి పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. అక్టోబర్ 2న మా సినిమా రాబోతోంది. ..సంధ్య వశిష్ట మాట్లాడుతూ.. .. అనకాపల్లి చిత్రం అక్టోబర్ 2న రాబోతోంది. ఇంటెన్స్, లవ్, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాగా మా సినిమా రానుంది. మా మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది అని అన్నారు.



## ‘గోల్డెన్ భాగ్యం’ ఫుల్ ఫన్ టైటిల్ గ్లింప్స్ రిలీజ్



కామెడీ పవర్‌హౌస్‌లు సత్య, యోగిబాబు కలిసి ఓ కొత్త కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబో తున్నారు. రంగబలి ఫేమ్ పవన్ బాసంశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాలు బ్యానర్లపై నాగార్జున రెడ్డి, పవన్ బాసంశెట్టి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ రెండు బ్యానర్లకు ఇదే తొలి ప్రొడక్షన్ వెంచర్. తాజాగా చిత్ర బృందం టైటిల్ రివీల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇది తెలుగు, తమిళ భాషలను కలిపి, రెండు ఇండస్ట్రీలకు చెందిన పాపులర్ యాక్టర్స్‌తో తెరకెక్కుతున్న తెలుమిళ్ ప్రాజెక్ట్. గ్లింప్స్ ప్రారంభంలో ఓ తెలుగు వ్యక్తి, ఓ తమిళ వ్యక్తి తమకు ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ.. తమ వంటకాలే బెస్ట్ అంటూ గొప్పగా చెప్పుకోవడం నవ్వులు పూయిస్తుంది. తెలుగు వ్యక్తి బిర్యానీతో పాటు కూల్ డ్రింక్‌ను ఆస్వాదిస్తుండగా.. తమిళ వ్యక్తి ఇడ్లీ, సాంబార్ తింటూ కనిపిస్తాడు. తెలుగు, తమిళ సినిమాల్లో పాపులర్ అయిన ఇద్దరు కామెడీ స్టార్స్ సత్య, యోగిబాబులను కలిపి ఓ బైలింగ్వల్ క్రాస్‌ఓవర్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తూ దర్శకుడు పవన్ బాసంశెట్టి డిఫరెంట్ అటెంప్ట్ చేస్తున్నారు. అంతేకాదు.. తెలుగు నటుడు సత్య తమిళంలో మాట్లాడటం, తమిళ స్టార్ యోగిబాబు తెలుగులో మాట్లాడటం గ్లింప్స్‌లో మరింత ఫన్‌ను క్రియేట్ చేశాయి. వీరిద్దరినీ భారీ తెలుగుతమిళ కాంబినేషన్‌గా ప్రజెంట్ చేస్తూ బ్యాక్‌గ్రౌండ్‌లో భారీ మల్టీస్టారర్ కటౌట్స్‌ను కూడా చూపించారు. గ్లింప్స్ చూస్తే.. లీడ్ యాక్టర్స్ మధ్య ఉండే యూనిక్ కెమిస్ట్రీ చుట్టూ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతున్నట్లు అర్థమౌతోంది. సత్య, యోగిబాబు తొలిసారి ఈ తరహా సెటప్‌లో కలిసి నటిస్తుండటంతో.. వీరిద్దరి కామెడీ స్టైల్, టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. జయశ్రీ, అధిరాజ్ హీరోయిన్లుగా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, సుధర్శన్, కిశోర్ తిరుమల, రోహిణి, తనికెళ్ల భరణి, సునీల్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రతిభావంతమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. మలయాళ సినిమా రంగానికి చెందిన సినిమాటోగ్రాఫర్ బబ్లూ అజు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

ఆట



# ఆసియా క్రీడలు రెజ్లింగ్.. సునీల్‌కు కాంస్యం

**నగోయా:** జరిగిన ఆసియా గేమ్స్ 2026 పురుషుల 87 కేజీల గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఈవెంట్‌లో, భారత రెజ్లర్ సునీల్ కుమార్, ఫిలిప్పీన్స్‌కు చెందిన కాలమ్ జాన్‌స్టన్ రాబర్ట్స్‌ను 9-0 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీతో ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో సునీల్ ఈ విభాగంలో వరుసగా రెండవ ఆసియా క్రీడల కాంస్య పతకాన్ని గెలుచుకోవడంతో పాటు, ఖండాంతర క్రీడలలో రెండు గ్రీకోరోమన్ రెజ్లింగ్ పతకాలను గెలుచుకున్న తొలి భారతీయ రెజ్లర్‌గా నిలిచాడు.

ఆట ప్రారంభంలోనే రాబర్ట్స్‌ను రెండుసార్లు కింద పడేసి నాలుగు పాయింట్లు సాధించిన సునీల్, వెంటనే ఆటపై పట్టు సాధిం చాడు. నిష్క్రియాత్మకతకు లభించిన మరో పాయింట్‌తో అతని ఆధిక్యం త్వరలోనే 5-0కి పెరిగింది, దీంతో తొలి 90సెకన్లలోనే సునీల్ తిరుగు లేని ఆధిక్యాన్ని నెలకొల్పాడు. సునీల్ దాడులను ఎదుర్కోవడానికి రాబర్ట్స్ చాలా ఇబ్బంది పడ్డాడు. సునీల్ మరో స్కోరింగ్ మూవ్‌ను ప్రదర్శించి మరో రెండు పాయింట్లు జోడించి, స్కోరును 90కి తీసుకువెళ్లి, టెక్నికల్ సుపీరియారిటీ ద్వారా విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. అతను ఇటీవల పతకం సాధించడంతో, ఆసియా క్రీడలలో బహుళ గ్రీకోరోమన్ పతకాలు గెలుచుకున్న మొదటి భారతీయ రెజ్లర్‌గా నిలిచాడు,

## ఆసియా గేమ్స్ హాకీ ఫైనల్స్‌కు భారత్ మహిళాజట్టు

### దక్షిణ కొరియాపై 2-0 తేడాతో విజయం

**కకమిగహార:** జపాన్‌లోని కకామిగహారాలో బుధవారం జరిగిన సెమీఫైనల్‌లో దక్షిణ కొరియాను 2-0 తేడాతో ఓడించి, స్వర్ణ పతక పోరులో స్థానం సంపాదించిన భారత్, ఆసియా క్రీడలు 2026 మహిళల హాకీలో పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలి క్వార్టర్‌లో భారత్‌కు పలు పెనాల్టీ కార్నర్లు లభించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. కొరియా రెండు వైపుల నుంచి దాడికి దిగినా, భారత్ పటిష్టంగా నిలవడంతో తొలి పావుగంట గోల్ లేకుండా ముగిసింది. రెండవ క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ ద్వారా లభించిన శక్తివంతమైన షాట్‌ను నవనీత్ కొట్టగా, కొరియా గోల్ కీపర్ అద్భుతంగా దాన్ని అడ్డుకోవడంతో భారత్ మరోసారి గోల్‌కు చేరువైంది. భారత్ నుండి నిరంతర ఒత్తిడి ఎదురైనప్పటికీ, కొరియా దృఢంగా నిలబడటంతో విరామ సమయానికి ఇరు జట్లు 0-0తో సమంగా నిలిచాయి. ఆటను పునఃప్రారంభించిన భారత్ 44వ నిమిషంలో ఇషిక గోల్ చేయడంతో ఎట్టకేలకు 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కెప్టెన్ సలీమా టెటే ప్రారంభించిన ఒక ఎత్తుగడతో నాలుగో క్వార్టర్ ఆరంభంలోనే భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. ఈ విజయంతో, ఆసియా క్రీడల్లో 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించి రెండో మహిళల హాకీ స్వర్ణ పతకాన్ని సాధించాలన్న భారత ఆశలు సజీవంగా ఉన్నాయి.

## ఆసియా గేమ్స్ మహిళల ఆర్చరీ..

# భారత్ టీమ్‌కు స్వర్ణం



**నగోయా:** ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో ఏడో స్వర్ణం చేరింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్రీడాకారిణులు సత్తా చాటుతూ పసిడి పతకాన్ని ముద్దాడారు. బుధవారం జరిగిన ఫైనల్లో 238-234 తేడాతో జ్యోతి సురేఖ, చికితా, ప్రీతికాతో కూడిన భారత త్రయం చైనాను ఓడించింది. జ్యోతి సురేఖ వెన్నం, చికితా తనిపర్తి, ప్రీతికా ప్రదీప్‌తో కూడిన భారత జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. కీలకమైన ఫైనల్లో ఒత్తిడిని అధిగమిస్తూ ప్రతి రౌండ్‌లోనూ చైనాపై ఆధిక్యాన్ని కొనసాగించి నెగ్గింది. ఫైనల్ పోరు ప్రారంభమైన వెంటనే భారత జట్టు తొలి ఎండ్‌లో వరుసగా పర్ఫెక్ట్ 10లు సాధిస్తూ 60-58తో ఆధిక్యం సంపాదించింది. రెండో ఎండ్‌లోనూ అదే దూకుడు కొనసాగించింది. మరోసారి 60 పాయింట్లు సాధించిన భారత జట్టు 60-58తో ఆ రౌండ్‌ను సొంతం చేసుకుంది. మూడోఎండ్ ముగిసే సమయానికి భారత్ 178-176తో ముందంజలో నిలిచింది. చివరి ఎండ్‌లో టైటిల్‌ను ఖరారు చేసుకోవడానికి భారత్‌కు మరో స్థిరమైన ప్రదర్శన అవసరమైంది. చివరిరౌండ్‌లో భారత త్రయం మొత్తం ఆరు పర్ఫెక్ట్ 10లు సాధించింది. దీంతో 238 పాయింట్లతో ఫైనల్‌ను ముగించి 234 పాయింట్లకే చైనాను పరిమితం చేసింది. ఫలితంగా భారత్‌కు స్వర్ణం ఖాయమైంది.

## నేడు శ్రీలంకతో సెమీఫైనల్



**న్యూఢిల్లీ:** ఆసియా గేమ్స్ 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. ఒక్క మ్యాచ్ ఆడకుండానే సెమీఫైనల్ చేరిన భారత్ అక్టోబరు 1న జరిగే నాకౌట్ పోరులో శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. జపాన్‌లోని నిషిన్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మొదలవ్వ నున్న ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. వర్షం కారణంగా క్వార్టర్ ఫైనల్స్ రద్దయిన సంగతి తెలిసిందే. సెమీఫైనల్ కూడా రద్దయితే మెరుగైన ఐసీసీ ర్యాంక్ కలిగిన భారత్ ఫైనల్ చేరనుంది. శ్రీలంక కాంస్య పోరు ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మ్యాచ్ జరిగినా, భారత్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శ్రీలంకతో పోల్చితే భారత జట్టే హాట్ ఫేవరేట్. కానీ స్పిన్ కండిషన్స్‌లో శ్రీలంకను తక్కువ అంచనా వేయలేం. ఈ క్రమంలోనే టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కుతుందా లేదా బెంచ్‌కే పరిమితం చేస్తారా అనేది చూడాలి. జపాన్‌తో ఏకైక టి20లో వైభవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయగా, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చారు. జపాన్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే స్పిన్ బాగా ఆడగల సంజూ శాంసన్‌నే తుది జట్టులో కొనసాగించే అవకాశం ఉంది. దాంతో వైభవ్ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది. సెలక్టర్లు ఏం నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.



## ఆసియా క్రీడల షూటింగ్.. మిక్స్‌డ్ టీమ్

# నీరు, కైనాన్‌కు స్వర్ణం

**నగోయా:** ఆసియా గేమ్స్ 2026 ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బుధవారం భారత షూటర్లు నీరూ ధండా-కైనన్ చెనాయ్ ద్వయం స్వర్ణం కైవసం చేసుకుంది. తద్వారా కొత్త ఆసియా రికార్డును నెలకొల్పి, భారతదేశ షూటింగ్ పతకాల ఖాతాకు మరో టైటిల్‌ను చేర్చారు. ఫైనల్‌లో భారత్‌కు ఆరంభం కష్టంగా సాగింది. తొలి 10 షాట్లలో కేవలం ఆరు మాత్రమే సాధించి పట్టికలో అట్టడుగున నిలిచింది. అయితే, రెండో సిరీస్‌లో నీరూ, కైనాన్ విజయవంతమైన షాట్‌ల పరంపరను కొనసాగించారు. వారి ప్రదర్శనతో 20 షాట్‌ల తర్వాత భారత్ 16 హిట్‌లు సాధించి, ఖతార్‌తో సమంగా నిలిచింది. 12 హిట్‌లతో ఇరాన్ నిష్క్రమించడంతో భారత్ పోడియంపై స్థానం దక్కించుకుంది. మరో క్లీన్ సిరీస్‌తో భారత్ గట్టి పోటీలో నిలవగా, చివరిలో బలమైన ప్రదర్శనతో ఈ జంట 30 షాట్ల దశలో 26 హిట్లు సాధించింది. బలంగా ప్రారంభించిన చైనా 23 హిట్లతో నిష్క్రమించగా, ఖతార్ 24 హిట్లతో భారత్‌కు ప్రధాన పోటీదారుగా నిలిచింది. నిర్ణయాత్మక దశలో నీరు, కైనన్ 34 హిట్‌లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం మహిళల వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో రజత పతకం సాధించిన తర్వాత, బుధవారం మిక్స్‌డ్ టీమ్‌లో నీరుకు ఇది రెండవ స్వర్ణ పతకం.





## ఆసియా క్రీడల బాక్సింగ్..

# ఫైనల్‌కు లవ్లీనా , కపిల్‌కు కాంస్యం

**నిషోయ్:** ఆసియా గేమ్స్ 2026లో జరిగిన మహిళల 75 కేజీల బాక్సింగ్ విభాగంలో, భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్‌కు దూసుకెళ్లగా, పురుషుల 90 కేజీల సెమీఫైనల్ పోరులో కపిల్ పోఖరియా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బుధవారం జరిగిన సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన నటాల్యా బోగ్దనోవా తొలి రౌండ్‌లో క్రమంగా తన దాడులను తీవ్రతరం చేయగా, లోవ్లినా తన ప్రత్యర్థిని ఎదుర్కోవడంపై దృష్టి సారించింది. దీంతో కజఖ్ బాక్సర్ మొదటి రౌండ్‌లో 3-2 తేడాతో స్వల్ప ఆధిక్యం సాధించింది. రెండవ రౌండ్‌లో లవ్లినా దూకుడుగా ఆడింది. లవ్లినా పదునైన పంచ్‌లతో ఆ రౌండ్‌ను 5-0తో గెలుచుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. లోవ్లినా తన ఆధిక్యాన్ని నిలుపుకొని 3-2 తేడాతో స్ప్లిట్‌డెసిషన్ విజయాన్ని సాధించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇక పురుషుల 90కేజీల విభాగంలో కపిల్ పోఖరియా ప్రస్థానంసెమీఫైనల్స్‌లో ముగిసింది. అక్కడ అతను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన తురాబెక్ ఖబిబుల్లాయెవ్ చేతిలో 1-4 తేడాతో ఓటమి చవిచూశాడు. తొలి రౌండ్‌లో కపిల్ ఆశాజనకంగా ప్రారంభించినా ఖబీబుల్లావ్ తొలి రౌండ్‌ను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నాడు. రెండో రౌండ్‌లోను 4-1 తేడాతో ఉజ్బెక్ ఆధిక్యంతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు.



# ఇవిలకు భారీ ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కార్ల తయారీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొత్త 'కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ (సిఎఎఫ్ఇ-3) నిబంధనలను ప్రకటించింది. 2027 ఏప్రిల్ నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. 2032 మార్చి వరకు కొనసాగుతాయి. చిన్న పెట్రోల్ కార్లకు ప్రత్యేకంగా ఇవ్వాలని గతంలో ప్రతిపాదించిన రాయితీని తుది నిబంధనల్లో తొలగించారు. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు అందుతున్న ప్రోత్సాహకాలను కొనసాగించారు.

**చిన్న కార్లకు ప్రత్యేక రాయితీ లేదు**

909 కిలోల వరకు బరువున్న పెట్రోల్ కార్లకు కిలోమీటరుకు 3 గ్రాముల కార్బన్ ఉద్గార రాయితీ ఇవ్వాలని 2025లో రూపొందించిన ముసాయిదాలో ప్రతిపాదించారు. దీనిని పలు ప్రముఖ కార్ల తయారీ సంస్థలు వ్యతిరేకించాయి. తుది నిబంధనల్లో ఈ ప్రత్యేక రాయితీకి చోటు కల్పించలేదు. బదులుగా కంపెనీ మొత్తం కార్ల ఉద్గారాల లక్ష్యాన్ని నిర్ణయించే ఫార్ములాను మార్చారు.ఇవి కార్ల వాహనాల వినియోగాన్ని పెంచేందుకు 'సూపర్ క్రెడిట్స్' విధానాన్ని కొనసాగించారు.

**క్రెడిట్.. డెబిట్ విధానం:** కొత్త నిబంధనల్లో క్రెడిట్‌డెబిట్ వ్యవస్థను కూడా తీసుకొచ్చారు. నిర్దేశించిన ఉద్గారాల లక్ష్యం కంటే మెరుగైన పనితీరు చూపిన కంపెనీలకు క్రెడిట్లు లభిస్తాయి. లక్ష్యాలను అందుకోలేని సంస్థలకు డెబిట్లు పేరుకుపోతాయి.

## ప్రపంచంలో అత్యంత విలువైన కరెన్సీ కువైట్ దీనార్



**న్యూయార్క్, సెప్టెంబరు 30:** ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన లేదా విలువైన కరెన్సీ ఏది అని అడిగితే చాలామంది అమెరికా డాలర్, బ్రిటన్ పౌండ్ లేదా యూరో అని సమాధానం చెబుతారు. కానీ, వాస్తవానికి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది ఓ గల్ఫ్ దేశ కరెన్సీ. అదే 'కువైట్ దీనార్'. యూనిట్ మారకం విలువ పరంగా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కరెన్సీగా ఇది రికార్డు సృష్టిస్తోంది. 2026 సెప్టెంబరు నాటి అంతర్జాతీయ మార్కెట్ గణాంకాల ప్రకారం ఒక కువైట్ దీనార్ (కెడబ్ల్యుడి) విలువ భారత కరెన్సీలో ఏకంగా రూ.311గా ఉంది. అదే సమయంలో అమెరికా డాలర్లలో దీని విలువ సుమారు 3.23 డాలర్లు. అంటే.. మూడు డాలర్ల కన్నా ఎక్కువ ఇస్తే కానీ ఒక్క కువైట్ దీనార్ రాదు. ఈ లెక్కన ప్రపంచంలో అత్యధిక యూనిట్ విలువ కలిగిన కరెన్సీగా కువైట్ దీనార్ మొదటి స్థానంలో నిలుస్తోంది. **టాప్4లో గల్ఫ్ దేశాల హవా:** ఈ జాబితాలో మధ్యప్రాచ్య దేశాల కరెన్సీలదే ఆధిపత్యం. కువైట్ దీనార్ తర్వాత రెండో స్థానంలో బహ్రెయిన్ దీనార్ (బిహెచ్‌డి)ఉంది. దీని విలువ దాదాపు రూ.255 (2.66 డాలర్లు). మూడో స్థానంలో ఒమానీ రియాల్ (ఒఎంఆర్) సుమారు రూ.249 (2.60 డాలర్లు)తో నిలిచింది. ఇక నాలుగో స్థానంలో జోర్డానియన్ దీనార్ (జెఒడి) ఉంది.దీని విలువ దాదాపు రూ.135 (1.41 డాలర్లు). రోజువారీ ఫారెక్స్ మార్కెట్ కదలికలను బట్టి ఈ ర్యాంకింగ్‌లలో స్వల్ప మార్పులు ఉంటాయి.

## భారత్‌లోకి 'యాపిల్ ప్లే' ఎంట్రీ

**ముంబై, సెప్టెంబరు 30:** ఐఫోన్ యూజర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న యాపిల్ పే సేవలు ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెట్టాయి. అమెరికాలో ప్రారంభమైన పదేళ్లకు పైగా నిరీక్షణ తర్వాత, టెక్ దిగ్గజం యాపిల్ తన కాంటాక్ట్‌లెస్ పేమెంట్ విధానాన్ని దేశంలో అధికారికంగా బుధవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. ఇకపై అర్హత కలిగిన ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్ యూజర్లు తమ డివైజ్‌ల ద్వారా సులభంగా, సురక్షితంగా చెల్లింపులు చేయవచ్చు.ప్రారంభ దశలో, ఈ సేవలు కేవలం యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో మరిన్ని బ్యాంకులు, ఇతర కార్డ్ నెట్‌వర్క్‌లను కూడా ఈ జాబితాలో చేర్చనున్నట్లు కంపెనీ తెలిపింది. అయితే, భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యుపిఐ)తో యాపిల్ పేకు ప్రస్తుతానికి ఎలాంటి అనుసంధానం లేదని స్పష్టం చేసింది.

# వరుసగా మూడో రోజూ మార్కెట్లు పతనం

వాణిజ్యం



**ముంబై, సెప్టెంబరు 30:** ముడి చమురు ధరలు స్థిరంగా ఉండటం. అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ అధికంగా ఉండటంతో పాటు, మెటల్, ఫార్మా షేర్లలో చివరి గంటలో జరిగిన అమ్మకాల కారణంగా బుధవారం నాడు ప్రధాన స్టాక్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడవ సెషన్‌లోనూ నష్టంతో ముగిశాయి. రోజువారీ లాభాలన్నింటినీ కోల్పోయి, 30 షేర్ల బిఎస్‌సి సెన్సెక్స్ చివరి దశ అమ్మకాల ఒత్తిడితో 48.78 పాయింట్లు (0.07 శాతం) తగ్గి 72,480.29 వద్ద స్థిరపడింది. ప్రారంభంలో పెద్దగా కదలిక లేనప్పటికీ, ఆ తర్వాత సూచీ 533.16 పాయింట్లు (0.73 శాతం) పెరిగి 73,062.23 గరిష్ట స్థాయిని తాకింది. 50 షేర్ల ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 95.75 పాయింట్లు (0.42 శాతం) తగ్గి 22,620.45 వద్ద ముగిసింది. ఈ నెలలో, బిఎస్‌ఇ సూచీ 4,476.98 పాయింట్లు (5.81 శాతం), నిఫ్టీ 1,459.95 పాయింట్లు (6 శాతం) మేర పడిపోయాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీలలో, ఎటర్నల్, సన్ ఫార్మా, టైటాన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యాక్సిస్ బ్యాంక్ లాభపడిన వాటిలో ఉన్నాయి. ప్రపంచ చమురు ధరలకు ప్రామాణికమైన బ్రెంట్ క్రూడ్ 0.54 శాతం పెరిగి బ్యారెల్‌కు 103.1 డాలర్లకు చేరింది. ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, మంగళవారం నాడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) రూ.9,980.22 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అధిక స్థాయిలలో లాభాల స్వీకరణ, ఆ తర్వాత చమురు ధరల పునరుద్ధరణతో ఉపశమన ర్యాలీ ఊపు కోల్పోయింది. పెరిగిన ప్రపంచ బాండ్ దిగుబడులు ఒక కీలకమైన ప్రతికూల అంశంగా కొనసాగుతూ, నిరంతర రిస్క్ తీసుకునే అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. మొత్తం మార్కెట్ ధోరణి అప్రమత్తంగానే ఉంది. "పెట్టుబడిదారులు ముడి చమురు ధరల గమనాన్ని, బాండ్ దిగుబడులను, ద్రవ్యోల్బణ అంచనాలను, ప్రపంచ ద్రవ్య విధానంపై వాటి ప్రభావాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నార్లు" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

విస్తృత మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.44 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.34 శాతం పెరిగింది. బిఎస్‌ఈ రంగాల సూచీలలో, హాస్పిటల్స్ 4.97 శాతం, హెల్త్‌కేర్ 2.35 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.43 శాతం, మెటల్ 1.24 శాతం, కమోడిటీస్ 0.54 శాతం, ఎఫ్ఎంసిజి 0.35 శాతం పడిపోయాయి. రియల్టీ 1.42 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ క్వాలిటీ టిల్ట్ 1.10 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ 1 శాతం, ప్రైవేట్ బ్యాంక్స్ సూచీ 0.66 శాతం, టెలికమ్యూనికేషన్ 0.54 శాతం పెరిగాయి.

## 'చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లలో మార్పు లేదు'





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అక్టోబరు 1, 2026తో ప్రారంభమయ్యే త్రైమాసికానికి పిపిఎఫ్, ఎన్ఎస్‌సి వంటి వివిధ చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు చేయకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వరుసగా పదవ త్రైమాసికం పాటు ఈ రేట్లు యథాతథంగా కొనసాగుతున్నాయి. "2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్టోబరు 1, 2026 నుండి డిసెంబరు 30, 2026 వరకు ఉండే మూడవ త్రైమాసికంలో, వివిధ చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లు, అదే ఆర్థిక సంవత్సరపు రెండవ త్రైమాసికానికి (జులై 1, 2026 నుండి సెప్టెంబరు 30, 2026 వరకు) నిర్ణయించిన రేట్ల మాదిరిగానే కొనసాగుతాయి" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సుకన్య సమృద్ధి పథకం కింద చేసే డిపాజిట్లపై 8.2శాతం వడ్డీ లభిస్తుంది, అలాగే మూడవ త్రైమాసికంలో మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్ పై వడ్డీ రేటు 7.1 శాతంగా కొనసాగుతుంది. ప్రజా భవిష్య నిధి (పిపిఎఫ్), పోస్ట్ ఆఫీస్ పొదుపు డిపాజిట్ పథకాలపై వడ్డీ రేట్లు వరుసగా 7.1 శాతం, 4 శాతంగానే కొనసాగుతాయి. కిసాన్ వికాస్ పత్రపై వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంటుంది. ఈ పెట్టుబడులు 115 నెలల్లో మెచ్యూర్ అవుతాయి (పూర్తి కాలపరిమితిని పూర్తి చేసుకుంటాయి). నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సి) పై వడ్డీ రేటు అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 7.7 శాతంగా కొనసాగుతుంది. ప్రస్తుత త్రైమాసికం మాదిరిగానే, మూడవ త్రైమాసికంలో కూడా మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (నెలవారీ ఆదాయ పథకం) పెట్టుబడిదారులకు 7.4 శాతం వడ్డీని అందిస్తుంది. దీంతో, ప్రధానంగా పోస్ట్ ఆఫీసులు, బ్యాంకుల ద్వారా నిర్వహించబడే చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లు వరుసగా 10వ త్రైమాసికం పాటు మారకుండా ఉన్నాయి. ప్రభుత్వం చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లను సవరించింది.

## 'నో యుపిఐ డే' ఉపసంహారణ





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అనంతరం, అక్టోబరు 2వ తేదీని 'యుపిఐ రహిత దినం' (నోయుపిఐ డే)గా పాటించాలన్న తమ పిలుపును ప్రముఖ వ్యాపార సంఘాలు ఉపసంహరించుకున్నాయి. రూ. 2,000 పైబడిన వ్యాపారుల యుపిఐ లావాదేవీలపై ప్రతిపాదిత 0.4 శాతం రుసుముపై ఆందోళన వ్యక్తం చేయడానికి, వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 20 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం బుధవారం ఆర్థిక మంత్రిని కలిసింది. ఈ చర్య చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారాన్ని పెంచుతుందని, వ్యాపారులలో డిజిటల్ చెల్లింపుల స్వీకరణను ప్రభావితం చేస్తుందని వ్యాపారులు తెలిపారు. ఈ బృందానికి చాందినీ చౌక్ పార్లమెంట్ సభ్యుడు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి) సెక్రటరీ జనరల్ అయిన ప్రవీణ్ ఖండేల్వాల్ నాయకత్వం వహించారు. ప్రతినిధులు ప్రతిపాదిత రుసుముపై స్పష్టత కోరారు. వ్యాపార వర్గాల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వ్యాపారులు లేవనెత్తిన ఆందోళనలకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్న నిర్మాణాత్మక చర్చలు, హామీల అనంతరం ఈ నిర్ణయం తీసు కున్నట్లు ఖండేల్వాల్ తెలిపారు. ఈ చర్చలతో వ్యాపార వర్గం ప్రోత్సాహం పొందిందని, ఈ విషయంపై ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగిస్తుందని ఆయన అన్నారు. నిరసనను ఉపసంహరించుకున్నప్పటికీ, రూ. 2,000 పైబడిన అర్హత కలిగిన మర్చంట్ యుపిఐ లావాదేవీలపై ప్రతిపాదిత 0.4 శాతం రుసుము అక్టోబరు 15 నుంచి అమల్లోకి రానుంది. కొత్త ఛార్జీని అమలు చేసేలోపు తమ ఆందోళనలను పరిష్కరిస్తారని తాము ఆశాభావంతో ఉన్నామని వ్యాపార సంఘాలు తెలిపాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.